ఈనాడు

కరీంనగర్ 6-2-2018 మంగళవారం సిటీ సంపుటి 44 సంచిక 177

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఈనాడు



కరీంనగర్ 6-2-2018 మంగళవారం సిటీ సంపుటి 44 సంచిక 177
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఆటోమేషన్‌తో అల్లకల్లోలం!

- 7.5 కోట్ల నుంచి 37.5 కోట్లమంది ఉద్యోగాలు మారాల్సిందే
- ఇప్పుడు మనుషులు చేసే పనుల్లో సగం పనులు రోబోల చేతికి..
- కానీ.. కొత్తరకం ఉద్యోగాలొస్తాయి
- మెకిన్సే గ్లోబల్ సంస్థ నివేదిక



కృత్రిమ మేధస్సు ఆధారిత ఆటోమేషన్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా సమాజంలో విపరీతమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగాలపై అనూహ్యమైన ప్రభావం పడనుంది. ఇప్పుడు మనుషులు చేస్తున్న ఉద్యోగాల్లో ఎన్నో ఉద్యోగాలు భవిష్యత్తులో ఉండవు. అవన్నీ రోబోలు చేస్తుంటాయి. ఇప్పటి వరకూ చేస్తూ వస్తున్న పనులను వదలిపెట్టి, మనుషులు వాటి స్థానంలో కొత్త పనులు వెతుక్కోవలసి వస్తుంది. ఆటోమేషన్ ఫలితంగా 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 7.5 కోట్ల నుంచి 37.5 కోట్ల మంది అప్పటి వరకూ తాము చేస్తూ వచ్చిన ఉద్యోగాలను వదులుకొని కొత్త ఉద్యోగాలు వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడవచ్చని మెకిన్సే అండ్ కంపెనీకి చెందిన పరిశోధనా విభాగమైన (మిగతా 2లో)



పీఎఫ్ సొమ్ము ఉఫ్

ఆర్టీసీ భవిష్యనిధి నిర్వహణలో లోపాలు

- నిధిని ఇతరత్రా అవసరాలకు వాడుకుంటున్నట్లు ఆరోపణలు
- రికార్డులు చూపించాలంటూ ఈపీఎఫ్‌వో నోటీసులు
- రెండు రాష్ట్రాలకు ట్రస్టు విభజనపై నేడు సమావేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగుల భవిష్యనిధి ట్రస్టు నిర్వహణలో లోపాలు, కార్మికుల చందా జమలో జాప్యంపై ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్యోగుల వేతనం నుంచి మినహాయించిన భవిష్యనిధి చందాను సకాలంలో జమ చేయకుండా ఆ మొత్తాన్ని సంస్థ అవసరాలు, వేతనాల చెల్లింపులకు వాడుకోవడంపై ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. ఆయా రికార్డుల్ని తనిఖీ కోసం చూపించాలని సూచించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్టీసీ భవిష్యనిధి ట్రస్టుకు చందా జమకాకపోవడం, ఉమ్మడి ట్రస్టును రెండు రాష్ట్రాలకు విభజించాల్సిన కీలక విషయాలపై జారీ చేసిన తాఖీదుపై మంగళవారం ఈపీఎఫ్‌వో (మిగతా 2లో)

నిధులు కావాలి



కాళేశ్వరానికి మరో రూ. ఐదు వేల కోట్లు

- ఈ ఆర్థిక సంవత్సరంలోనే అవసరమని అంచనా
- పది నెలల్లోనే ఈ పథకానికి రూ.పదివేల కోట్లు ఖర్చు
- గతంలో ఏ ప్రాజెక్టుకూ ఇంతగా వెచ్చించని వైనం

ఈనాడు, హైదరాబాద్: వేగంగా పనులు జరుగుతున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ఈ ఆర్థిక సంవత్సరం ముగింపులోగా మరో రూ.ఐదువేల కోట్లు అవసరమవుతాయని నీటిపారుదల శాఖ అంచనా వేసినట్లు తెలిసింది. పంపులు, మోటార్లు అమర్చడం, బ్యారేజీల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్న నేపథ్యంలో దీనికి తగ్గట్లుగా అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికే సుమారు రూ.పదివేల కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. ఒక ప్రాజెక్టులో పదినెలల్లోనే ఇంత మొత్తం ఖర్చుచేయడాన్ని బట్టే దీనికి ప్రభుత్వమిస్తున్న ప్రాధాన్యం స్పష్టమవుతుంది. గతంలో ఏ ప్రాజెక్టుకూ ఇలా ఖర్చు చేయలేదు. ఇందులో అటవీ అనుమతి కోసం రూ.725 కోట్లు వెచ్చించారు. భూసేకరణ, విద్యుత్తు సరఫరా పనులు మొదలైనవి ఉన్నా, కేవలం పనులపైనే రూ.ఎనిమిదివేల కోట్లకు పైగా ఖర్చుచేసింది. గోదావరిపై మేడిగడ్డ వద్ద నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని మళ్లించే పనులు, ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరుకు నీటిని (మిగతా 2లో)



కొండాపూర్‌లోని పీహెచ్‌సీలో రోగులకు చికిత్సలు అందుతున్న తీరును పరిశీలిస్తున్న కేంద్ర వైద్యారోగ్య కార్యదర్శి ప్రీతి సుడాన్ తదితరులు

రోగం కుదురుద్ది!

ఆరోగ్యశ్రీలో అక్రమాలను గుర్తించడానికి సాఫ్ట్‌వేర్..

ఈనాడు, హైదరాబాద్: ఆరోగ్యశ్రీ పథకం అమలులో అక్రమాలను తొలిదశలోనే గుర్తించడానికి ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను తీసుకురానున్నారు. ఇప్పటికే ఈ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే దిశగా ఆరోగ్యశ్రీ ట్రస్టు దృష్టి పెట్టింది. సోమవారం కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి ప్రీతీ సుడాన్‌తో ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రధాన కార్యాలయంలో జరిగిన భేటీలో ఇదే విషయంపై ప్రధానంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'జాతీయ ఆరోగ్య భద్రత పథకం' అమల్లోకి తీసుకురావడానికి ముందు.. రాష్ట్రాల్లో ఇప్పటికే అమలుచేస్తున్న వివిధ ఆరోగ్య పథకాలను పరిశీలించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా కేంద్ర ఆరోగ్య కార్యదర్శి ప్రీతి సుడాన్, ఇతర కేంద్ర ఆరోగ్య ఉన్నతాధికారులు తెలంగాణలో ఆరోగ్యశ్రీ ట్రస్టును సందర్శించారు. ఈ సందర్భంగా ట్రస్టు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) డాక్టర్ మనోహర్ దృశ్యాత్మక ప్రదర్శనలో ఆరోగ్యశ్రీ పథకం అమలుతీరును వివరించారు. సేవల్లో నాణ్యతా ప్రమాణాలు, అక్రమాలను గుర్తించడానికి ప్రత్యేక తనిఖీ వ్యవస్థను ఏర్పాటుచేయడంపై జరిగిన చర్చలో.. (మిగతా 2లో)

లేదు పేచీ మాదీ పూచీ

- నకిలీ ఉత్పత్తుల ఆటకట్టించే సరికొత్త 'మార్కింగ్'!
- కచ్చితమైన విధానాన్ని రూపొందించిన శాస్త్రవేత్తలు

లండన్: నకిలీ ఉత్పత్తులను నిరోధించేందుకు ప్రపంచంలోనే అత్యంత భద్రతపరమైన గుర్తుల (మార్కింగ్) విధానాన్ని డెన్మార్క్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీంతో నకిలీ మందులు, ఆహార పదార్థాలు, కళాకృతులు వంటివాటన్నింటికీ కచ్చితంగా అడ్డుకట్ట వేయవచ్చని వెల్లడించారు. ఈ విధానంలో గుర్తులు నియమరహితం (ర్యాండమ్)గా ఉండటం వల్ల వేరేవారెవరూ అచ్చంగా అలానే ఉండేవాటిని రూపొందించలేరని పరిశోధకులు తెలిపారు. అసలు ఉత్పత్తులను పోలినరీతిలో కొందరు నకిలీలను తయారు చేస్తుండటం(పైరేటెడ్ ఉత్పత్తుల)తో ప్రపంచవ్యాప్తంగా అనేక కంపెనీలు నష్టాలు, ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. నకిలీ మందులైతే అంతర్జాలంలో(ఆన్‌లైన్) కూడా విక్రయిస్తుండటంతో ప్రజల ఆరోగ్యానికే ముప్పు వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో కోపెన్‌హాగెన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు.. తాము రూపొందించిన మార్కింగ్ విధానం అతి కచ్చితమైనదిగా చెబుతున్నారు. దీనిపై పేటెంట్ కూడా తీసుకున్న పరిశోధకులు ఏడాదిలో మార్కెట్‌లోకి తీసుకొచ్చే అవకాశం ఉందని (మిగతా 2లో)



మంత్రి శంకర్.. మళ్లీ దొరికాడు

- జైలు నుంచి విడుదలైన మూణ్నెల్లల్లో 11 దొంగతనాలు
- 39 ఏళ్లుగా 250కి పైగా చోరీలు
- ఎట్టకేలకు దొరికిన గజదొంగ

3లో

సాగునీరు.. సేద్యం.. సంక్షేమం



- గతం కంటే 20 శాతం మేర పెరగనున్న బడ్జెట్
- 2018-19 బడ్జెట్‌పై సీఎం తొలి సమీక్ష

2లో

సంగారెడ్డి జైల్లో శ్రీమంతుడు





- అతిథి ఖైదీగా గడిపిన కేరళ నగల వ్యాపారి
- 'ఫీల్ ది జైల్'కు వచ్చిన బాబీ చెమ్మనూర్

ఈ పక్క చిత్రంలో ప్రముఖ సినీనటి అనుష్క, క్రికెటర్ శ్రీశాంత్‌లతో కనిపిస్తున్న వ్యక్తి పేరు బాబీ చెమ్మనూర్..

ఆయనో పెద్ద నగల వ్యాపారి. కేరళకు చెందిన ఆయన చెమ్మనూర్ ఇంటర్నేషనల్ గ్రూప్ ఛైర్మన్. కోట్ల రూపాయల వ్యాపారం నడుపుతున్న వ్యక్తి..

విషయమేమంటే.. సరదా కోసం ఆయన సంగారెడ్డి జైల్లో ఒకరోజంతా ఖైదీగా గడిపారు.. సాధారణ ఖైదీలు వేసుకునే దుస్తులను ధరించారు. వారికిచ్చే చిప్పకూడు తిన్నారు.. విచిత్రమేమిటంటే.. ఇందుకోసం డబ్బు కూడా కట్టారు. ఎందుకు అంటే.. ఆయనకు అదో కోరికంట!

'ఫీల్ ది జైల్'లో భాగంగా ఒకరోజు అతిథి ఖైదీగా గడిపేందుకు సంగారెడ్డిలోని జిల్లా పాత జైలు (మ్యూజియం)కు సోమవారం బాబీ చెమ్మనూర్ వచ్చారు. సాధారణ వ్యక్తులు 'అతిథి ఖైదీలుగా' గడిపేందుకు తెలంగాణ జైళ్ల శాఖ ఇక్కడ అవకాశం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ సంగతి తెలుసుకున్న ఆయన తన స్నేహితులు అషీర్‌అలీ, ప్రశాంత్, వినయ్‌లతో కలిసి ఇక్కడికి వచ్చారు. జైలు అధికారులను కలిసి తమ కోరికను వివరించారు. దీంతో అధికారులు వారికి ఖైదీలకు ఇచ్చే దుస్తులను అందజేశారు. జైలు నిబంధనలు, ఖైదీల ఆహార నియమాల గురించి తెలిపారు. ఇలా జైల్లో (మిగతా 2లో)



వారి పెళ్లి.. వారిష్టం



- మేజర్ల విషయంలో తల్లిదండ్రులు సహా ఎవరికీ జోక్యం చేసుకునే హక్కులేదు
- ఖాప్ పంచాయతీలకు ముకుతాడు వేయాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పష్టీకరణ

దిల్లీ: ఇద్దరు యుక్తవయస్కులైన యువతీ యువకుల (మేజర్ల) వివాహం సంపూర్ణంగా వారి వ్యక్తిగత విషయమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర స్పష్టం చేశారు. వారి పెళ్లిలో జోక్యం చేసుకొనే హక్కు తల్లిదండ్రులకు, సమాజానికి, ఖాప్ పంచాయతీలకు, వ్యక్తులకు, వ్యక్తుల సమూహాలకు సైతం ఉండదని పేర్కొన్నారు. మేజర్ల వివాహానికి చట్టబద్ధమైన రక్షణ ఉంటుందన్నారు. పరువు హత్యలను నిరోధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర ఈ వ్యాఖ్యలు చేశారు. సామాజిక ధర్మ పరిరక్షకుల మాదిరిగా ఖాప్ పంచాయతీలు వ్యవహరించటం తగదన్నారు. ఖాప్ వంటి సంస్థలు వ్యక్తుల వైవాహిక విషయాల్లో జోక్యం చేసుకోవటాన్ని నిరోధించటానికి ఏమి చేయాలో నిర్ణయించేందుకు సీనియర్ పోలీస్ అధికారులతో ఉన్నతస్థాయి కమిటీ నియమిస్తామని తెలిపారు. "ఒక వివాహాన్ని చట్టం నిషేధిస్తుందా లేక అనుమతిస్తుందా అనేది న్యాయ వ్యవస్థే తేల్చాలి. ఖాప్ వంటి సంస్థలు కాదు" అని అన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్ (మిగతా 2లో)

ఇదీ సంగతి!



నమూనా కాదు సార్, ఇదే రాకెట్

పాషాణ హృదయుడు

- కుటుంబాన్ని ఛిద్రం చేసిన ఉన్మాది
- గొంతునులిమి భార్య, ఇద్దరు పిల్లలను చంపిన కర్కోటకుడు
- పోలీసులకు లొంగుబాటు

బాలాపూర్ - న్యూస్‌టుడే

చక్కటి ఇల్లు.. సొంతంగా దంతాల క్యాప్‌లను తయారు చేసే ల్యాబ్...భార్య, ఇద్దరు పిల్లలు.. ఆదరించే కుటుంబ సభ్యులు..ఇలా సాఫీగా సాగుతున్న జీవన నావను చేతులారా చిదిమాడో కర్కోటక భర్త..రెండేళ్లుగా వ్యాపారం చేయకుండా ఖాళీగా తిరుగుతున్న ఆ ఉన్మాది ఇద్దరు పిల్లలు, భార్యను పొట్టన పెట్టుకుని పోలీసులకు లొంగిపోయాడు. ఈ సంఘటన నగర సమీపంలోని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి జిల్లెలగూడ సుమిత్రా ఎన్‌క్లేవ్‌లో సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం. . వికారాబాద్ జిల్లా కుల్కచర్లకు చెందిన నారాయణగౌడ్ రెండో కుమారుడు మాలె హరేందర్‌గౌడ్ (35)కు మహబూబ్‌నగర్ ప్రాంతానికి చెందిన సత్యనారాయణగౌడ్ పెద్దకుమార్తె జ్యోతితో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. హరేందర్‌గౌడ్ మలక్‌పేటలో పళ్ల క్యాప్‌లను తయారు చేసే ల్యాబ్ నడుపుతున్నాడు. ఈ దంపతులకు అభితేజ్ (7), సహస్ర (5)అనే ఇద్దరు పిల్లలున్నారు. జిల్లెలగూడలోని సుమిత్రా ఎన్‌క్లేవ్‌లోని సొంతింట్లో జీవిస్తున్నారు. అయితే ల్యాబ్‌ను నడపకుండా రెండేళ్లుగా హరేందర్‌గౌడ్ ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో అతని తండ్రి, మామ వాళ్లే కుటుంబభారం మోస్తున్నారు. పనిచేయకుండా ఉన్న హరేందర్‌గౌడ్‌ను తండ్రి నారాయణగౌడ్, అన్న కృష్ణ నిలదీశారు. ల్యాబ్ సరిగా నడవడంలేదని, ఆర్డర్లు రావడంలేదని చెప్పడంతో, వారే స్వయంగా వైద్యుల వద్దకు తీసుకెళ్లి మాట్లాడారు.

సైకోగా మారి...

ఆదివారం రాత్రి పడుకునే సమయంలో ఏమి జరిగిందో కానీ తెల్లవారుజామున హరేందర్‌గౌడ్ సైకోగా మారి భార్య, కుమారుడు, కుమార్తెని హత్య చేశాడు. ముందుగా భార్యను పక్కనే ఉన్న గదిలోకి తీసుకెళ్లి గొంతు నులిమి చంపాడు. ఈ సమయంలో వారి మధ్య తీవ్ర పెనుగులాట జరిగి ఉండవచ్చని... అక్కడ చిందర వందరగా పడిన వస్తువులను బట్టి తెలుస్తుంది. ఆమె నోట్లో నుంచి తీవ్ర రక్త స్రావమైంది. ఆ తర్వాత పడకగదిలో నిద్రిస్తున్న అభితేజ్, సహస్రను గొంతు పిసికి హత్యచేశాడు.



భర్త హరేందర్‌గౌడ్‌తో జ్యోతి, కుమారుడు అభితేజ్, కుమార్తె సహస్ర (పాతచిత్రం)

అనంతరం అక్కడక్కడే తిరిగి ఉదయం కాలనీ అధ్యక్షుడి దగ్గరకు వెళ్లి భార్య, పిల్లలను చంపేశానని పోలీస్‌స్టేషన్ వరకు రావాలని కోరగా.. వారు కొంత ఆలస్యం చేశారు. దీంతో తానే స్వయంగా పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు కాలనీవాసులు తెలిపారు. సమాచారం అందుకున్న డీసీపీ వెంకటేశ్వరరావు, ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ మన్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌లతో విచారణ ప్రారంభించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. అయితే నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతుండటం గమనార్హం.

తాతా మా ఇంటికి రావా..

తాతా మా ఇంటికి రావా అంటూ నా మనువడు, మనుమరాలు ఆదివారమే ఫోన్‌లో అడిగారని.. వారం రోజుల్లో వస్తామని చెప్పానని బోరున విలపించారు జ్యోతి తల్లిదండ్రులు సత్యనారాయణగౌడ్, వజ్రమ్మ. ఇంతలోనే ఇంతటి దారుణానికి హరేందర్ ఒడిగడతాడని ఊహించలేదని. .. పెంచడం చేతకాకపోతే, తమ వద్దకు పంపించినా చూసుకునేవాళ్లమని కన్నీరుమున్నీరయ్యారు.

ఆడపిల్ల పుట్టిందన్న సంతోషం ఆవిరైపోయింది...

తనకు ముగ్గురు కుమారులని, వీరిలో ఒక్కరికే కూతురు పుట్టిందని ఎంతో సంతోషపడ్డామని, ఆ సంతోషాన్ని హరేందర్ ఎన్నో రోజులు ఉంచలేదని అతని తండ్రి నారాయణగౌడ్ కన్నీటి పర్యంతమయ్యారు. పని విషయంలో ఎన్నోసార్లు తామే కలగజేసుకుని నచ్చజెప్పేవాళ్లమని, అయినా సరిగా వినకపోయేవాడని విలపించారు.

సాగునీరు... సేద్యం... సంక్షేమం

ఈనాడు, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర 2018-19 బడ్జెట్ వ్యవసాయం, సాగునీటిరంగం, సంక్షేమం ప్రాతిపదికగా శాస్త్రీయబద్ధంగా రూపొందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్థికశాఖకు స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌పై ముఖ్యమంత్రి సోమవారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు సహా ముఖ్య అధికారులు పాల్గొన్నారు. రానున్న బడ్జెట్‌లో కూడా సాగునీరు, వ్యవసాయం, సంక్షేమానికి పెద్ద పీట వేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ మేరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిధుల వ్యయంతో బాటు వచ్చే ఏడాది కేటాయింపులపై చర్చించారు. శాఖల నుంచి వచ్చిన బడ్జెట్ ప్రతిపాదనలను సీఎంకు అధికారులు వివరించారు. రాష్ట్రంలో పన్నుల రాబడి, కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటా, ఇతర నిధులు, బడ్జెట్ వెలుపల నుంచి సమీకరించుకునే నిధులు సహా వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం 1.49 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2018-19కి బడ్జెట్ పరిమాణంపై చర్చించినపుడు వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని 19 నుంచి 20 శాతం వరకూ పెరుగుదలకు అవకాశం ఉందని సీఎంకు వివరించినట్లు తెలిసింది. జీఎస్టీ పన్నుల రాబడి గాడిలో పడటం, జీఎస్టీ పరిధిలో లేని పన్ను వసూళ్లలో వృద్ధిరేటు కొనసాగుతుండటం వంటి పరిస్థితుల నేపథ్యంలో వచ్చే ఏడాది బడ్జెట్‌పై మాట్లాడారు. శాఖలవారీగా కేటాయింపుల పక్కాగా ఉండటంతో బాటు నిధులను పూర్తిగా వినియోగించడంపై చర్చించారు. ఈ సమావేశంలో బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి ఆర్థికమంత్రి, ఆర్థికశాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. తొలి సమావేశంలోనే అనేక అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఆర్థికశాఖ త్వరలో సీఎం సూచనలు, ప్రభుత్వం లక్ష్యాలపై వివిధశాఖల మంత్రులతో కూడా సమావేశమై బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించనుంది.

లేదు పేచీ మాదీ పూచీ

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నారు. ఈ విధానంలో రూపొందించే సాంకేతిక డేటాబేస్ ద్వారా ఏ ఉత్పత్తులైనా అసలువో, నకిలీవో డీలర్లు వెనువెంటనే గుర్తించగలరని విశ్వవిద్యాలయం సహాయ ప్రొఫెసర్ థామస్‌జస్ట్ సోరెన్‌సెన్ వెల్లడించారు. భారీ పరిమాణంలో ఇసుక రేణువులను తీసుకుని.. అరుదైన ఎరోపియమ్, టెర్బియమ్, డిస్ప్రోసియమ్ అనే లోహాలను మిశ్రంచేసి పరిశోధనలు జరిపారు. వాటినుంచి వేరెవరూ గుర్తించలేని (అపరిమితమైన సంఖ్యతో) ఓ మార్కింగ్ కోడ్‌ను రూపొందించారు.

రోగం కుదురుద్ది!

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స దశలోనే అక్రమాలను గుర్తించే విధంగా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తే బాగుంటుందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి ప్రీతి సుడాన్ సూచించారు. దీనిపై ఆరోగ్యశ్రీ సీఈఓ మాట్లాడుతూ.. ఈ విషయంనూ ఇప్పటికే చర్యలు చేపట్టామనీ, ఇటీవల దక్షిణ కొరియా బృందం ఆరోగ్యశ్రీని సందర్శించినప్పుడు అక్రమాలను తొలిదశలో గుర్తించే సాంకేతిక సమాచారం తీసుకున్నామనీ, త్వరలోనే తెలంగాణలో అక్రమాలను గుర్తించే సాఫ్ట్‌వేర్‌ను అమల్లోకి తీసుకొస్తున్నామని డాక్టర్ మనోహర్ తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం అమలుపై మరింత సమాచారాన్ని తెలుసుకోవడానికి మంగళవారం కూడా కేంద్ర ఆరోగ్య ఉన్నతాధికారులు ట్రస్టు సీఈఓతో సమావేశం కానున్నారని వైద్యవర్గాలు తెలిపాయి. నిమ్స్‌లో అమలుచేస్తున్న సీడాక్ విధానాన్ని కూడా మంగళవారం కేంద్ర అధికారులు పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ప్రీతీ సుడాన్ సోమవారం పరిశీలించారు. 'ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డింగ్' (ఈహెచ్‌ఆర్)ను ప్రారంభించారు.

ఎన్‌ఎస్‌యూఐ సభ్యత్వాల నమోదు పూర్తి

తెలంగాణలో ఎన్‌ఎస్‌యూఐ సభ్యత్వం నమోదు ప్రక్రియ పూర్తయిందని ఆ విభాగం కేంద్ర ఎన్నికల కమిషన్ కిరణ్ ముగబసవ్ తెలిపారు. క్రియాశీల సభ్యత్వం 43,278 కాగా, సాధారణ సభ్యత్వం 2,58,000 నమోదైందన్నారు. క్రియాశీల సభ్యులు ఈ విభాగం ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులన్నారు.

శిక్షలు పడుతున్నా ఆగని దాడులు

- దళిత, గిరిజనులపై పెరుగుతున్న వేధింపులు
- నాలుగేళ్లలో 7,032 కేసుల నమోదు
- 2017లో 77 కేసుల్లో శిక్షల ఖరారు

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో దళిత, గిరిజనులపై దాడులు, వేధింపులు పెరుగుతూనే ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నా దాడులు ఆగడం లేదు. ఏటా అట్రాసిటీ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. 2017 నవంబరు నాటికే దాదాపు 1,750 కేసులు నమోదయ్యాయి. తెలంగాణ ఏర్పాటైన తరువాత దాడులు ఆగడం లేదు. చిన్న చిన్న వివాదాలు, వ్యక్తిగత కక్షలతో దూషణలకు దిగుతున్నారు. వేధింపులకు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో దాడులు శ్రుతి మించి హత్యలు జరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ మహిళలపై లైంగిక వేధింపులతో పాటు అత్యాచారాలు పెరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంపై ఆయా వర్గాల్లో అవగాహన పెరగడం, చదువుతున్న యువత ఎక్కువ కావడంతో తమకు జరిగిన అన్యాయంపై కేసులు పెడుతున్నారు. ఇంకా కొన్ని కేసులు ఛార్జిషీట్, న్యాయస్థానం వరకు వెళ్లడం లేదు. బాధితులను బెదిరించడం, సాక్షులు ముందుకు రాకపోవడంతో కొన్ని కేసులు ఆదిలోనే వీగిపోతున్నాయి. ఏటా నమోదవుతున్న కేసుల్లో 50 శాతమే ఛార్జిషీటు వరకు వెళ్తున్నాయి. వీటిలోనూ 20- 30 శాతం కేసులే ఏటా పరిష్కారమవుతున్నాయి. ఈ ఏడాది 380 కేసులను పరిష్కరించగా 77 కేసుల్లో నిందితులు దోషులుగా తేలింది. తెలంగాణ ఏర్పాటైన తరువాత ఈ స్థాయిలో శిక్షలు పడటం అత్యధికమని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

3,042 మందికి సాయం

చట్టం కింద బాధితులకు పునరావాసం, పరిహారం కోసం ఇచ్చే సహాయాన్ని ఇటీవల ప్రభుత్వం పెంచింది. కేసుల తీవ్రత ఆధారంగా రూ.75 వేల నుంచి రూ.8.25 లక్షల వరకు చెల్లిస్తోంది. గతేడాది కేంద్రం నుంచి దాదాపు రూ.13 కోట్ల నిధులు అందాయి. ఇందులో 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.5.94 కోట్లు ఖర్చు చేసి 849 మందికి సాయం అందించారు. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి ఈ చట్టం కింద 3,042 మందికి ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఏడాది	కేసుల నమోదు	పరిష్కరించినవి	శిక్షలు	పెండింగ్ కేసులు
2014	1,760	585	42	2,058
2015	1,678	936	87	2,235
2016	1,904	526	35	2,707
2017 (నవంబరు)	1,750	380	77	2,421

వారి పెళ్లి.. వారిష్టం

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులుగా ఉన్నారు. తామూ కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహిస్తున్నామని, హిందూ వివాహ చట్టం ప్రకారం సన్నిహిత రక్తసంబంధీకుల మధ్య పెళ్లిళ్లు చెల్లవన్న నిబంధనలు ఉన్నాయి అంటూ ఖాప్ పంచాయతీ తరఫు న్యాయవాది ప్రస్తావించగా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "వివాహమనేది ఇద్దరు వయోజనుల మధ్య విషయం. వారి ఇష్టాయిష్టాల ప్రకారమే జరగాలి. చట్టాన్ని మీ (ఖాప్ పంచాయతీల) చేతుల్లోకి తీసుకోవటం తగదు. ఈ వ్యవహారంతో ఖాప్ పంచాయతీలకు ఎలాంటి సంబంధంలేదు" అని స్పష్టం చేసింది. పరువు హత్యలను నిరోధించాలంటూ శక్తివాహిని అనే సంస్థ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ధర్మాసనం శుక్రవారానికి వాయిదా వేసింది.

భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ వయోజన మహిళకు ఉంది

దిల్లీ: వయోజన (అడల్ట్) మహిళకు తాను ఎవరితో జీవించాలో ఆ భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హరియాణాకు సంబంధించిన ఓ కేసులో సుప్రీం ఈ తీర్పు చెప్పింది.

సంగారెడ్డి జైల్లో శ్రీమంతుడు

(మొదటి పేజీ తరువాయి)

ఉండడం కోసం ఆ శ్రీమంతుడు తనకు, తన మిత్రులకు కలిపి రోజుకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున నలుగురికి రూ.2000 రుసుం చెల్లించారు. ఒకరోజైనా జైలు జీవితం గడపాలనేది తన చిరకాలపు కోరిక అని ఇందుకోసం 15 ఏళ్ల క్రితమే ఓ పోలీసు అధికారిని సంప్రదించానని బాబీ చెమ్మనూర్ విలేకరులకు వివరించారు. అయితే నేరం చేసిన వారికి మాత్రమే జైలుకు వచ్చే అవకాశం ఉంటుందని.. ఇతరులెవరూ రాకూడదని ఆ అధికారి తెలిపారన్నారు. సంగారెడ్డి జిల్లా జైలుకు అతిథిగా వచ్చి జైలు జీవితం గడిపేందుకు కల్పిస్తున్న అవకాశం గురించి ఇటీవల ఓ టీవీ ఛానల్ ద్వారా తెలుసుకుని వచ్చానని వివరించారు. భారత్, అమెరికా, గల్ఫ్ దేశాల్లో తనకు నగల వ్యాపారాలు ఉన్నాయని ఆయన తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొంటుంటానని వివరించారు. అంతేకాదు 'డొనేట్ బ్లడ్.. సేవ్ లైఫ్' నినాదంతో 812 కిలోమీటర్ల పరుగు చేశానని చెప్పారు. కేరళలో మానసిక రోగులకు ఆశ్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

-సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే

నిధులు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

తెచ్చే పనులను వీలైనంత వరకు ఈ వర్షాకాలంలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. జాప్యం జరిగినా పాక్షికంగా నీటిని మళ్లించి, ఏడాది చివరినాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోనుంది. ఈ మేరకు పనులు వేగంగా జరగాలంటే నిధులను కూడా విడుదల చేయాల్సి ఉంటుంది.

2017-18 బడ్జెట్‌లో రూ.7,105 కోట్లు

పంపులు, మోటార్లను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉన్నందున వీటికి ఒకేసారి ఎక్కువ మొత్తంలో నిధులు అవసరమవుతాయి. బ్యారేజీ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రూ.7,105 కోట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించింది. ఇందులో రూ.3,500 కోట్లు ఇప్పటివరకు చెల్లించింది. ఈ పనులకున్న ప్రాధాన్యం, బడ్జెట్ విడుదలలో జాప్యమైతే పనులపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొన్న ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణానికి ఒప్పందం చేసుకొంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు బ్యాంకులు రూ.6,500 కోట్లు ఇచ్చాయి. ఆంధ్రాబ్యాంకు నేతృత్వంలోని కన్సార్టియంతో మొదట, పంజాబ్ నేషనల్ బ్యాంకు నేతృత్వంలోని కన్సార్టియంతో రెండో దఫా రుణానికి ఒప్పందం జరిగింది. ప్రతి నెలా ఒప్పందం చేసుకొన్న పనులకు చెల్లించే బిల్లులో బ్యాంకులు 80 శాతమిస్తే, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం మార్జిన్‌మనీ విడుదల చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఆంధ్రా బ్యాంకు నేతృత్వంలోని కన్సార్టియం రూ.3,200 కోట్లు ఇవ్వగా, రూ.630 కోట్లు ప్రభుత్వం మార్జిన్‌మనీగా చెల్లించింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు కన్సార్టియం కూడా రూ.3,100 కోట్లు ఇచ్చినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. జనవరిలో చేసిన.. ఫిబ్రవరి, మార్చిలో చేసే పనులకు కలిపి ఇంకా సుమారు రూ.ఐదువేల కోట్లు అవసరమని అంచనా. ఇందులో 80 శాతం బ్యాంకులిస్తే, 20 శాతం మార్జిన్‌మనీగా బడ్జెట్ నుంచి ఇవ్వాల్సి ఉంటుంది. అంటే కనీసం రూ.వెయ్యికోట్లు బడ్జెట్ నుంచి ఇవ్వాలి. ప్రస్తుతం నీటిపారుదల శాఖ కోరినట్లుగా ఇస్తే మొత్తం రూ.15వేల కోట్లు ఖర్చు చేసినట్లవుతుందని, ఏ ప్రాజెక్టులోనూ ఇంత మొత్తంలో ఖర్చు చేసిన పరిస్థితి ఉండదని ఆ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

ఆటోమేషన్‌తో అల్లకల్లోలం!

(మొదటి పేజీ తరువాయి)

మెకిన్సే గ్లోబల్ ఇనిస్టిట్యూట్ (ఎంజీఐ) స్పష్టం చేసింది. 'పోయే ఉద్యోగాలు, వచ్చే ఉద్యోగాలు- ఆటోమేషన్ ఫలితంగా కార్మికశక్తిలో మార్పులు' అనే పేరుతో రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది.


ఉద్యోగాల్లో మార్పులు

ఈ నివేదిక ప్రకారం ఆటోమేషన్ ఫలితంగా 2030 నాటికి ఉద్యోగాల తీరుతెన్నుల్లో ఎన్నో మార్పులు వస్తాయి. ఇప్పుడు మనం చూసే/ చేసే ఉద్యోగాల్లో చాలా ఉద్యోగాలు అప్పటికి ఉండవు.

- దీనివల్ల అభివృద్ధి చెందిన దేశాల్లోని ఉద్యోగులకు ఎక్కువ నష్టం జరుగుతుంది. అమెరికా, జర్మనీ, జపాన్, చైనా దేశాల్లో చాలా మంది అప్పటి వరకూ చేస్తూ వచ్చిన ఉద్యోగాలు వదులుకొని కొత్త ఉద్యోగాలు అన్వేషణలో నిమగ్నం కావలసి వస్తుంది.
- అకౌంటింగ్, బ్యాక్-ఆఫీస్ ట్రాన్సాక్షన్ ప్రాసెసింగ్, మార్ట్‌గేజ్, పారాలీగల్...తదితర ఉద్యోగాలు రోబోల పరమవుతాయి.
- కానీ తక్కువ వేతనాలు లభించే, మనుషులు మాత్రమే చేయగల ఉద్యోగాలైన తోటపని, ప్లంబింగ్, చిన్నపిల్లలు- వృద్ధుల సంరక్షణ... తదితర పనులు చేసే కార్మికులకు మాత్రం ముప్పు లేదు. ఈ పనులు రోబోలు చేయలేవు. పైగా తక్కువ జీతాలకు పనిచేసే మానవ శ్రామికుల స్థానంలో ఎంతో ఖర్చుతో కూడిన రోబోలను పెట్టలేరు.

అధ్యయనం ఎలా సాగింది?

ఈ నివేదిక తయారీలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఇప్పుడు ఎటువంటి ఉద్యోగాలు ఉన్నాయి, భవిష్యత్తులో ఏ ఉద్యోగాలు పోయి ఎటువంటి కొత్త ఉద్యోగాలు వస్తాయి? అనే అంశాన్ని ఎంజీఐ పరిశోధకులు విశ్లేషించారు.



ఈ నైపుణ్యాలు అవసరం

- అనుభవాన్ని రంగరించటం
- వాటాదార్లతో సంప్రదింపులు
- వ్యాపార కార్యకలాపాలపై పర్యవేక్షణ
- అసంఘటిత రంగంలో శారీరక శ్రమ
- సమాచారాన్ని పరిశీలించటం
- సమాచార సేకరణ
- సంఘటిత రంగంలో శారీరక శ్రమ

ఇందులో భాగంగా 46 దేశాల్లోని 800 రకాలైన పనులను పరిశీలించారు. ప్రధానంగా పెద్ద ఆర్థిక వ్యవస్థలైన చైనా, జర్మనీ, భారత్, జపాన్, మెక్సికో, అమెరికా దేశాల్లోని స్థితిగతులను పరిగణలోకి తీసుకున్నారు. తద్వారా కార్మిక ప్రపంచంలో వచ్చే మార్పులను అంచనా వేశారు.

సునాయాస మార్పిడే సవాలు

- కార్మిక శక్తి పాత ఉద్యోగాల నుంచి కొత్త ఉద్యోగాల్లో మారటం అంత సులువైన విషయం కాదు. ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా సునాయాసంగా పాత ఉద్యోగాల నుంచి కొత్త పనుల్లోకి కార్మికులు మారటమే పెద్ద సవాలు.
- నలభై ఏళ్ల వయస్సు మించిన కార్మికులు కొత్త ఉద్యోగాల్లో అంత సులువుగా కుదురుకోలేరు. వారికి మళ్లీ శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది.
- పాత ఉద్యోగాన్ని వదలిపెట్టి కొత్త పనికి సిద్ధమయ్యే క్రమంలో కార్మికులకు ఆర్థికంగా అండదండలు అందించాల్సి వస్తుంది. ఈ సమయంలో జీతభత్యాలు ఉండవు కాబట్టి, నిరుద్యోగ బీమాను అమలు చేయాలి. పాత ఉద్యోగంలో ఎక్కువ వేతనం వచ్చి, కొత్త ఉద్యోగంలో అంత సొమ్ము లభించకపోయినా సమస్యే. సంబంధిత కార్మికుడి జీవన ప్రమాణాలు ఆమేరకు క్షీణిస్తాయి. దీన్ని భర్తీ చేయాల్సి ఉంటుంది.

కనీస సార్వజనీన ఆదాయ పథకం

ఈ సమస్యకు సార్వజనీన ఆదాయం (యూబిఐ- యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్) పథకం ఒక్కటే పరిష్కారమని ఎంజీఐ పరిశోధకులు నివేదికలో అభిప్రాయపడ్డారు. దీని కోసం కెనడా, భారతదేశాల్లో అమలవుతున్న యూబీఐ పథకాలను వారు పరిశీలించారు. అమెరికా, ఉగాండా, కెన్యా, స్పెయిన్, యూకే, నెదర్లాండ్స్ దేశాల్లో ప్రస్తుతం ప్రయోగాల దశలో ఉన్న యూబిఐ పథకాలను సైతం అధ్యయనం చేశారు.

కార్మికశక్తికి ప్రత్యామ్నాయం లేదు...

ఎంజీఐ నివేదిక ప్రకారం ఆటోమేషన్ తప్పదు. అది అనివార్యం. కానీ కార్మికశక్తికి ప్రత్యామ్నాయం లేదు. సాంకేతిక పరంగా ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ, యంత్రాల వెనుక, యంత్రాల తోపాటు మనుషులు ఉండాల్సిందే. కాకపోతే సాంకేతిక మార్పులకు అనుగుణంగా మానవశక్తిని సన్నద్ధం చేయటం, మార్పును సునాయాసంగా అధిగమించటమే సమస్య. అందుకు తగిన ముందస్తు సన్నాహాలు చేస్తే ఇబ్బందులు తగ్గుతాయి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

కొత్త ఉద్యోగాలకు కొదవ ఉండదు...

- ఆటోమేషన్ వల్ల చోటుచేసుకునే అనూహ్యమైన మార్పులతో ప్రస్తుత ఉద్యోగాలకు ముప్పు ఉన్నప్పటికీ, అదే సమయంలో కొత్త ఉద్యోగాలకు కొదవ ఉండదు.
- వాతావరణ మార్పుల ప్రభావం, కొత్త సదుపాయాల కల్పన, ఇంధన పొదుపు, పెరిగిపోతున్న వృద్ధుల సంఖ్యకు అనుగుణంగా వృద్ధాప్య సేవలు... తదితర విభాగాల్లో కొత్త ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉంటుంది.
- ఎన్ని ఉద్యోగాలను అయితే ఆటోమేషన్ వల్ల కోల్పోయే పరిస్థితి వస్తుందో... అన్ని కొత్త ఉద్యోగాలు తప్పనిసరిగా లభిస్తాయని ఎంజీఐ పరిశోధకుల విశ్వాసం.
- కొత్తగా అందుబాటులోకి వచ్చే సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కొత్త ఉద్యోగాల సృష్టి ఉంటుందని అంచనా.



పీఎఫ్ సొమ్ము ఉఫ్

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ కార్యాలయంలో జరిగే సమావేశానికి ఆర్టీసీ అధికారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఏపీ పునర్విభజన తర్వాత ఆర్టీసీ ఉద్యోగుల భవిష్యనిధి ట్రస్టు ఇంకా ఉమ్మడిగానే కొనసాగడం, పీఎఫ్ నిధులను సంస్థ అవసరాలకు వాడటం లాంటి అంశాలు ప్రధాన అజెండాగా ఉన్నాయి. ప్రస్తుతానికి ఇరు రాష్ట్రాలు తమ ఉద్యోగుల పీఎఫ్ చందాను వేర్వేరుగా జమ చేస్తూ తాత్కాలికంగా ట్రస్టు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా అధికారికంగా విభజన జరగాల్సి ఉంది. తద్వారా రెండు రాష్ట్రాలు సొంతంగా పీఎఫ్ ట్రస్టుల నిర్వహణకు వీలవుతుంది. ఇదే విషయమై ఇప్పటికే ఏపీ ఆర్టీసీ అధికారులతో చర్చలు కూడా నిర్వహించారు.

ఇతర అవసరాలకు పీఎఫ్ సొమ్ము..

తెలంగాణ ఆర్టీసీలో దాదాపు 56 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఆర్టీసీ సంస్థ.. ఈపీఎఫ్‌వో కింద మినహాయింపు ట్రస్టు పరిధిలోకి వస్తుంది. ఈ సంస్థ పీఎఫ్‌ను ఆర్టీసీ సొంతంగా నిర్వహిస్తుంది. దీనిపై పూర్తి పర్యవేక్షణ బాధ్యత ఈపీఎఫ్‌వోది. కార్మికులకు ప్రతినెలా చెల్లించే వేతనంలో పీఎఫ్ వాటా సొమ్మును మినహాయించి, ప్రతి నెలా పదో తేదీన ఆర్టీసీ పీఎఫ్ ట్రస్టులో ఆ మొత్తాన్ని జమ చేయాల్సి ఉంటుంది. ప్రతినెలా ఉద్యోగుల నుంచి రూ.29 కోట్లు, యాజమాన్య వాటా కింద రూ.19 కోట్లు జమ కావాలి. యాజమాన్య వాటాలో 8.33 శాతం ఉద్యోగుల పింఛను పథకం కిందకు వెళ్తుంది. ఆర్టీసీ పీఎఫ్ ట్రస్టు నిబంధనల ప్రకారం.. ట్రస్టులో కచ్చితంగా రూ.1600 కోట్ల నిల్వలు ఉండాలి. ఆయా సొమ్మును బాండ్లు, ఇతర పెట్టుబడుల రూపంలో పెట్టి, ఆ మొత్తంపై వచ్చే ఆదాయాన్ని వడ్డీ కింద చెల్లిస్తారు. కానీ ట్రస్టు నిల్వలో ఎప్పుడూ దాదాపు రూ.300 నుంచి రూ.400 కోట్ల వరకు లోటు ఉంటోంది. ప్రస్తుతానికి రూ.429 కోట్ల లోటు ఉందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇలా నిబంధనలు ఉల్లంఘించి ట్రస్టు నుంచి తీసుకున్న సొమ్మును అత్యవసర వేతనాల చెల్లింపు, వేర్వేరు అవసరాలకు వాడుకుంటున్నారు. ఈ విషయాన్ని ఆడిట్‌లో గుర్తించిన ఈపీఎఫ్‌వో ప్రతిసారీ నోటీసులు జారీ చేస్తోంది. ఏటా కనీసం నాలుగు నోటీసులు సంస్థ అందుకుంటోంది. ఇలా నోటీసులు జారీ చేసినపుడు ఎంతో కొంత ట్రస్టులో జమచేసి, తిరిగి అవసరాలకు వాడుకుంటూనే ఉంది. సాధారణంగా ఉద్యోగి, కార్మికుడి వేతనం నుంచి చందాను తీసుకున్న వెంటనే ఆ సొమ్మును పీఎఫ్ ట్రస్టులో జమ చేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే ఈపీఎఫ్‌వో చట్టం ప్రకారం నోటీసులు ఇవ్వడంతో పాటు శిక్షలు ఉంటాయి. ట్రస్టు నిల్వలను తగ్గించి పీఎఫ్ నిధులను ఇతరత్రా అవసరాలకు వాడుకోవడంతో వాటిపై వచ్చే వడ్డీ కూడా కోల్పోవాల్సి వస్తోంది. పీఎఫ్ ట్రస్టు నిర్వహణలో లోపాలపై ఇప్పటికే గుర్తింపు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. మంగళవారం జరిగే సమావేశంలో ఇదే విషయమై ప్రశ్నిస్తామని చెబుతున్నాయి. ఉద్యోగి పదవీ విరమణ సమయంలోనూ సదుపాయాలు ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నాయి.

గ్రహం అనుగ్రహం

6-2-2018 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; బహుళ పక్షం
షష్ఠి: మ. 12-15 తదుపరి సప్తమి
చిత్త నక్షత్రం: మ. 3-02 తదుపరి స్వాతి
అమృత ఘడియలు: ఉ. 8-31 నుంచి 10-09 వరకు
వర్జ్యం: రా. 8-51 నుంచి 10-30 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-49 నుంచి 9-34 వరకు
తిరిగి రా. 10-57 నుంచి 11-48 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6-35; సూర్యాస్తమయం: సా.5-33

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
మెదక్	11.9	35.4
అనంతపురం	14.2	31.9
రామగుండం	14.6	33.6
నిజామాబాద్	15.0	31.0
కరీంనగర్	15.0	32.5
హైదరాబాద్	15.2	30.5
ఆదిలాబాద్	15.2	34.1
మహబూబ్‌నగర్	15.5	33.1
విశాఖపట్నం	15.6	31.1
హన్మకొండ	16.0	33.5
తిరుపతి	16.5	30.9
కర్నూలు	16.2	33.1
కడప	18.0	34.0
ఖమ్మం	18.0	35.0
విజయవాడ	18.2	30.6
సూర్యాపేట	20.0	35.5



మైఖేల్ ఎన్.హాల్‌కు బయోఆసియా పురస్కారం

ప్రకటించిన మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: ఈ ఏడాది బయో ఆసియా ప్రతిభా పురస్కారానికి స్విట్జర్లాండ్ బాసెల్‌లోని బయోజెంట్రం విశ్వవిద్యాలయం ఆచార్యులు మైఖేల్ ఎన్. హాల్ ఎంపికయ్యారు. తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ సోమవారం దీనిని ప్రకటించారు. ఈ నెల 22 నుంచి హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో బయోఆసియా సదస్సు ప్రారంభం కానుంది. ప్రతి ఏటా సదస్సును పురస్కరించుకొని జినోమ్ వ్యాలీ పేరిట ప్రతిభా పురస్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. అత్యున్నత శాస్త్రవేత్తలతో కూడిన కమిటీ ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తల పేర్లను పరిశీలించి, అర్హులైన వారిని ఎంపిక చేస్తోంది. ఈ ఏడాది అజిత్‌షెట్టి (జాన్సన్ అండ్ జాన్సన్), రాబర్ట్ నాయిస్మిత్ (జుజుమా), మకరంద్ జావడేకర్ (ఫైజర్)లతో కూడిన కమిటీ ప్రొఫెసర్ హాల్‌ను ఎంపిక చేసింది. మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులను నయం చేయడానికి అవసరమైన ఔషధాలపై విస్తృతస్థాయిలో పరిశోధనలు చేసినందుకు ఆయన పేరును పరిగణలోకి తీసుకున్నారు. కమిటీ సిఫార్సు మేరకు మంత్రి కేటీఆర్ సోమవారం తన కార్యాలయంలో దీనిపై ప్రకటన చేశారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బయోఆసియా సదస్సు సందర్భంగా ప్రఖ్యాత శాస్త్రవేత్త మైఖేల్ ఎన్. హాల్‌ను విశిష్ట పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఈసారి సదస్సును భారీ ఎత్తున నిర్వహిస్తున్నామనీ, ప్రపంచవ్యాప్తంగా పేరొందిన పెట్టుబడిదారులు, వాణిజ్య వేత్తలు, శాస్త్రవేత్తలు హాజరవుతారని చెప్పారు. తెలంగాణ ఇప్పటికే జీవశాస్త్రాల రంగంలో అగ్రభాగాన ఉందని, బయోఆసియా సదస్సు రాష్ట్రానికి మరింత ఊతమిస్తుందని తెలిపారు.

లొంగిపోయిన జగన్నాథ్ మిశ్ర

దాణా కుంభకోణంలో నిందితుడు

రాంచీ: దాణా కుంభకోణంలో దోషిగా కోర్టు ప్రకటించిన బిహారు మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్ర సోమవారం నాడిక్కడ ప్రత్యేక సీబీఐ న్యాయస్థానంలో లొంగిపోయారు. ఆయనను వెంటనే ఇక్కడి కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసులో మిశ్రకు జైలు శిక్ష పడిన విషయం గమనార్హం. ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్, జగన్నాథ్ మిశ్ర మరో 48 మందిని కోర్టు ఇటీవలే దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో లాలూ, జగన్నాథ్ మిశ్ర లిద్దరికీ అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష పడిన విషయం తెలిసిందే.

పురపాలనలోకి 167 గ్రామాలు

- అన్నీ బాహ్యవలయ రహదారి పరిధి లోనివే
- కొత్తవాటిలో రెండేళ్లపాటు పన్నులు పెరగవు
- జీహెచ్ఎంసీలో కొత్త జోన్లు, సర్కిళ్లు
- రెండు పడక గదుల పథకానికి ఉక్కు కంపెనీలు సహకరించాలి
- పలు సమీక్షల్లో మంత్రి కేటీఆర్



సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్ : హైదరాబాద్ బాహ్యవలయ రహదారి (ఓఆర్ఆర్) పరిధి లోపల ఉన్న 167 గ్రామాలను భౌగోళిక పరిస్థితుల ఆధారంగా కొత్త పురపాలక సంఘాలుగా ఏర్పాటు చేస్తామని లేదా ఇతర పురపాలక సంఘాల్లో కలుపుతామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. పురపాలక సంఘాలుగా ఏర్పాటైన తర్వాత కనీసం రెండేళ్ల పాటు పన్నుల పెంపు ఉండబోదని, నిధులు కూడా ఇస్తామన్నారు. 15 వేల జనాభాకు మించి ఉన్న గ్రామ పంచాయతీలను నగర పంచాయతీలుగా లేదా పురపాలక సంఘాలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాలను నగర పంచాయతీలుగా మార్చడంపై సోమవారం సచివాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, కుత్బుల్లాపూర్, మహేశ్వరం, సంగారెడ్డి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌తో బాటు రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. అధికారుల నివేదికలతో బాటు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి కొత్త పురపాలికలకు ప్రతిపాదనలివ్వాలన్నారు. ఎమ్మెల్యేలతో కలిసి పనిచేయాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. అమీన్‌పూర్, బొల్లారం, కొంపల్లి, పుప్పాలగూడ, ప్రగతినగర్, తెల్లాపూర్, కొల్లూరు, తుర్కయంజాల్‌లతో బాటు మరికొన్ని మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడంపై చర్చించారు.

మీ ముద్ర ఉండేలా పనిచేయండి

పట్టణాలపై తమ ముద్ర ఉండేలా పురపాలక కమిషనర్లు పనిచేయాలని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సచివాలయంలో తెలంగాణ పురపాలక కమిషనర్ల దైనందినిని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, పలువురు కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పట్టణాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అర్బన్ మిషన్ భగీరథ ద్వారా రూ.4500 కోట్లు వ్యయం చేస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీలో కొత్త జోన్లు, సర్కిళ్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. పురపాలక కమిషనర్ల పదోన్నతులు, ఖాళీల భర్తీని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

తక్కువ ధరకే ఉక్కు ఇవ్వండి

పేదల కోసం ప్రభుత్వం చేపట్టిన రెండు పడక గదుల గృహాల పథకానికి అవసరమైన ఉక్కును సామాజిక బాధ్యత కింద తక్కువ ధరకే విక్రయించాలని కంపెనీల యాజమాన్యాలను మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కేటీఆర్ కోరారు. ఉక్కు ధరలు పెరిగిన నేపథ్యంలో గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్ ఎం. భూంరెడ్డి, గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్‌తో కలిసి ఉక్కు సంస్థల ప్రతినిధులతో మంత్రులు సమీక్షించారు. సిమెంటు కంపెనీలు సామాజిక బాధ్యత కింద బస్తా సిమెంటును రూ.230కే విక్రయిస్తున్నారని.. ఇదే తరహాలో ఉక్కు సంస్థలూ ధర నిర్ణయించాలని సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా 2.6 లక్షల గృహాలు నిర్మిస్తున్నామన్నారు. కంపెనీలకు జాప్యం లేకుండా ఆన్‌లైన్లో బిల్లులు చెల్లిస్తామన్నారు. మార్కెట్‌లో హెచ్చుతగ్గులుంటాయని, ఉక్కుకు ప్రాథమిక ధరను నిర్ణయించడం సాధ్యం కాదని, మరోమారు కంపెనీ యాజమాన్యాలతో చర్చిస్తామని ప్రతినిధులు తెలిపారు. రెండ్రోజుల్లో మరోసారి సమావేశమై స్పష్టతకు రావాలని మంత్రులు నిర్ణయించారు. సమావేశంలో అఖిల భారత ఉక్కు సంఘం ఛైర్మన్ సురేష్‌కుమార్ సింఘాల్, విశాఖ, జిందాల్, శాలినీ తదితర ఉక్కు కంపెనీల యాజమానులు, ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మైనింగుటుడే సదస్సుకు గవర్నర్‌ను ఆహ్వానించిన కేటీఆర్

పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఈ నెల 14 నుంచి హైదరాబాద్‌లో జరిగే మైనింగుటుడే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానించారు. రాష్ట్రంలో గనులు, ఖనిజాల రంగం పురోగతి ఇతర అంశాలను ఆయనకు వివరించారు. ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

మంత్రి శంకర్.. మళ్లీ దొరికాడు

- జైలు నుంచి విడుదలైన మూణ్నెల్లలో 11 ఇళ్లలో చోరీలు
- వలవేసి పట్టుకున్న పోలీసులు
- 370 గ్రాముల బంగారం స్వాధీనం





స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న సీపీ వీవీ శ్రీనివాసరావు ★ దోపిడీ దొంగ శంకర్

ఈనాడు, హైదరాబాద్: 'మంత్రి' అనగానే రాజకీయ నేత అనుకునేరు. ఇతను కంత్రీ. తాళాలు వేసిన ఇల్లు కనిపిస్తే.. కన్నమేసి ఉన్నదంతా ఊడ్చేసే జగజ్జంత్రీ. మంత్రి అనేది ఇతని ఇంటి పేరు. 39 ఏళ్లుగా చోరీలకు పాల్పడుతున్న మంత్రి శంకర్ అలియాస్ శివన్న(58)ను దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం మరోసారి అరెస్ట్ చేశారు. అతన్నుంచి 370 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ చైతన్య కుమార్‌తో కలిసి సోమవారం శంకర్ నేర్రశైలిని వెల్లడించారు.

ఇళ్లల్లో దొంగతనాలు చేయడం, పోలీసులను ముప్పతిప్పలు పెట్టాకే దొరకడం.. జైలుకు వెళ్లడం.. .బయటకు రాగానే మళ్లీ చోరీలు చేయడం ఇతని దినచర్య. ఈ క్రమంలోనే మూడు నెలల క్రితం జైలు నుంచి విడుదలైన శంకర్ హైదరాబాద్‌లోని 11 ఇళ్లల్లో దొంగతనాలు చేశాడు. అతని కదలికలపై నిఘా ఉంచినా ఫలితం లేకపోవడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పాతబస్తీలోని అతడి అనుచరుడు, రౌడీ షీటర్ ఒబైద్‌పై నిఘా ఉంచారు. కాలాపత్తర్‌లోని ఓ ఇంట్లో అతను శంకర్‌కు ఆశ్రమిచ్చాడన్న సమాచారంతో ఆ ప్రాంతంలో కాపుగాసి సోమవారం వేకువన శంకర్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని, ఒబైద్ పారిపోయాడని కమిషనర్ తెలిపారు.

250కిపైగా చోరీలు...ముగ్గురు భార్యలు..ఆరుగురు పిల్లలు.. శంకర్ 1979లో తొలి దొంగతనం చేసి జైలుకు వెళ్లాడు. జైల్లోనే పాత నేరస్థులు నాగిరెడ్డి అలియాస్ డోంగ్రీ, బీరేందర్ సింగ్ సక్సేనా, నాగులు నుంచి ఇళ్ల తాళాలు ఎలా పగులగొట్టాలో నేర్చుకున్నాడు. జైలు నుంచి విడుదలయ్యాక చోరీల పరంపరను కొనసాగించాడు. 'తాళం వేసిన ఇంటికి అర్ధరాత్రి దాటాక వెళ్లి.. దొంగతనం పూర్తయ్యాక మేడపైన గానీ..లేదా అనుమానం రాకుండా ఇంటి పరిసరాల్లో గానీ దాక్కొని ఉదయాన్నే వాహ్యాళికి వచ్చేవారితో కలిసి రోడ్డుపైకి రావడం ఇతని అలవాటు. దొంగిలించిన బంగారు ఆభరణాలు ముత్తూట్‌లో కుదువకు ఉంచి రుణం తీసుకునేవాడు. తర్వాత వాటిని తీసుకునేవాడు కాదు. ఆ సొత్తును విలాసాలకు ఖర్చు చేసేవాడు. ఇలా 39 ఏళ్లల్లో 250కిపైగా చోరీలకు పాల్పడ్డాడు. ముగ్గుర్ని పెళ్లి చేసుకున్నాడు. అతడికి ఆరుగురు పిల్లలున్నారు. మొదటి భార్య చనిపోయింది. మిగిలిన ఇద్దరు భార్యలు ఇతన్ని వదిలేయడంతో ప్రస్తుతం మహారాష్ట్రకు చెందిన మహిళతో సహజీవనం చేస్తున్నాడు.' అని కమిషనర్ వివరించారు. పోలీస్ ఉద్యోగంతో చేరిన తాము 30-35 ఏళ్లల్లో పదవీ విరమణ చేస్తుండగా...శంకర్ మాత్రం 39 ఏళ్లుగా నిరంతరాయంగా చోరీలు చేస్తున్నాడని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.



మహిళా రైతు నుంచి వంకాయలు కొనుగోలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు


రైతు కష్టాలను తీరుస్తున్నాం

- మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేటలో ఆధునాతన రైతు బజారు ప్రారంభం

ఈనాడు డిజిటల్, సిద్దిపేట: ఆరుగాలం శ్రమించే రైతుల కష్టాలను తీర్చేందుకు మార్కెటింగ్ శాఖ తరపున అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, పంట అమ్మేచోట ఇబ్బందులు తలెత్తకుండా వసతులూ కల్పిస్తున్నామని మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలో రూ.8.16 కోట్ల వ్యయంతో బహుళ అంతస్తుల్లో నిర్మించిన ఆధునాతన రైతు బజారును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. గత ప్రభుత్వాలు ఉద్యానశాఖ ద్వారా బిందు, తుంపర సేద్యం పరికరాలను రైతులకు సక్రమంగా అందించలేదని విమర్శించారు. ప్రస్తుతం ఆ పొరపాట్లన్నీ సరిదిద్ది, అన్ని పథకాల ఫలాలనూ రైతుల వద్దకు చేరుస్తామన్నారు. ఇక్కడి శీతల గిడ్డంగిలో కూరగాయలు నిల్వచేసుకునే వీలు కల్పించడంతోపాటు..వ్యర్థాలతో విద్యుత్తును ఉత్పత్తి చేసే వెసులుబాటూ ఉందని వివరించారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ సంచాలకులు లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకే బతుకమ్మ

- బతుకమ్మ చీరలన్నీ తెలంగాణలోనే తయారీ
- రంజాన్, క్రిస్మస్ చీరలు సైతం..
- 1.20 కోట్ల మంది మహిళలకు పంపిణీ
- నేతన్నలకు రూ.230 కోట్ల ఉపాధి
- వచ్చే నెల నుంచే ఉత్పత్తి ప్రారంభం



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళలకు బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్‌ల సందర్భంగా పంపిణీ చేయనున్న ఉచిత చీరలను ఈసారి పూర్తిగా తెలంగాణలోని నేత కార్మికులతోనే తయారు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.230 కోట్లతో 1.20 కోట్ల చీరలను ఉత్పత్తి చేయనున్నారు. గత సంవత్సరం సగం మాత్రమే తెలంగాణలో తయారు చేయగా, మిగిలిన సగాన్ని సూరత్ నుంచి కొనుగోలు చేశారు. అప్పట్లో సమయాభావం వల్ల సూరత్ వైపు మొగ్గు చూపిన ప్రభుత్వం ఈసారి ముందస్తు ప్రణాళికతో రాష్ట్రంలోనే మొత్తం ఉత్పత్తి చేయడానికి సన్నాహాలు చేయనుంది. తెలంగాణలోని ఆడపడుచులకు ప్రీతిపాత్రమైన బతుకమ్మ పండగ కానుకగా, మరోవైపు నేత కార్మికులకు పని కల్పించే సంకల్పంతో ఉచిత చీరలు పంపిణీ చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించగా, గత సంవత్సరం దీనిని ప్రారంభించారు. దీనికోసం రూ.222 కోట్లను విడుదల చేసింది. ఇందులో దాదాపు రూ.122 కోట్ల విలువైన 52 లక్షల పాలియెస్టర్ చీరల పంపిణీ ఆర్డర్లను సిరిసిల్లలోని నేత కార్మికులకు అప్పగించారు. మరో రూ. 100 కోట్ల తయారీ ఆర్డర్‌ను సూరత్‌లోని కంపెనీల నుంచి కొనుగోలు చేశారు. గత ఏడాది పథకం అమలు తీరును ఇటీవల మంత్రి కేటీఆర్ సమీక్షించారు. లోటుపాట్లను సవరించి, పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు. ముందుగా నేత కార్మికులకు మొత్తం 1.20 కోట్ల చీరల తయారీకి పని ఉత్తర్వు (వర్క్ ఆర్డర్) ఇవ్వాలని ఆదేశించారు. చీరల ఉత్పత్తిని వచ్చే నెల నుంచి ప్రారంభించి సెప్టెంబరు 10 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అక్టోబరు 9 నుంచి పంపిణీ జరగాలని నిర్దేశించారు. దాదాపు ఆరు నెలల సమయం ఉన్నందున ప్రతీ నెల 20 లక్షల చీరల ఉత్పత్తి చొప్పున మొత్తం చీరల తయారీకి ఈ గడువు సరిపోతుందని భావిస్తున్నారు. బతుకమ్మ తర్వాత రంజాన్, క్రిస్మస్ పండగల సందర్భంగా పంపిణీ చేయనున్న చీరలను గతంలో ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసేవారు. ఇప్పుడు వీటిని సైతం సిరిసిల్ల ఇతర ప్రాంతాల్లోని కార్మికులతో తయారు చేయించాలని మంత్రి సూచించారు. గత సెప్టెంబరులో బతుకమ్మ చీరల పంపిణీ అనంతరం కొన్ని వేల చీరలు మిగిలిపోగా వాటిని రంజాన్, క్రిస్మస్‌లకు ఇచ్చారు. వాటికి ఆదరణ లభించిందని అధికారులు చెప్పడంతో ఈసారి బతుకమ్మ చీరల ఉత్పత్తిని పెంచాలని నిర్ణయించారు.

త్వరలో డిజైన్ల ఖరారు: బతుకమ్మ చీరల తయారీ సందర్భంగా డిజైన్లపై చేనేత, జౌళి శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. చీరల నాణ్యత, ప్రింటింగు, కొంగులు, అంచులు, రంగులు ఇతరత్రా సమస్యలు ఏమీ రాకుండా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. ఈసారి వేయి డిజైన్లను తయారు చేసి, వీటిని మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారిణులకు చూపించి, అందరి ఆమోదం పొందిన వాటిని ఎంపిక చేస్తారు. గతంలో బతుకమ్మ చీరల పంపిణీ సందర్భంగా సరైన ప్రచారం జరగక కొంత గందరగోళం ఏర్పడటంతో ఈసారి ముందస్తుగా ప్రచారం కల్పిస్తారు. మిల్లుల్లోనే చీరలు తయారవుతున్నందున వీటిపై ముందస్తు అవగాహన కల్పిస్తారు.

మేడారం జాతర మరిచిపోలేని జ్ఞాపకం

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని మేడారంలో ఇటీవల నిర్వహించిన జాతర మరచిపోలేని జ్ఞాపకంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభివర్ణించారు. గత శుక్రవారం తాను సభకు రాలేదని.. జాతర సందర్శనార్థం ఆ ప్రాంతానికి వెళ్లానని తానెంతో పులకరింతకు గురయ్యానని సోమవారం రాజ్యసభలో ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. కోట్లాది మంది గిరిజనులు పాల్గొనే ఈ మిని కుంభమేళాకు 8 రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారన్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు కూడా ఆరోజు వచ్చారని తెలిపారు. ఎంతో క్రమశిక్షణతో జాతర నిర్వహించారన్నారు.

తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెరాస ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారమిక్కడ దిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్‌తో కలిసి ఆయన జష్న్-ఈ-హిందు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దిల్లీ వర్సిటీ విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

మాల్దీవుల్లో అత్యవసర పరిస్థితి

మాలె: మాల్దీవుల్లో తలెత్తిన రాజకీయ సంక్షోభం ముదిరి పాకాన పడింది. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, అనర్హత వేటుకు గురైన విపక్ష ఎంపీల సభ్యత్వాలను పునరుద్ధరించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాల అమలుకు ససేమిరా అంటున్న అక్కడి అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్.. 15 రోజుల పాటు అత్యవసర పరిస్థితి విధించారు. ఈ మేరకు ఆయన సహాయకురాలు అజిమా షకూర్.. సోమవారం అధికారిక టీవీ ఛానల్‌లో ప్రకటన చేశారు. ఈ చర్యతో అనుమానితులను అరెస్టు చేయడానికి భద్రతా దళాలకు విస్తృత అధికారాలు లభిస్తాయి. షకూర్ ప్రకటనకు ముందు యమీన్.. సుప్రీం కోర్టు న్యాయమూర్తులకు మూడు లేఖలను పంపారు. తమ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని అందులో కోరారు. సుప్రీంకోర్టు హద్దు మీరిందని, ప్రభుత్వ అధికారాలను అతిక్రమించిందని ఆరోపించారు. అత్యవసర పరిస్థితి విధించినట్లు అధ్యక్షుడు.. రెండు రోజుల్లోగా పార్లమెంటుకు తెలియజేయాలని అధికారులు తెలిపారు. అయితే పార్లమెంటును ప్రభుత్వం నిరవధికంగా సస్పెండ్ చేసింది. యమీన్‌పై ఒత్తిడి తెచ్చి, సుప్రీం కోర్టు ఆదేశాలు అమలయ్యేలా చూడాలని మాల్దీవుల్లోని విపక్ష నేతలు భారత్ సహా అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేశారు. అధ్యక్షుడి తీరుకు నిరసనగా నిరసనలు చేపడుతున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలకు కట్టుబడాలని మాల్దీవుల ప్రభుత్వానికి భారత్ ఇప్పటికే సూచించింది.

ఐదు సబ్ జైళ్ల మూసివేత

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జైళ్లకు వచ్చే ఖైదీల సంఖ్య తగ్గుతుండడంతో ఐదు సబ్ జైళ్లను మూసివేస్తున్నట్లు డీజీ వీకే సింగ్ తెలిపారు. ఖైదీలు ఒకరిద్దరే ఉండడంతో ఆర్మూర్, బోధన్, నర్సంపేట, పరకాల, మధిరల్లో సబ్ జైళ్లను మూసివేస్తున్నామని పేర్కొన్నారు. ఇది లాగే కొనసాగితే భవిష్యత్తులో జైళ్ల స్థానంలో పరిశ్రమలు, విద్యా సంస్థలు మాత్రమే ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఖైదీల పరివర్తన కార్యక్రమం జోరుగా సాగుతుండడంతో రాష్ట్రంలో నేరాలు తగ్గుముఖం పడుతున్నాయని వివరించారు. జైళ్లలో 2014లో ఖైదీల సంఖ్య 6012 ఉంటే 2018 జనవరి 27 నాటికి ఆ సంఖ్య 5,348 చేరిందని పేర్కొన్నారు. యాచక రహిత సమాజం కోసం జైళ్ల శాఖ చేపట్టిన కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వేతనాల పెంపు అమలెప్పుడో!

- ఒప్పంద అధ్యాపకుల నిరీక్షణ
- ప్రకటించి 3 నెలలైనా పాత జీతాలే
- నెల రోజులుగా సీఎం పరిశీలనలో దస్త్రం

ఈనాడు, హైదరాబాద్: ఎన్నో సంవత్సరాలుగా చేసిన పోరాటాల ఫలితంగా రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పనిచేసే ఒప్పంద అధ్యాపకులకు వేతనాలు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మూడు నెలలవుతున్నా ఇప్పటికీ అది అమలు కాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగ భద్రత కరవైన నేపథ్యంలో వేతనాల పెంపూ అమలు కావడంలేదంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొత్త వేతనాల దస్త్రం ముఖ్యమంత్రి కార్యాలయంలో పెండింగ్‌లో ఉండటంతో దానికి ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని వందలాది మంది అధ్యాపకులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో 1,553 మంది ఒప్పంద అధ్యాపకులు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని...వేతనాలు పెంచాలని దీర్ఘకాలంగా పోరాడిన ఫలితంగా ఓయూ ఉపకులపతి ఆచార్య తిరుపతిరావు ఛైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఇప్పుడున్న ప్రారంభ వేతనం కంటే 75 శాతం పెంచాలని కమిటీ సిఫార్సు చేసింది. అప్పుడు కనీస వేతనం రూ.37 వేలు అవుతుందని లెక్కలు కట్టారు. కమిటీ సిఫార్సులను యథాతథంగా అమలు చేస్తామని, 2017 నవంబరు నెల నుంచి పెరిగిన వేతనాలు అమల్లోకి వస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్(టీ- ఆక్టా) అధ్యక్షుడు ఎం. రామేశ్వర్‌రావు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, వేతనాల పెంపుపై ఉప ముఖ్యమంత్రి కడియం హామీ ఇచ్చినా.. కనీసం జీఓ కూడా జారీ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. జూనియర్ కళాశాలలు, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేసే ఒప్పంద అధ్యాపకులకు మూడు నెలలకు ఒకసారి బడ్జెట్ విడుదల చేస్తున్నారు. ప్రతినెలా వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జూనియర్ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ కోరారు.

వేతనాల పెంపుతో వర్సిటీల వారీగా లబ్ధి పొందే ఒప్పంద అధ్యాపకులు

విశ్వ విద్యాలయం	అధ్యాపకుల సంఖ్య
ఓయూ	443
కేయూ	201
తెలంగాణ	54
జేఎన్‌టీయూ హెచ్	308
మహాత్మాగాంధీ	51
తెలుగు వర్సిటీ	30
అంబేడ్కర్ సార్వత్రిక	18
శాతవాహన	49
జేఎన్ఏఎఫ్‌యూ	98
ఆర్‌జీయూకేటీ	165
పాలమూరు	136
మొత్తం	1,553

'ఏకకాల' గాలిపటం

ఏకకాల ఎన్నికల నాదస్వరాన్ని ఇరువురు రాష్ట్రపతుల నోట పలికించిన మోదీ ప్రభుత్వం, ఆ కీలక ప్రతిపాదనకు రాజకీయ పక్షాల మద్దతు కూడగట్టే దిశగా వడివడిగా అడుగులేస్తోంది. మొన్న డిసెంబరులో పార్లమెంటు శీతాకాల సమావేశాల ముందునాటి అఖిలపక్ష భేటీలో ప్రధాని మోదీ- జమిలి ఎన్నికలపై ఏకాభిప్రాయ సాధనకు విపక్షాలు సహకరించాలని పిలుపిచ్చారు. మరోవంక, లోక్‌సభతో పాటే రాష్ట్రాల శాసనసభలకూ ఒకే దఫా ఎన్నికలు జరపాలన్న ప్రతిపాదనను స్థూలంగా సమ్మతిస్తున్న నిర్వాచన్ సదన్- దాన్ని అమలు చేసే క్రమంలో ఎదురుకాగల రాజ్యాంగ అవరోధాల్ని ప్రస్తావిస్తోంది. రాజ్యాంగ సవరణలకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఏ పార్టీకీ, కూటమికీ లేనందువల్ల రాజకీయ పక్షాలతో విస్తృత సంప్రతింపుల దరిమిలా ఏకాభిప్రాయం సాధించడం తప్పనిసరి. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి ఏకకాల ఎన్నికలకు సాధన సంపత్తిని సంసిద్ధంగా ఉంచనున్నట్లు ఇటీవలే ప్రకటించిన ఈసీ- అవసరమైన రాజ్యాంగ సవరణలపై న్యాయ మంత్రిత్వశాఖకు సలహాపత్రాన్ని అందించింది. పార్లమెంటు ఉభయ సభల కాలావధులు, సమావేశాలు, నిరవధిక వాయిదా, రద్దు వంటివాటిని నిర్దేశిస్తున్న రాజ్యాంగంలోని 83, 85 అధికరణాల్ని, రాష్ట్రాల చట్టసభలకు సంబంధించి అవే నియమ నిబంధనల్ని గుదిగుచ్చిన 172, 174 అధికరణాలతో పాటు రాష్ట్రపతి పాలనకు వీలు కల్పిస్తున్న 356 అధికరణకూ సవరణలు జరగాలని ఈసీ ప్రతిపాదిస్తోంది. ఏకకాల ఎన్నికలు జరిగినా, అర్ధాంతరంగా ప్రభుత్వాలు కుప్పకూలే పరిస్థితులు వస్తే ఏం చెయ్యాలన్నది కీలక ప్రశ్న! ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే సమయంలోనే తదుపరి ఎవరి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడుతుందో వారికి అనుకూలంగా విశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాలన్నది ఈసీ సూచన. లోక్‌సభ రద్దు అనివార్యమయ్యే పరిస్థితుల్లో విభిన్న ప్రత్యామ్నాయాల్ని పరిశీలించవలసి ఉంటుందన్న ఈసీ సూచనల్ని బట్టి- తలగడ తిరగేస్తే తలనొప్పి పోదన్న సత్యం బోధపడుతూనే ఉంది.

లోక్‌సభకు, 29 అసెంబ్లీలకూ ఏక కాలంలో ఎన్నికలు నిర్వహిస్తే ఏటా వ్యయప్రయాసలు తప్పడంతోపాటు, పాలనలో స్థిరత్వానికి అది దోహదపడుతుందన్న కమలనాథుల పంథా 2014 నాటి మ్యానిఫెస్టోలోనూ చోటు దక్కించుకొంది. దేశంలో నిత్యం ఏదో ఒకచోట జరుగుతున్న ఎన్నికల వల్ల ఆర్థిక రంగంపైనా, అభివృద్ధి పైనా ప్రతికూల ప్రభావం పడుతోందని వారం రోజుల క్రితం రాష్ట్రపతి కోవింద్ నోట ఎన్‌డీఏ ప్రభుత్వం పలికించింది. దేశంలో నాలుగో లోక్‌సభ ఎన్నికల దాకా ఏక కాల ఎలక్షన్లే జరిగినా, అనంతర కాలంలో బండి గాడి తప్పింది. మళ్ళీ దాన్ని గాడిన పెట్టి జమిలి జాతరకు మార్గం సుగమం చెయ్యాలని 1983లో ఎన్నికల సంఘం, 1999లో జస్టిస్ జీవన్‌రెడ్డి సారథ్యంలోని న్యాయసంఘం విస్పష్టంగా సూచించాయి. 'ఒకే దఫా ఎన్నికలు అభిలషణీయమే, అందులో లాభనష్టాలేమిటి?' వంటి అయిదు కీలక ప్రశ్నలపై జనాభిప్రాయాన్ని సేకరించిన మోదీ ప్రభుత్వం, ఆయా వివరాలు బహిర్గతం చెయ్యకుండానే 'ఏక కాల ఏక్‌తారా'కు ఏకాభిప్రాయం జత కలవాలని కోరుతోంది. ప్రస్తుత అసెంబ్లీల గడువుల్ని పరిశీలిస్తే 2021 దాకా ప్రతి ఆర్నెల్లకోసారి రెండు నుంచి అయిదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయని నిరుడు ఏప్రిల్‌లో ప్రకటించిన నీతి ఆయోగ్- వాటివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థికభారం పెరిగిపోతోందని వెల్లడించింది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికల వ్యయం మొత్తం రూ.5,000 కోట్లు అనుకొంటే, రూ.24 లక్షలకోట్ల భారతావని బడ్జెట్లో అది ఎంత? కేవలం ఎన్నికల వల్లే అభివృద్ధి కార్యక్రమాలు సాంతం పడకేస్తున్నాయన్న వాదనలో వాస్తవం పిసరంత! భారతావనిలో ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరికిస్తే ఈ ఏక కాల ఎన్నికల ప్రతిపాదన ఏమంత సమంజసం కాదన్నదే ఆలోచనాపరుల స్థిరాభిప్రాయం!

ఏడు దశాబ్దాలుగా భారత ప్రజాస్వామ్యానికి లెక్కల్లో చూపని ధనమే ఇంధనమవుతోందన్న కేంద్ర మంత్రి జైట్లీ- ఆ అరాచకాన్ని అరికట్టడంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, పార్లమెంటుతోపాటు ఎన్నికల సంఘమూ విఫలమైందని నిరుడు జులైలో స్పష్టీకరించారు. తరచూ ఎన్నికలు రావడం, అభ్యర్థులు నిధులు సమకూర్చుకోవడం- అవినీతి, నల్లధనానికి దారితీస్తోందని నీతి ఆయోగ్ పెద్దలూ సూత్రీకరించారు. జమిలి ఎన్నికలతో అవినీతి తగ్గుతుందా, నల్లధన ప్రవాహాలు ఆగిపోతాయా? ఎన్నికల వ్యవస్థను దశ మహా పాతకాలు పట్టిపీడిస్తున్నాయని పాతికేళ్ల క్రితం సీఈసీగా శేషన్ చెప్పినదానికి 'ఏక కాల' మంత్రం విరుగుడు కాగలుగుతుందా? నాచియప్పన్ నేతృత్వంలోని పార్లమెంటరీ స్థాయీసంఘం, ఎన్నికల సంఘం, నీతి ఆయోగ్ వంటివి జమిలి ఎలెక్షన్లతో ఎంతో మేలు అని చెబుతున్నా- అవి కొన్ని పార్శ్వాలకే పరిమితమై సానుకూల వాదనలు చేస్తున్నాయి. అస్థిర రాజకీయ సమీకరణలతో ఓ అసెంబ్లీని పదిహేను నెలలకే రద్దు చెయ్యాల్సి వచ్చినా తదుపరి ఎన్నికల దరిమిలా ఏర్పడే చట్టసభ తక్కిన 45 నెలలకే పరిమితం అవుతుందని నీతి ఆయోగ్ పత్రం సూచించింది. అలాంటి ఎన్నికలు పలు రాష్ట్రాల్లో జరపాల్సి వచ్చే పరిస్థితి ఏర్పడితే- ఇప్పటికి అప్పటికీ తేడా ఏం ఉంటుంది? భిన్న సైద్ధాంతిక పునాదులతో దేశవ్యాప్తంగా విస్తృత యంత్రాంగం గల మేరునగ సమాన జాతీయ రాజకీయ పార్టీలు రెండో మూడో ఉన్నప్పుడు ఆ తరహా జమిలి ప్రయోగం విజయవంతం కాగలుగుతుంది గాని, ఇండియాలో ఇప్పుడా పరిస్థితి ఏదీ? నేరగ్రస్త ఎన్నికల వ్యవస్థకు సంస్కరణల గరళ వైద్యం జరూరుగా జరగాల్సిన తరుణంలో ఆ వైపు చూపు సారించకుండా ఎగరేసే ఏకకాల గాలిపటం- అంతిమంగా ఏం ఉద్ధరిస్తుంది?

లెక్కలు ఘనం... ఆచరణే ప్రశ్నార్థకం

ఎన్నికలు సమీపించిన తరుణంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రస్తుత పదవీకాలంలో ప్రవేశపెట్టిన చివరి పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ రైతులకు పెద్దగా శుభసూచనలేమీ ఇవ్వలేదు. పంట దిగుబడులు పెంచేందుకు ఉద్దేశించిన పథకాలకైనా, ఆరుగాలం అన్నదాతలు కష్టించి పండించినవాటికి గిట్టుబాటు ధరలు ఇవ్వడానికి నిధుల కేటాయింపులైనా బడ్జెట్‌లో ఘనంగా కానరాలేదు. పథకాలకు ఎంతో కొంత పెంచుతూ నిధుల కేటాయింపులున్నా అవి ఎప్పటిలాగే సాధారణ బడ్జెట్ల సరళిని తలపించాయే తప్ప- విప్లవాత్మక సంస్కరణల దిశగా రైతులను నడిపించగలవా అనే అనుమానాలను కలిగిస్తున్నాయి. దేశంలో పంట సాగు వ్యయానికి ఒకటిన్నర రెట్లు గిట్టుబాటు ధర ఇస్తామని బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన ఆర్థికమంత్రి అందుకు అవసరమైన నిధులను మార్కెట్ జోక్యం (ఎమ్ఐఎస్) పథకానికి కేటాయించకపోగా, గతేడాదికన్నా ఇంకా తగ్గించడం గమనార్హం. పంటరుణాలు ఇవ్వడానికి రూ.11 లక్షల కోట్లు కేటాయించినట్లు కేంద్రం ఘనంగా తెలిపింది. ఆ రాశి భారీగా కనిపిస్తున్నా, సగానికి పైగా రైతులకు అసలు బ్యాంకులు రుణాలే ఇవ్వడం లేదన్నది క్షేత్రస్థాయి వాస్తవం. ఇలాంటి లోపాలను సరిదిద్దే ప్రతిపాదనలూ కానరాలేదు. పేదలకు ఆహారోత్పత్తులు అమ్మడానికి ఆహార రాయితీ పద్దు కింద లక్షా 69 వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయించిన కేంద్రం, అందులో కనీసం లక్ష కోట్లను పక్కన పెట్టి మిగిలిన రూ.69 వేలకోట్ల స్థాయిలోనైనా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు విదల్చలేదు. ఈ రంగానికిచ్చిన మొత్తం నిధులు రూ.63,836 కోట్లు! వీటిలో జీతభత్యాలు, ఇతర ఖర్చులూ పోను చివరికి రైతుల ప్రయోజనార్థం అక్కరకొచ్చేది అరకొరే!

లక్ష్యాలకు సుదూరం

వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పథకాలకు నిధుల కేటాయింపులను బడ్జెట్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా ప్రకటిస్తుంటాయి. వాస్తవంగా పల్లెస్థాయిలో రైతులకు వాటిలో అందుతున్న సొమ్ము నామమాత్రంగానైనా ఉండటం లేదు. సునిశితంగా పరిశీలిస్తే ఒక్కో పథకంలోని డొల్లతనమే బయటపడుతోంది. ఇచ్చే నిధులు అంతంతమాత్రం, అవినీతి పాలు మరి కొంత అన్నట్లుగా క్షేత్రస్థాయి వాస్తవాలు అఘోరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సాగునీటి కొరతతో ఆహార భద్రతకు ముప్పు ముంచుకొస్తోందని ఐరాసకు చెందిన ప్రపంచ ఆహార సంస్థ మొదలుకుని పలు పరిశోధన సంస్థలు, రైతు వేదికలు మొత్తుకుంటున్నాయి. సాగునీటిని పొదుపుగా వాడుకుని పంటల దిగుబడి, ఉత్పాదకత గణనీయంగా పెంచవచ్చని అధునాతన బిందు సేద్య విధానాలతో ఇజ్రాయెల్ ప్రపంచానికి పాఠాలు నేర్పుతోంది. ఇదే బిందుసేద్యం పథకాన్ని పెద్దయెత్తున అమలుచేస్తామని ఇందుకోసం రూ.5,000 కోట్లతో ప్రత్యేక నిధి(కార్పస్ ఫండ్) ఏర్పాటు చేస్తున్నట్లు గత బడ్జెట్(2017-18)లో కేంద్రం ప్రకటించింది. 'ప్రతి చుక్కకు అధిక పంట'(పర్ డ్రాప్ మోర్ క్రాప్) పథకం పేరిట దీన్ని అమలుచేస్తామని తెలిపింది. ఈ ప్రకటన చేసి ఏడాదైంది. మరో బడ్జెట్‌నూ తెచ్చింది. అయినా నిరుటి రూ.5,000 కోట్లను ఖర్చు చేయడం ఇంకా మొదలు పెట్టనేలేదు. రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు అడిగామని తాజా బడ్జెట్ సందర్భంగా వెల్లడించింది. ఈ నిధి ఏర్పాటు ప్రకటన తరవాత రెండు పంటల సీజన్లు పూర్తయ్యాయి. పథకం అమలు నేటికీ పట్టాలకు ఎక్కకపోతే, దేశమంతా నీటి పొదుపు లక్ష్యం నెరవేరేదెప్పుడన్నది పాలకులే చెప్పాలి. దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించేందుకు ఎప్పటి నుంచో 'జాతీయ ఆహార భద్రతా మిషన్'(ఎన్ఎఫ్ఎస్ఎం) పేరుతో పథకాన్ని అమలుచేస్తున్నారు. ఈ పథకమూ రైతులకు సరిగ్గా ఉపయోగపడటం లేదు. వరి, పప్పుధాన్యాల పంటల దిగుబడి, ఉత్పాదకత పెంచడానికి ఈ పథకం కింద నిధులు వెచ్చించాలి. రైతులకు విత్తనాలు, ఎరువులు వంటివన్నీ సకాలంలో అందించి సాగు సక్రమంగా జరిగేలా చూస్తే ఎకరానికి సగటు ఉత్పాదకత పెరుగుతుందన్నది ఈ పథకం ప్రాథమికోద్దేశం. దీనికి గత బడ్జెట్‌లో రూ.1,720 కోట్లు కేటాయించారు. ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలలుండగానే ఇప్పుడీ నిధులను రూ.1,400 కోట్లకు తగ్గించి చూపారు. వచ్చే ఏడాదికి రూ.1,690 కోట్లే ఇస్తున్నట్లు కొత్త బడ్జెట్‌లో తెలిపారు. అంటే, గతేడాది తొలుత కేటాయించిన దానికన్నా వచ్చే ఏడాదికి మరింత తగ్గించారన్న మాట. ప్రజలకు ఆహార భద్రత కల్పించేందుకు, పంటల దిగుబడి పెంచడానికి ఉద్దేశించిన పథకాలకు కేటాయింపుల తీరు ఇలా నిరుత్సాహకరంగా ఉన్నాయి. కిలో బియ్యం పండించడానికి రైతు రూ.33 ఖర్చు పెట్టాల్సి వస్తోందని తెలంగాణ వ్యవసాయశాఖ జాతీయ వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్(సీఏసీపీ)కి నివేదించింది. అదే కిలో బియ్యాన్ని పేదల కోసం కేంద్రం మూడు రూపాయలకు విక్రయిస్తోంది. తెలుగు రాష్ట్రాలు మరికొంత భారం మోసి రూపాయికే కిలో బియ్యాన్ని పేదలకు అందజేస్తున్నాయి. పేదలకు ఇలా ఆహార భద్రత కల్పించడం అవసరమే. అందుకోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.1.40 లక్షల కోట్లకన్నా మరో 20 శాతం పెంచి కేంద్రం కొత్త బడ్జెట్‌లో రూ.1.69 లక్షల కోట్లు ప్రత్యేకించింది. ప్రజలకు ఆహార భద్రత కల్పించడానికి నిధులు పెంచుతున్న ప్రభుత్వం, అదే ఆహార పంటలను పండించే రైతులకిచ్చే రాయితీలను అదే నిష్పత్తిలో ఎందుకు పెంచడం లేదో అంతుచిక్కడం లేదు. వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధక, సహకార, మార్కెటింగ్ శాఖల పరిధిలో రైతులకు వివిధ రకాలుగా అక్కరకు వచ్చే 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన'(ఆర్‌కేవీవై) పథకం పరిస్థితీ ఎన్ఎఫ్ఎస్ఎం లానే ఉంది. దీనికీ గత బడ్జెట్‌లో తొలుత రూ.4,750 కోట్లు కేటాయించి ఇప్పుడు రూ.3,600 కోట్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం నిధులు రైతులకు రావాలంటే కేంద్రం ఇచ్చే వాటికి అదనంగా 40 శాతం తమ వాటా కలిపి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలి. రాష్ట్రాలు ఆ పని చేయడం లేదు. తెలంగాణకు నిరుడు రూ.485 కోట్లు ఇస్తామన్నారు. రూ.118 కోట్లకు మించి ఇప్పటివరకు విడుదల కాలేదు.



ఇవన్నీ రైతుల రాయితీలకు సంబంధించిన పథకాల అమలుతీరును ప్రతిబింబించేవే. దేశంలో వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపుల విధానంపై ఎప్పటి నుంచో విమర్శలున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అన్ని రంగాలకు చెందిన 'కేంద్ర ప్రాయోజిత పథకాల'(సీఎస్ఎస్)కు రూ.3.05 లక్షల కోట్లను ఖర్చుచేస్తామంటున్నారు. ఇందులో వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన సీఎస్ఎస్‌లకు ఇచ్చేవి రూ.46,700 కోట్లు మాత్రమే. మొత్తం అన్ని రంగాల్లో వ్యవసాయ సీఎస్ఎస్‌ల వాటా 15 శాతమే ఉంది. పేదరైతులకు రాయితీలిచ్చే పథకాల వాటా ఇంత తక్కువగా ఉంటే, పంటల దిగుబడులు పెంచడానికి వారికి భరోసా ఎక్కడి నుంచి వస్తుంది? పైగా కేంద్రం సీఎస్ఎస్ పేరుతో ఇచ్చే నిధులకు ప్రతి పథకంలో రాష్ట్ర ప్రభుత్వం తనవంతు వాటాగా 40 శాతం నిభాయించాలి. చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వాటా జోడించలేక, వాటిని రైతులకు ఇవ్వకుండా వృథాగా వదిలేస్తున్నాయి. రాష్ట్రాల ఈ నిర్లక్ష్యాన్నే ఉదాహరణగా చూపుతూ మరుసటి ఏడాది ఈ పథకాలకు కేటాయింపుల్ని కేంద్రం ఇంకా తగ్గిస్తోంది. ఆర్‌కేవీవై, ఎన్ఎఫ్ఎస్ఎం తదితర పథకాలకు నిధుల కేటాయింపులు తగ్గడం వెనక ఉన్నతస్థాయిలో జరిగే ఇలాంటి వ్యవహారాలు పేద రైతులకు తెలియడం లేదు. వారికి రాయితీలు అందడం లేదు.

ప్రధాన పథకాలకు నిధుల కేటాయింపు తీరు (రూ.కోట్లలో)

పథకం	2017-18	2018-19
రాష్ట్రీయ కృషి వికాస్ యోజన	4,750	3,600
ఆహార భద్రత మిషన్	1,720	1,690
జాతీయ భూసార పరీక్ష పథకం	452	400
ఆయిల్‌పాం తోటల అభివృద్ధి	403	400
సమగ్ర మార్కెట్ల పథకం	1,189	1,050
సేంద్రియ పంటల అభివృద్ధి	350	360
వ్యవసాయ యంత్రాల కార్యక్రమం	550	1,165



'వ్యవసాయదారులు వారి ఫలసాయం కోసం పెట్టిన ఖర్చుకు ఒకటిన్నర రెట్లు గిట్టుబాటు ధర ఇవ్వాలనే నిర్ణయం వల్ల కాయగూరలు, పండ్ల ఉత్పత్తిలో నిమగ్నమైనవారు లబ్ధి పొందగలరు. రాష్ట్రాలను సంప్రతించి దీనికోసం పక్కా వ్యవస్థను కేంద్రం ఏర్పాటు చేస్తుంది. 'ఆపరేషన్ గ్రీన్స్' అని తాజా బడ్జెట్‌లో ప్రకటించిన పథకం ఈ దిశగా ఒక సాధనంగా ఉపయోగపడుతుంది'

– కేంద్ర బడ్జెట్‌ను ప్రశంసిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

ఆర్థిక భరోసా అవసరం

పంటల సగటు ఉత్పాదకత, దిగుబడి పెరగకపోతే దేశానికే కాదు, ప్రపంచ ఆహార భద్రతకే ముప్పు తప్పదని పలు అధ్యయనాలు ఇప్పటికే హెచ్చరించాయి. 2050 నాటికి ప్రపంచ జనాభా ఆకలి తీర్చాలంటే ఇప్పుడున్న భూముల్లోనే 50 శాతం అదనంగా పంట పండించాలని ప్రపంచ వ్యవసాయ పరిశోధన సంస్థలు స్పష్టీకరిస్తున్నాయి. ఈ లెక్కన భారతదేశంలో 80 శాతానికి పైగా ఉన్న సన్న, చిన్నకారు రైతుల కమతాల్లో సగటు దిగుబడి పెంచాలంటే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక భరోసా చాలా అవసరం. పెట్టుబడి సాయంగా ఎకరానికి రూ.4,000 ప్రతి సీజన్‌లో రైతులకు ఇస్తామంటూ తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రకటనను పలు రాష్ట్రాలు ఆసక్తిగా పరిశీలిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో ప్రకటించే పలు వ్యవసాయ పథకాల నిధులు ఏ ఏడాదిలోనూ పూర్తిగా ఖర్చు చేయడంలేదన్న వాస్తవాన్ని పాలకులు అంగీకరించాలి. వచ్చే ఏడాది రూ.11 లక్షల కోట్ల పంటరుణాలు ఇస్తామంటూ ఘనంగా బడ్జెట్లో ప్రకటించినా, ప్రస్తుత ఏడాదిలో ఇచ్చిన రుణాలెన్ని, రెండు పంట సీజన్లు ముగిసినా బ్యాంకులు రుణాలెందుకు ఇవ్వడం లేదన్నది ప్రభుత్వాలు తరచి చూడాలి. పంట సీజన్ ముగిసే దాకా బ్యాంకు రుణమే ఇవ్వకపోతే సాగుకు ప్రైవేటు అప్పులే దిక్కయి, వాటి వడ్డీలే రైతుల పాలిట ఉరితాళ్లవుతున్నాయి.

పేద రైతు కుటుంబాలను ఇలా అప్పుల ఊబిలోకి నెట్టే విధంగా బ్యాంకులు వ్యవహరించినంత కాలం, పంటరుణాలకు ఎన్ని లక్షల కోట్లు బడ్జెట్లలో కేటాయించినట్లు ప్రకటించినా ఈ తరహా ఫలితాలే వస్తాయన్నది నిష్ఠురసత్యం. పంటలు పండించిన తరవాత గిట్టుబాటు ధర ఇస్తే చాలని రైతులు మొత్తుకుంటున్నారు. వ్యవసాయ మార్కెట్లను ఆన్‌లైన్‌లోకి తెచ్చి దేశంలో ఎక్కడి నుంచి అయినా కొనుగోలు చేసేలా చేస్తామని చెప్పి రెండేళ్లయింది. ఇంతవరకూ ఏ ఒక్క మార్కెట్‌ను ఆ స్థాయికి మార్చలేదు. ఇలాంటి పథకాల అమలూ ఇంత ఆలస్యమైతే ఏటా రైతులు నష్టపోయే కోట్ల రూపాయల సొమ్ము తిరిగి ఎలా వస్తుంది? వేల కోట్లతో పలు పథకాలను బడ్జెట్లలో ఘనంగా ప్రకటించడం ఆరంభంలో ప్రచారానికి బాగుంటుంది. పల్లెస్థాయిలో రైతాంగానికి అవి ఎంతవరకు చేరాయన్నది పరికిస్తే నిర్వేదమే మిగులుతోంది. అన్నదాతలకు కేటాయింపులు కాగితాలకే పరిమితమైతే అంతిమంగా దేశ ఆహార భద్రతే ప్రమాదంలో పడుతుంది. రైతు పథకాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాస్తవిక దృక్పథంతో వ్యవహరించనంత కాలం కర్షకుల కష్టాలకు తెరపడదు!

– మంగమూరి శ్రీనివాస్

భద్రత బుగ్గిపాలు

'పౌరులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత. దాన్ని మించింది మరొకటి ఉండదు' అని సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల స్పష్టీకరించింది. అగ్నిప్రమాదాల నిరోధానికి అనువుగా, కర్ణాటక ప్రభుత్వం జారీచేసిన నూతన ఉత్తర్వుల్ని సమర్థిస్తూ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలవి. ప్రజల ప్రాణరక్షణ కోసం, అన్ని బహిరంగ ప్రదేశాల్లోనూ ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి. సంబంధిత నియమ నిబంధనల్ని ఆయా సంస్థలు కచ్చితంగా పాటించాలి. ఎక్కడ ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా, అవి తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి పొందాలి. అంటే, జాగ్రత్త చర్యలు చేపడితేనే నిర్వహణ సంబంధ అనుమతులు లభిస్తాయన్న మాట. పలు సంస్థల యాజమాన్యాలు అటువంటివేవీ పట్టించుకోకపోవడం ఒక్క కర్ణాటకకే పరిమితం కాదు. అదేమని ప్రశ్నిస్తే, ప్రభుత్వాలు షరతులు విధిస్తున్నాయని వాదిస్తూ కోర్టుకెక్కడం అనేకచోట్ల పరిపాటిగా మారింది. షరతులన్నీ అసమంజసంగా ఉన్నాయని వితండ వాదనకు దిగడం సంస్థల బాధ్యతారాహిత్యమేనని 'సుప్రీం' తేల్చిచెప్పింది. వివిధ పరిశ్రమలతో పాటు హోటళ్లు, సినిమా థియేటర్లు, దుకాణ సముదాయాలు, రోగుల ప్రాణాల్ని కాపాడాల్సిన వైద్యశాలలూ నేరపూరిత నిర్లక్ష్యానికి చిరునామాలవుతున్నాయి. అవి అన్ని జాగ్రత్తలకూ తిలోదకాలివ్వడం నిప్పుతో చెలగాటమే! తమిళనాడులోని సుప్రసిద్ధ మదుర మీనాక్షి ఆలయ ప్రాంగణంలో మొన్నామధ్య అర్ధరాత్రి చెలరేగిన మంటలు అపార ఆస్తినష్టానికి కారణమయ్యాయి. ఆ సమయంలో భక్తులెవరూ అక్కడ లేకపోబట్టి సరిపోయిందిగాని- లేదంటే, ప్రమాద తీవ్రత ఊహించుకుంటేనే గుండెలు దడదడలాడతాయి. కటక్ (ఒడిశా)లోని పెద్ద దుకాణాల సముదాయంలో సంభవించిన ప్రమాదమూ చివరికి అక్కడ బూడిదనే మిగిల్చింది.

ప్రమాణాలు గాలికి...

అగ్నిప్రమాదాల వల్ల ప్రాణ, ఆస్తినష్టాలు సంభవిస్తుంటే- హోటళ్లలో మాదిరిగా 'ఎవరి సామగ్రికి వారే బాధ్యులు' రీతిలో పలు యాజమాన్యాలు వ్యవహరిస్తుండటం పరమ దారుణం. వ్యాపార వ్యవహారాలు, వాటి వల్ల వచ్చిపడే లాభాలతోనే తప్ప...జనం ప్రాణాలతో తమకు సంబంధమే లేదన్నట్లు ప్రవర్తించడం క్షంతవ్యం కాదు. నిప్పురవ్వ తెచ్చే ముప్పు అతి పెద్దది, అంచనాలకు అందనిది. మండే స్వభావానికి వేడిమి జతపడితే, చివరికి మిగిలేది బూడిదే! ఇళ్లతో పాటు కర్మాగారాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, గోదాములు వంటిచోట్ల భద్రతా ప్రమాణాల్ని పాటించాల్సిన విధి నిర్వాహకులదే. నష్టాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించాల్సిన సంస్థలే, నామమాత్ర ఏర్పాట్లతో చేతులు దులిపేసుకుంటున్నాయి. ఎక్కడ ఏ పొరపాటు జరిగినా, పరిణామాలు ఘోరంగా ఉంటాయన్నది యాజమాన్యాలకు తెలియనిదేమీ కాదు. ఘన, ద్రవ, వాయు, లోహ పదార్థాలు; లేదా విద్యుత్ వాహకాల అమరికలో కొద్దిపాటి తేడా వచ్చినా అనర్థం తప్పదు. అందుకే అగ్నిమాపక శాఖకు అదనంగా 'విపత్తుల స్పందన' అని జోడించింది ప్రభుత్వం. ఎండకాలంలో అగ్గి భగ్గుమన్నప్పుడు మాత్రమే కాదు- అన్ని కాలాలు, పరిస్థితుల్లోనూ ముందు జాగ్రత్త ప్రాణావసరం. అగ్గిపుల్లను వెలిగించి ఆర్పకుండా పారేస్తే ఏమవుతుందో తెలియనిదెవరికి? ఇంటి పూజగదిలో వెలిగించిన దీపాన్ని అలాగే వదిలేసి వెళితే జరిగేదేమిటో ఎవరైనా ఊహించగలరు. అన్నీ తెలిసినా, ఏ ఒక్కటీ పట్టించుకోని వివిధ సంస్థల యాజమాన్యాల నైజమే మరణ మృదంగం మోగిస్తోంది. దిల్లీలో ప్లాస్టిక్ వస్తుతయారీ పరిశ్రమగా నామఫలకం ఉన్న ఓ భవంతిలో, బాణసంచా అక్రమ నిల్వలున్నాయి! వాటి పేలుడు కారణంగానే ఇటీవల 17 ప్రాణాలు ఉన్నపళంగా గాలిలో కలిసిపోయాయి. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం అదే రాజధాని నగరంలోని 'ఉపహార్' సినిమాహాలులో మంటలు చెలరేగి 60మంది ఆహుతయ్యారు. గత డిసెంబరు నెల చివర్లో ముంబయిలోని కమలా మిల్స్ భవన సముదాయంలో అగ్ని 15మంది ఉసురు తీసింది. అక్కడి మొదటి అంతస్తులోని ఓ 'పబ్'లో అర్ధరాత్రివేళ నిప్పంటుకొని, నిమి



అడ్డూ ఆపూ లేని అగ్నిప్రమాదాలు

షాల వ్యవధిలోనే భవంతి అంతా వ్యాపించింది. అసలే అది వాణిజ్యపరంగా ఎంతో రద్దీ ప్రాంతం. పలు నివాసాలతో పాటు, ఆ ఆవరణలో అనేక వ్యాపార సంస్థలున్నాయి. వాటిలో మహారాష్ట్ర ప్రభుత్వ అనుమతి (లైసెన్సు) లేనివి, అగ్నినిరోధక సాధనాలు మచ్చుకైనా కనిపించనివే ఎక్కువ. ముందుగా మంటలు మొదలైన చోటూ అదే బాపతు! అక్కడి హుక్కాల వల్లనే మంటలు రేగి పై అంతస్తులకు చేరాయని ధ్రువపడింది. ఇంత జరిగినా, 'అంతా దైవ ఘటన. మా తప్పిదమేదీ లేదు. మమ్మల్ని ఎలా శిక్షిస్తారు' అని పోలీసుల్ని పబ్ నిర్వాహకులు ప్రశ్నించడమే విడ్డూరం!

పొరపాటు, అలసత్వం, తప్పిదం, నేరం- స్థాయి ఏదైనా, అగ్నిప్రమాద ఫలితం ఎప్పుడూ భయానకంగానే ఉంటుంది. దబ్వాలీ (హరియాణా)లో 1995 డిసెంబరు 23న ఓ ఉత్సవ వేదిక అంటుకొని, 450మంది బడిపిల్లలు సజీవదహనమయ్యారు. ఆ తరవాత రెండేళ్లకు ఒడిశాలోని ఓ రద్దీప్రాంతంలో అగ్నిజ్వాలలు 206 ప్రాణాల్ని బలి తీసుకున్నాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని పారిశ్రామికవాడలో పదిరోజుల క్రితం ప్రమాదం పదిహేడుమందిని కబళించింది. కింది అంతస్తులో బాణసంచా తయారీ, ఆ పై అంతస్తు గదుల్లో రబ్బరు పనులు సాగుతుండటంతో- అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. అంతకుముందు డిసెంబరు 18న ముంబయిలోని ఓ మిఠాయి దుకాణంలో మంటలకు 12మంది విగతజీవులయ్యారు. విద్యుదాఘాతం కారణంగా స్విచ్‌బోర్డు నుంచి రేగిన మంటలు ఎల్పీజీ సిలిండరును తాకి, అది పేలిపోయింది. ఆ ధాటికి దుకాణ భవనం కుప్పకూలింది. హైదరాబాద్ శివార్లతో పాటు మేడ్చల్ (తెలంగాణ); ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుజిల్లా చిలకలూరిపేట వద్ద ఇటీవలి ప్రమాదాలు అపార ఆస్తినష్టానికి మూలమయ్యాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ అతి పెద్దదైన చర్లపల్లి ఇంధన కర్మాగారం దగ్గర గత సెప్టెంబరు 14న పదుల సంఖ్యలో గ్యాస్‌బండలు వరసగా పేలిపోయాయి. ఆ విస్ఫోట ప్రాంతానికి సమీపంలోని గోదాములో, గ్యాస్ నింపిన సిలిండర్లు రెండువేలకు పైగా ఉన్నాయి. అవి అంటుకొని ఉంటే మహా ఉపద్రవమే దాపురించేది. పొగను కనిపెట్టే ఏర్పాట్లు (స్మోక్ డిటెక్టర్లు) లేకనే, భువనేశ్వర్ (ఒడిశా) వైద్యశాలలో 2016 అక్టోబరులో ఓ రాత్రివేళ 23మంది రోగులు అక్కడికక్కడ మంచాలపైనే తుదిశ్వాస విడిచారు. ముందుచూపు ఊసే కొరవడిన స్థితిలో, 17 ఏళ్లక్రితం భరత్‌పూర్(రాజస్థాన్) ఆయుధాగారంలో చెలరేగిన మంటలు 10,000 టన్నులకు పైగా మందుగుండు సామగ్రిని భస్మీపటలం చేశాయి.

నిర్లక్ష్యానికి కఠిన శిక్ష

కర్మాగారాలు, ఇతర భవనాల వద్ద అగ్ని నివారకాల ఏర్పాటు, వాటి సక్రమ నిర్వహణ- యాజమాన్యాల కనీస బాధ్యత. సమీపంలోనే నీటి ట్యాంకుల్ని నిర్మించుకోవాలి. దరిదాపుల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటే, వాటి చుట్టూ కంచెలు వేయాలి. ఇవన్నీ కాగితాలకే పరిమితం కావడంతో, అగ్నిమాపక సేవల చట్టం ఆచరణకు దూరమవుతోంది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా, ఏపీ ప్రభుత్వం ఎప్పుడో 18ఏళ్లనాటి ఆ చట్టానికి సవరణ ప్రతిపాదనలు చేసింది. వాటి ప్రకారం- భవనాల్లో అగ్నిమాపక చర్యలు తీసుకోని, పరికరాలు ఏర్పాటుచేయని యాజమాన్యాలతో అత్యంత కఠినంగా వ్యవహరించాలి. అలాంటి చోట్ల ప్రమాదాలు ప్రాణ, ఆస్తినష్టాలకు దారితీస్తే- పరిహార మొత్తాల్ని ఆయా సంస్థల నుంచే ముక్కు పిండి వసూలు చేయాలి. అలవిమాలిన నిర్లక్ష్యానికి శిక్షగా గరిష్ఠ స్థాయిలో అపరాధ రుసుము విధించాలి. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడే బహుళ అంతస్తుల భవనాలకు గుజరాత్‌లో మాదిరిగా విద్యుత్ సరఫరా నిలిపివేయాలి. భవంతులకు సంబంధించి నిరభ్యంతర పత్రాల జారీ ప్రక్రియలో సమూల మార్పులు తేవాలి. ఎక్కడ అగ్నిప్రమాదం సంభవించినా- ఆ సమాచారాన్ని స్మార్ట్‌ఫోన్ మీట నొక్కడం ద్వారా విపత్తు స్పందన శాఖకు చేరవేసే 'యాప్' ఏర్పాట్లను ఇప్పటికీ గోవా ప్రాంతానికే పరిమితం చేయడం అర్థరహితం. అటువంటి వాటిని అంతటా విస్తరించాలన్న ప్రతిపాదన కనీసం ఇప్పటికైనా ఆచరణకు వస్తేనే- ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు భద్రత కల్పించినట్లవుతుంది!

– శరత్

శ్రీశైల బ్రహ్మోత్సవాలు

సమస్త భూమండలానికి నాభి స్థానం వంటిది శ్రీశైల మహాక్షేత్రం. ఇది ద్వాదశ జ్యోతిర్లింగాల్లో మల్లికార్జునుడికి, అష్టాదశ శక్తిపీఠాల్లో భ్రమరాంబకు నిలయం. ప్రతి సంవత్సరం మాఘమాసంలో మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా, శ్రీశైల స్వామికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. వీటిని ఏటా రెండుసార్లు నిర్వర్తించడం పరిపాటి. ఈ సారి మంగళవారం మొదలయ్యే ఉత్సవాలు శివరాత్రి వరకు కొనసాగి, మరునాడు రథోత్సవంతో ముగుస్తాయి.

మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని సంక్రాంతికి, శివరాత్రితో పరిసమాప్తమయ్యేలా రెండోసారి శ్రీమహాలింగ చక్రవర్తికి బ్రహ్మోత్సవాలు జరుపుతారు. క్షేత్ర పాలకుడైన వీరభద్రుడి పర్యవేక్షణలో, చండీశ్వరుడి కనుసన్నల్లో, బ్రహ్మదేవుడి ఆధ్వర్యంలో సాగే సంప్రదాయ ఉత్సవాలివి. సంక్రాంతి బ్రహ్మోత్సవాల్ని పంచాహ్నిక దీక్షతో ఏడు రోజులు, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్ని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజులు ఆచరిస్తారు. మొదటి రోజున స్థానాచార్యులు, అర్చక స్వాములు, వేదపండితులు యాగశాలలోకి ప్రవేశించగానే గణపతి పూజ, పుణ్యాహవాచనం మొదలవుతాయి. స్థానాచార్యుల సంకల్పం తరవాత చండీశ్వర ఆరాధన, కంకణ పూజ జరుగుతాయి.

రుత్విక్కులకు దీక్షావస్త్రాలు అందజేస్తారు. అఖండ దీపారాధన, హోమాల అనంతరం రుద్ర కలశ స్థాపన ఉంటుంది. తొలిరోజు సాయంత్రం అంకురార్పణగా ఆలయ ప్రాంగణంలోని మట్టిని సేకరిస్తారు. తొమ్మిది మూకుళ్లలో ఉంచి- నవ ధాన్యాల్ని నీళ్లతో కలిపి చల్లుతారు. ఈ కార్యక్రమానికి చంద్రుడు అధిపతి. బ్రహ్మోత్సవాలు ముగిసేలోగా, ఈ నవధాన్యాలు మొలకలెత్తుతాయి.

బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణ అత్యంత ప్రధానమైనది. ఆ స్తంభం పైన పతాకాన్ని ఆవిష్కరిస్తారు. నూత్న వస్త్రం పైన నందీశ్వరుణ్ని, అష్టమంగళ చిత్రాల్ని రూపొందిస్తారు. నందిధ్వజ పటం పేరిట ధ్వజస్తంభానికి వేలాడదీస్తారు. 'భేరీ పూజ' అంటూ డోలును పూజిస్తారు. సకల దేవతల్నీ ఆహ్వానించి, నిర్ణీత స్థలాల్ని కేటాయించి, రోజూ నివేదనల్ని సమర్పిస్తారు.

లోక కల్యాణార్థం భ్రమరాంబ సహిత మల్లికార్జున



అంతర్వాణి

స్వామికి రెండో రోజున వాహన సేవలు జరుగుతాయి. దేవీ దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాల్ని హంస, మయూర, గజ, అశ్వ వాహనాలపైన మాడవీధుల్లో ఊరేగిస్తారు. రోజుకో వాహనం ఊరేగింపు నిర్వహిస్తారు. వివిధ పుష్పాలు, ఆభరణాలతో అలంకరిస్తారు. పూజాదినాలతో పాటు గ్రామోత్సవం జరుపుతారు.

మహాశివరాత్రి పర్వదినాన శ్రీశైలం భూకైలాసంలా పరమ శోభాయమానంగా గోచరిస్తుంది. ఆనాటి రాత్రి పదకొండుమంది వేదపండితులతో మహా రుద్రాభిషేకం జరుగుతుంది. శ్రీశైలంలో మాత్రమే జరిగే పాగాలంకరణకు ఎంతో ప్రాధాన్యం ఉంది. స్వామివారి గర్భాలయం, విమాన శిఖరం నుంచి ముఖమండపం పైన ఉండే నందుల్ని అనుసంధానిస్తూ వస్త్రాలంకరణ ఉంటుంది. ఈ పాగాను సమర్పించే భక్తులు రోజుకు ఓ మూర వంతున, ఏడాదిపాటు 365 మూరల పొడవు గల తలపాగాల్ని నేస్తారు. బ్రహ్మోత్సవ కల్యాణానికి ముందు పెళ్లికుమారుడికి ఈ పాగాలంకరణ చేస్తారు.


పాగాలంకరణ అనంతరం, బ్రహ్మోత్సవ కల్యాణాన్ని ఉత్తర దిశలోని చంద్రావతి మండపంలో నిర్వహిస్తారు. వధూవరులకు ప్రభుత్వంతో పాటు తిరుమల-తిరుపతి దేవస్థానంవారు పట్టువస్త్రాలు తెచ్చి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

తొమ్మిదో రోజు సాయంకాలం సదస్యం, నాగవల్లి జరుగుతాయి. పదో రోజున యాగపూర్ణాహుతి, వసంతోత్సవం, కలశోద్వాసన, త్రిశూలస్నానం ఉంటాయి. చండీశ్వరుడికి పుణ్యస్నానం చేయిస్తారు. ధ్వజస్తంభం మీది నంది పతాకాన్ని అవరోహణ చేస్తారు. దీనితో సకల దేవతలకూ వీడ్కోలు పలికినట్లవుతుంది. బ్రహ్మోత్సవాల చివరి రోజున దంపతులకు పుష్పోత్సవం, ఏకాంత సేవ, శయనోత్సవం వేడుకలు జరుపుతారు. మొత్తం 18 రకాల పుష్పాలతో పుష్పోత్సవం చేస్తారు. ఈ ఉత్సవాలకు ఏటా లక్షలాది భక్తులు హాజరవుతుంటారు.

– చిమ్మపూడి శ్రీరామమూర్తి

కడుపులో చల్ల కదలకుండా.. కాలు మీద కాలేసుకొని కూచోవటం ఒకప్పుడు దర్జా! కానీ ఇప్పుడదే మహాశాపం. శారీరక శ్రమ లేని శరీరం జబ్బుల ఊబిగా తయారవుతుండటమే దీనికి నిదర్శనం. ఒకవైపు అధిక రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాల సమస్యలు.. మరోవైపు క్యాన్సర్ వంటి ప్రాణాంతక జబ్బులు ముంచుకొస్తున్న తరుణంలో శారీరక శ్రమ తప్పనిసరి 'తరుణోపాయంగా' మారిపోయింది. ఈ దిశగా సమాజంలో 'వ్యాయామ స్పృహ' కూడా పెరిగింది. అయినా కూడా ఎన్నో సందేహాలు. వ్యాయామం ఎప్పుడు చేయాలి? ఎంతసేపు చేయాలి? వేగంగా చేయాలా? నెమ్మదిగానా? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు. అందుకే వ్యాయామానికి సంబంధించిన సమగ్ర వివరాలను అందిస్తోంది ఈవారం సుఖీభవ.

వ్యాయామం జీవనాడి. అవును.. ఇప్పుడిదే నయా జీవనసూత్రం. బద్ధకాన్ని ఒకింత వదిలిపెట్టి ఒళ్లు వంచటం మొదలుపెడితే ఒనగూడే ప్రయోజనాలు చాలానే. వ్యాయామంతో మెదడు ఉత్తేజితమై మనసుకు ఉల్లాసాన్ని కలిగించే రసాయనాలు విడుదలవుతాయి. శారీరక దృఢత్వం, సామర్థ్యం పెంపొందుతుంది. శరీర సౌష్ఠవం, చర్మ ఆరోగ్యం మెరుగుపడి అందం ఇనుమడిస్తుంది. కుంగుబాటు, ఆందోళన దూరమై.. ఆత్మ విశ్వాసం, నమ్మకం పుంజుకుంటాయి. ఒంటి నిండా హుషారు తొణికిసలాడుతుంది. పనిలో సామర్థ్యం, నైపుణ్యం కొత్తపుంతలు తొక్కుతాయి. అన్నింటికీ మించి మధుమేహం, గుండెజబ్బులు, ఎముకలు గుల్లబారటం, క్యాన్సర్ వంటి పలు సమస్యల ముప్పు తగ్గుతుంది. అయితే దీన్ని సరైన పద్ధతిలో చేయటం, అవగాహన పెంచుకోవటం చాలా ముఖ్యం.



ఒళ్లు సరిగా వంచుతున్నారా?

ఎంత? ఎలా?



ఎంతసేపు వ్యాయామం చేయాలి? చాలామంది మనసును తొలిచే ప్రశ్న. ప్రపంచ ఆరోగ్యసంస్థ సిఫారసు ప్రకారం.. పెద్దవాళ్లు వారానికి కనీసం 150 నిమిషాల సేపు నడక, జాగింగ్ వంటి ఒక మాదిరి (మోడరేట్) వ్యాయామాలు చేయాలి. మరింత కఠినమైన, తీవ్రమైన (రిగరస్) వ్యాయామాలైతే 75 నిమిషాలు సరిపోతుంది. ఇది శరీరం ఫిట్‌గా, కండరాలు దృఢంగా ఉండటానికి, బరువు అదుపులో ఉండటానికి, ఆయుర్దాయం పెరగటానికి తోడ్పడుతుంది. వ్యాయామ చేసే సమయం పెరుగుతున్నకొద్దీ ఇలాంటి ప్రయోజనాలూ పెరుగుతుండటం గమనార్హం. జాగింగ్ చేయటం, జిమ్‌లకు వెళ్లటం కుదరనివారు నిరుత్సాహ పడాల్సిన పనేమీ లేదు. ఇంటిపనులు, తోటపని వంటివీ ఒక మాదిరి వ్యాయామం కిందికే వస్తాయి. ఆఫీసుకు నడుచుకుంటూ వెళ్లటం.. ఇల్లు ఊడ్చటం, తుడవటం వంటి పనులను వారానికి 150 నిమిషాల సేపు చేసినా కూడా అకాల మరణం ముప్పు 28% వరకు తగ్గుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి మరి. నిజానికైతే రోజూ క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయటం ఎంతో మంచిది. ఒకవేళ అలా కుదరనివారు వారాంతంలోనైనా చేసినా సరే. ఇలాంటి 'వారాంత యోధులకు' సైతం క్రమం తప్పకుండా వ్యాయామం చేయటంతో సమానంగా అకాల మరణం ముప్పు తగ్గుతున్నట్టు అధ్యయనాలు నొక్కి చెబుతున్నాయి. మరీ అతిగా వ్యాయామం చేస్తే అనర్థమని కొందరు అనుకుంటుంటారు గానీ ఇందులో నిజమేమీ లేదు. శరీరం సహకరించినంతవరకు తమ శక్తి మేరకు వ్యాయామం చేయొచ్చు. వారానికి కనీసం 3-5 సార్లు వ్యాయామం చేసేలా చూసుకోవటం ఉత్తమం. అయితే అదేపనిగా మైళ్లకొద్దీ పరుగెత్తటం వంటి ఒకేరకం వ్యాయామాలు కాకుండా వివిధ రకాలను ఎంచుకోవటం మరీ మంచిది. అలాగే అలవాటులేని వ్యాయామాలను ఒక్కసారిగా చేయటం మంచిది కాదు.

అతివేగం మంచిదేనా?

వ్యాయామం నెమ్మదిగా, క్రమం తప్పకుండా చెయ్యటం మంచి పద్ధతి. అయితే కొద్దిసేపట్లోనే ఉద్ధృతంగా వ్యాయామం చేసే పద్ధతితో (హెచ్‌ఐఐటీ) కూడా మంచి ఫలితం కనబడుతుంది. 20 సెకండ్ల పాటు ఉద్ధృతంగా వ్యాయామం చేయటం.. 10 సెకండ్ల పాటు విశ్రాంతి తీసుకోవటం.. ఇలా నాలుగు నిమిషాల సేపు వ్యాయామం చేయటం ఇందులోని కీలకాంశం. దీన్ని జపాన్‌కు చెందిన ఇజుమి టబాటా బృందం 90ల్లో రూపొందించింది. ఇలా వారానికి నాలుగు రోజులు చేసినా కూడా- మామూలు వ్యాయామాలను వారానికి ఐదు రోజుల చొప్పున ఆరు వారాల పాటు చేసినంత ప్రయోజనం లభిస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. శరీరం ఆయాసం వంటి వాటిని తట్టుకునేలా వెంట వెంటనే సిద్ధపడుతుండటమే దీనికి కారణం. ఉద్ధృత వ్యాయామంతో కొద్దిసేపట్లోనే గుండె, కండరాల నుంచి పెద్దఎత్తున రక్తప్రసరణ జరుగుతుంది. ఇది ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఉద్ధృత వ్యాయామంతో మరో ప్రయోజనం జీవక్రియల వేగం మరింతగా పుంజుకోవటం. అంటే మనం విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ కేలరీలు ఖర్చవుతాయన్నమాట. గుర్తించాల్సిన విషయం ఏంటంటే- ఇది అందరికీ పనికొచ్చేది కాదు. డాక్టర్లను సంప్రదించిన తర్వాతే సరిపోతుందో లేదో నిర్ణయించుకోవాలి. అలాగే నిపుణుల సమక్షంలోనే చేయాల్సి ఉంటుంది. లేకపోతే నొప్పులు, గాయాల వంటివి వేధించొచ్చు. మరీ ఇంత కఠినమైన వ్యాయామాలు చేయలేమని భావించేవారు ఇంకాస్త వేగంగా పరుగెత్తటం, మెట్లు ఎక్కటం వంటి వాటిని ఎంచుకోవచ్చు. ఏదేమైనా కాస్త వేగంగా వ్యాయామం చేయటం వల్ల జబ్బులు ముప్పు తగ్గుతుండటం మాత్రం నిజమని నిపుణులు చెబుతున్నారు. అయితే అప్పటికే హైబీపీ, మధుమేహం వంటివి ఉన్నవాళ్లు, వ్యాయామం అస్సలు అలవాటులేనివారు ఒక్కసారిగా ఉద్ధృతంగా వ్యాయామం మొదలుపెట్టకూడదు. క్రమంగా సమయం, దూరం, వేగం పెంచుకుంటూ.. వ్యాయామం అలవాటయ్యేలా చూసుకోవాలి.



ట్రెడ్‌మిల్‌తోనూ అంతే లాభమా?



నేల మీద, ట్రెడ్‌మిల్ మీద పరుగెత్తటం ఒకటేనా? ట్రెడ్‌మిల్‌తోనూ సమానంగా ఫలితం ఉంటుందా? ట్రెడ్‌మిల్ వ్యాయామం చేసేవారికి ఇలాంటి సందేహాలే వస్తుంటాయి. సాధారణంగా ఆరుబయట పరుగెట్టేటప్పుడు మనం గాలిని తోసుకుంటూ ముందుకు కదులుతుంటాం. ఒకచోట కుదురుగా ఉండే ట్రెడ్‌మిల్ మీదైతే ఇలా కష్టపడాల్సిన పనుండదు. అందువల్ల ట్రెడ్‌మిల్ మీద పరుగెట్టటం కాస్త తేలికగా అనిపిస్తుంది. ఈ తేడాను సరిదిద్దటానికే కొందరు ట్రెడ్‌మిల్ ఇంక్లైన్‌ను 1 శాతానికి సెట్ చేసుకుంటుంటారు. దీంతో నేల మీద 7 నిమిషాలకు మైలు దూరం పరుగెత్తినప్పటితో సమానంగా కేలరీలు ఖర్చవుతాయి. అయితే నెమ్మదిగా పరుగెడితే మాత్రం పెద్ద తేడా ఏమీ ఉండదు. ట్రెడ్‌మిల్ మీద పరుగెత్తటం చాలామందికి కాస్త కష్టంగానే అనిపిస్తుంటుంది. అందుకే నేల మీద కన్నా ట్రెడ్‌మిల్ మీద నెమ్మదిగానే పరుగెడుతుంటారు. ఒకే వేగాన్ని కొనసాగించేందుకు మనం బలంగా ప్రయత్నిస్తుండటమే దీనికి కారణం. అదే ఆరుబయట అయితే కొద్దిసేపు వేగంగా, కొద్దిసేపు నెమ్మదిగా.. ఇలా మన శక్తికి అనుగుణంగా వేగాన్ని మార్చుకోవచ్చు. చుట్టుపక్కల పరిసరాలను చూస్తుంటే ఎంత వేగంతో పరుగెడుతున్నామో కూడా మనకు తెలుస్తుంటుంది. పచ్చటి చెట్ల మధ్య, ప్రశాంతమైన వాతావరణంలో, శుభ్రమైన గాలిని పీలుస్తూ పరుగెట్టటం మనసుకూ ఉత్సాహాన్ని ఇస్తుంది. ఆనందం, తృప్తి లభిస్తాయి. ఆరుబయటకు వెళ్లటం కుదరనివారు ట్రెడ్‌మిల్ ఇంక్లైన్‌ను ఒకే స్థాయిలో కాకుండా మధ్యమధ్యలో మారుస్తుండటం మేలు.

సంగీతం వినటం మంచిదేనా?



సంగీతం వ్యాయామానికీ కొత్త హుషారునిస్తుంది. మరింత ఎక్కువసేపు వ్యాయామం చేయటానికి అవసరమైన శక్తిని అందిస్తుంది. నొప్పి భావన తగ్గటానికీ సంగీతం దోహదం చేస్తుంది. సాధారణంగా సంగీత బాణీలకు అనుగుణంగా కాళ్లు, చేతులు లయబద్ధంగా కదులుతుంటాయి. ఇది వ్యాయామాల వేగం పెరగటానికి లేదా తగ్గటానికి తోడ్పడుతున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి వేగంగా నడవాలని, సైకిల్ తొక్కాలని అనుకునేవారు కాస్త హుషారైన పాటలు వినటం మంచిది. దీంతో వేగం పెరగటమే కాదు, మరింత ఎక్కువసేపూ వ్యాయామం చేసేలా చూసుకోవచ్చు. అవసరమైతే ఇందుకు ఓ చిన్న చిట్కానూ పాటించొచ్చు. నిమిషానికి ఎన్ని అడుగులు వేస్తున్నారో లెక్కించుకొని.. దాన్ని రెట్టింపు చెయ్యండి. ఇప్పుడు ఆ అడుగుల సంఖ్యకు తగిన 'బీట్'తో కూడిన బాణీని ఎంచుకుని ప్రయత్నించండి.

సన్నద్ధత తప్పనిసరా?




లేడికి లేచిందే పరుగన్నట్టు కొందరు నేరుగా వ్యాయామాలకు సిద్ధమవుతుంటారు. వేగంగా నడవటం, పరుగెత్తటం వంటివి చేస్తుంటారు. ఇది సరైన పద్ధతి కాదు. వ్యాయామం చేయటానికి ముందు కాసేపు కాళ్లు, చేతులను సాగదీయటం.. కీళ్లను కదిలించటం వంటి సన్నద్ధ వ్యాయామాలు చేయటం మంచిది. దీంతో కండరాలు, కండర బంధనాలు వదులవుతాయి. కండరాలు గాయపడే ముప్పు తగ్గుతుంది. వ్యాయామాలు చేసేటప్పుడు కదలికలు సులువవుతాయి. అందువల్ల కాస్త సమయం పట్టినా కూడా వ్యాయామానికి ముందు కొంతసేపు శరీరం సన్నద్ధం కావటానికి సాగదీత వ్యాయామాలు చేయటం ఎంతో మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

చెమట పడితేనే బాగా చేసినట్టా?



చెమట ఎంత ఎక్కువ పడితే అంత ఎక్కువ వ్యాయామం చేసినట్టని, బరువు కూడా బాగా తగ్గుతామని కొందరు భావిస్తుంటారు. కొంతవరకిది సమంజసంగానే అనిపించొచ్చు గానీ వ్యాయామం వల్ల లభించే ప్రయోజనాలకు చెమట కొలమానమేమీ కాదు. మన శరీరం వేడిని తగ్గించుకోవటానికి చేసే ప్రయత్నంలో భాగంగా చెమట పడుతుందనే విషయాన్ని గుర్తించటం అవసరం. చెమట ఎక్కువగా పోసే స్వభాగం గలవారికి వ్యాయామంతో ఇది మరింత ఎక్కువవుతుంది. కాబట్టి వ్యాయామ ప్రయోజనాలకు సంబంధించి చెమట కన్నా గుండె వేగం పెరగటమే కీలకం. జిమ్‌లో పక్కవాళ్లు చెమట్లు కక్కుతుంటే మన కన్నా ఎక్కువగా కష్టపడుతున్నారని భావించాల్సిన పని లేదు. అలాగే చెమట ఎక్కువ పడితే బరువు బాగా తగ్గుతుందని అనుకోవటం కూడా పొరపాటే. చెమట కేవలం నీరే కదా. కేలరీలు ఖర్చు కావటానికి సంబంధించి చెమట అంత గొప్ప సూచనేమీ కాదు. దీన్ని వ్యాయామ తీవ్రతకు గుర్తుగా భావించాల్సిన అవసరమేమీ లేదు.

నెమ్మదిగా చేస్తేనే కొవ్వు కరుగుతుందా?



వ్యాయామం నెమ్మదిగా, ఎక్కువసేపు చేయటం వల్ల కొవ్వు మరింత అధికంగా ఖర్చవుతుందన్నది కొందరి నమ్మకం. మన శరీరం పిండి పదార్థాలను త్వరగా శక్తిగా మలచుకుంటుండటమే ఈ భావనకు పునాది. నిజానికి నెమ్మదిగా వ్యాయామం చేసినపుడే మన శరీరం పిండి పదార్థాల కన్నా కూడా కొవ్వునే ఎక్కువగా వినియోగించుకుంటుంది. అయితే వేగంగా, ఉద్ధృతంగా వ్యాయామాలు చేసినపుడు పిండి పదార్థాలు, కొవ్వు రెండూ మరింత పెద్దమొత్తంలో ఖర్చవుతుండటం గమనార్హం. అందువల్ల వ్యాయామంతో మరింత ప్రయోజనం పొందాలని అనుకునేవారు కాస్త వేగంగా వ్యాయామాలు చేసినా మంచిదే.

శక్తి పానీయాలు తాగాలా?



చెమట పట్టినపుడు రక్తంలోని ప్లాస్మా నుంచి నీరు బయటకు వచ్చేస్తుంది. దీంతో రక్తం పరిమాణం కూడా తగ్గుతుంది. ఫలితంగా కండరాలకు అవసరమైన ఆక్సిజన్, ఇతర పోషకాలను అందించటానికి గుండె మరింత ఎక్కువగా కష్టపడాల్సి వస్తుంది. కాబట్టి శారీరక శ్రమ, వ్యాయామాలు చేసేటప్పుడు ఒంట్లో నీటి శాతం తగ్గకుండా (డీహైడ్రేషన్) చూసుకోవటం చాలా ముఖ్యం. వ్యాయామ సమయంలో గంటకు సగటున 0.8 నుంచి 1.4 లీటర్ల నీరు చెమట రూపంలో బయటకు వెళ్తుందని అంచనా. మన శరీర బరువులో 2% నీరు కోల్పోతే.. అంటే 75 కిలోల బరువుగల వ్యక్తికి 1.5 లీటర్ల చెమట పడితే డీహైడ్రేషన్‌లోకి వెళ్లినట్టే. కాబట్టి ఎక్కువసేపు వ్యాయామాలు చేసేవారు మధ్యమధ్యలో నీరు తాగటం మంచిది. అయితే కొందరు నీటికి బదులు శక్తినిచ్చే పానీయాలు తాగుతుంటారు. మరీ ఎక్కువసేపు వ్యాయామాలు చేసేవారికేమో గానీ ఒక మాదిరిగా చేసేవారికి మాత్రం ఇవి అంతగా ఉపయోగపడవు. వీటిల్లో చక్కెర అధికంగా ఉండటం వల్ల కేలరీల మోతాదు పెరిగిపోయి బరువు తగ్గటానికి బదులు ఇంకాస్త పెరుగుతుంది.

ఉదయం వ్యాయామమే మంచిదా?



ఉదయం నిద్ర లేచేసరికి కడుపు ఖాళీగా ఉంటుంది. అప్పుడు వ్యాయామం చేస్తే పిండి పదార్థాలేవీ అందుబాటులో ఉండవు కాబట్టి శరీరం కొవ్వును శక్తిగా వినియోగించుకుంటుంది. కాబట్టి ఉదయాన్నే వ్యాయామం చేయటం మంచిదని భావిస్తుంటారు. ఇందులో కొంత నిజం లేకపోలేదని బాత్ విశ్వవిద్యాలయ అధ్యయనంలో బయటపడింది. కొందరు ఊబకాయులను పరగడుపున, మరికొందరు ఊబకాయులను ఆహారం తీసుకున్నాక ట్రెడ్‌మిల్ మీద నడిపించి పరిశీలించగా.. పరగడుపున వ్యాయామం చేసినవారిలోనే కొవ్వు ఖర్చయినట్టు బయటపడింది. అయితే ఉద్ధృతంగా, ఎక్కువసేపు వ్యాయామాలు చేయాలని భావించేవారు ఖాళీ కడుపుతో వ్యాయామాలకు ఉపక్రమించటం మంచిది కాదు. ఎందుకంటే పిండి పదార్థాలు లేకపోతే ఎక్కువసేపు వ్యాయామం చేయటానికి అవసరమైన శక్తి లభించదు. దీంతో కొద్దిసేపటికే చతికిలబడిపోవచ్చు. అయితే ఏ వ్యాయామమైనా తిన్న వెంటనే చేయకూడదు. ఆహారం తినగానే రక్తప్రవాహం మొత్తం జీర్ణవ్యవస్థ వైపు మళ్లుతుంది. ఆ సమయంలో వ్యాయామం చేస్తే గుండె మీద భారం పడుతుంది. కాబట్టి తినగానే వేగంగా నడవటం, వ్యాయామాల వంటివి చేయొద్దు.

కండరాల నొప్పి ఎందుకు?



జాగింగ్‌కు, జిమ్‌కు వెళ్లటం ఆరంభించిన మర్నాడు ఒళ్లునొప్పులతో బాధపడటం సహజమే. వ్యాయామ సమయంలో కండరాలు అలసిపోవటం, హైడ్రోజన్ అయాన్ల వంటి వ్యర్థాలు పోగుపడటం, ఆ వ్యర్థాలను బయటకు వెళ్లగొట్టటానికి వెళ్లిన ద్రవం అక్కడే చిక్కుబడటం వంటివి ఇందుకు దోహదం చేస్తుంటాయి. ఒకట్రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటే ఈ నొప్పులన్నీ మాయమైపోతాయి. కొందరికి వ్యాయామం చేసిన 24 నుంచి 72 గంటల తర్వాత కూడా కండరాల నొప్పులు తలెత్తొచ్చు. కొన్నిసార్లు కండరం దెబ్బతినటం, పట్టేయటం వల్ల వ్యాయామం చేసిన వెంటనే తీవ్రమైన నొప్పి వేస్తుంటుంది. ఇలాంటివి వారం వరకు విశ్రాంతి తీసుకుంటేనే గానీ తగ్గవు.



నాన్న నుంచి నటన... నాన్న నుంచి నిర్మాణశైలి... నాన్న నుంచి క్రమశిక్షణ... వారసత్వంగా తెచ్చుకున్నాడు మంచు విష్ణు. కమర్షియల్ సూత్రాల్ని నమ్ముకుంటూనే, ఏదో ఓ కొత్త ప్రయత్నం చేయాలన్నది విష్ణు తాపత్రయం. 'ఢీ', 'దేనికైనా రెడీ', 'దూసుకెళ్తా' చిత్రాలు బాక్సాఫీసు దగ్గర నిలబెట్టాయి. 'రౌడీ', 'అనుక్షణం'లతో నటుడిగానూ పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు 'గాయత్రి'లో ఓ కీలక పాత్ర చేశారు. మోహన్‌బాబు నటిస్తూ నిర్మించిన చిత్రం 'గాయత్రి'. ఈనెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో 'ఈనాడు సినిమా'తో ముచ్చటించారు విష్ణు.

నాన్నని ఎవరూ డబ్బుతో కొనలేరు

ఇప్పటి వరకూ చేసిన సినిమాలతో పోలిస్తే 'గాయత్రి' ప్రత్యేకత ఏమిటి?

నా వరకూ నేను ఈ సినిమాని నాలో ఉన్న నటుడికి శల్య పరీక్షలా భావిస్తా. నటుడిగా నిరూపించుకోవడానికి సినిమా మొత్తం కనిపించాల్సిన అవసరం లేదని నా నమ్మకం. పదిహేను నిమిషాలే కనిపించినా, ఆ ప్రభావం సినిమా మొత్తం ఉండాలి. అలాంటి పాత్ర 'గాయత్రి'లో నాకు దక్కింది. నేను ఎంత వరకూ నిరూపించుకున్నానన్నది ప్రేక్షకులే చెప్పాలి.

శివాజీ పాత్రలో మీ నాన్నగారు నటించారు. శివాజీ యుక్త వయసు పాత్ర మీరు పోషించారు. మీ నాన్నలా నటించడం సాహసం అనిపించలేదా?

నిజానికి ఆ పాత్ర కూడా నాన్నగారే చేయాలి. కానీ దర్శకుడు మదన్ నాకు కథ చెబుతున్నప్పుడు 'ఈ పాత్ర మాత్రం నేను చేస్తా' అన్నాను. సినిమా మాదే కాబట్టి... మదన్ పరిస్థితి కక్కలేక, మింగలేక అన్నట్టు తయారైంది. చివరికి వాళ్లని ఒప్పించగలిగాను. కథలో చాలా కీలకమైన పాత్ర అది. ఆ పదిహేను నిమిషాలూ నిలబెట్టగలిగితే మేం అనుకున్న ఫలితం వచ్చేస్తుంది. సినిమా చూస్తున్నప్పుడు శివాజీ పాత్రలో నన్ను ప్రేక్షకుడు ఒప్పుకోగలిగితే... మా ప్రయత్నం సఫలం అయినట్టే.

'ఈసారి నాన్నగారికి ఎలాగైనా సరే హిట్టు ఇవ్వాల'నే తపనతో పనిచేసినట్టున్నారు..?

నాకూ మనోజ్‌కి హిట్టు అవసరం. కానీ ఆయనకు అవసరం లేదు. నాన్న అనే కాదు, పెద్ద స్థాయి నటులెవరైనా సరే... ఇప్పుడు విజయాల గురించి ఆలోచించరు. తమ స్థాయికి తగిన పాత్రలు చేస్తున్నామా, లేదా? అనేదే పట్టించుకుంటారు. ఈమధ్య నిజంగానే తగిన పాత్రలు దక్కలేదు. 'మామ మంచు అల్లుడు కంచు' సినిమా చేస్తున్నప్పుడు ఓరోజు సెట్‌కి వెళ్లా. 'మీరు ఇలాంటి కామెడీ పాత్రలు చేస్తే జనాలు చూడరు నాన్న' అని చెప్పేశా. 'పెదరాయుడు' లాంటి సినిమా తరవాత నాన్నగారు కామెడీ చేస్తానంటే జనం ఒప్పుకోరు. 'అడవిలో అన్న', 'శ్రీరాములయ్య', 'రాయలసీమ రామన్న చౌదరి' ఇలాంటి పాత్రలు జనం గుండెల్లో నిలిచిపోయాయి. 'యమదొంగ', 'బుజ్జిగాడు'లోనూ ఆయన ఎక్కడా కామెడీ చేయలేదు. ఆయన కోసం ప్రేక్షకులు ఓ గిరి గీసేశారు. అందులోనే చేయాలి. అయితే కొన్నిసార్లు కామెడీ కోసం ప్రయత్నించాం. అదే మేం చేసిన తప్పు.

దర్శకులకు ఆయన ఇవ్వాల్సిన స్వేచ్ఛ ఇస్తారా?

నూటికి నూరు పాళ్లూ ఇస్తారు. ఎంతటి పెద్ద సన్నివేశాన్నయినా ఒకే ఒక్క టేక్‌లో పూర్తి చేయగలిగే నటుడాయన. ఆయన దగ్గరకు కథ తీసుకొచ్చే ఏ దర్శకుడు అయినా పూర్తి క్లారిటీతో రావాలి. 'వన్ మోర్' అడిగేటప్పుడు దానికి కారణం చెప్పగలగాలి. 'రౌడీ' సెట్లో నేను దగ్గరుండి చూశా. దాదాపు 90 శాతం సింగిల్ టేక్‌లో పూర్తయిపోయాయి. వర్మ 'వన్‌మోర్' అడిగింది చాలా తక్కువ సార్లు.

తరచూ నటించమని మీరెప్పుడైనా సలహా ఇచ్చారా?

ఆయన ఎవరి మాటా వినరు. కథ, అందులో ఆయన పాత్ర నచ్చకపోతే ఎంతమంది చెప్పినా, ఎన్ని కోట్లు ఇస్తామన్నా ఒప్పుకోరు. ఆమధ్య ఓ పెద్ద సినిమాలో ఆఫర్ వచ్చింది. కేవలం మూడు రోజుల పాత్ర అది. దానికే కోటి రూపాయలు ఇస్తామన్నారు. కానీ నాన్నగారు మాత్రం 'నో' చెప్పారు. అదే సమయంలో రచయిత భారవి 'జగద్గురు ఆదిశంకర' సినిమా చేస్తున్నారు. ఆ చిత్రంలో తన పాత్ర నచ్చి పైసా పారితోషికం తీసుకోకుండా ఏడు రోజులు పనిచేశారు. కాస్ట్యూమ్స్ కూడా నాన్నగారివే. ఆయన్ని ఎవ్వరూ డబ్బుతో కొనలేరు. 'మహానటి' ఒప్పుకోవడానికి కారణం డబ్బు కాదు. స్క్రిప్టు నచ్చి ఒప్పుకున్నారు. ఆయన వద్దనుకుని వదిలేసిన పాత్రలెన్నో ఉన్నాయి. అలాగని మాకెవరికీ డబ్బు అవసరం లేదని కాదు. మా దగ్గర నాలుగువేల మంది పనిచేస్తున్నారు. వాళ్లందరికీ జీతాలు ఇవ్వాలి. నెలకు కోట్ల రూపాయల టర్నోవర్ జరుగుతుంటుంది. వాటన్నింటికీ డబ్బు కావాలి. కానీ డబ్బు కంటే ఆత్మసంతృప్తి ముఖ్యం కదా.

శ్రియ మీకంటే సీనియర్ కదా. ఆమెని ఎంచుకోవడానికి ప్రధాన కారణమేంటి?

ఆ పాత్ర కోసం ముందు కాజోల్‌ని సంప్రదించాం. మాధురీ దీక్షిత్‌నీ అనుకున్నాం. మా ఆవిడ వినీ సలహా మేరకు శ్రియ దగ్గరకు వెళ్లాం. ఇప్పుడు సినిమా చూసుకుంటుంటే... 'ఈ పాత్రను శ్రియ తప్ప ఇంకెవ్వరూ చేయలేర'నిపిస్తోంది.

'ఆచారి అమెరికా యాత్ర' వాయిదా పడింది. కారణమేంటి?

ఆ సంగతి నిర్మాత ఎమ్‌ఎల్ కుమార చౌదరికే తెలియాలి. జనవరి 26న మా సినిమా వస్తే బాగుంటుంది అనిపించింది. నిర్మాత కూడా 'ఆ రోజే విడుదల చేద్దాం' అనేవారు. కాకపోతే చేయాల్సిన పనులు మా కళ్ల ముందు కనిపిస్తూనే ఉండేవి. 'ఈ సినిమా చెప్పిన సమయానికి విడుదల అవ్వదేమో' అనే అనుమానం పీకేది. చివరికి అదే జరిగింది.

'ఓటర్' ఎలా ఉండబోతున్నాడు?

అదో పొలిటికల్ డ్రామా. ఓటేసేవాడు యజమాని. గెలిచిన వాడు సేవకుడు అని చెప్పే కథ అది. ఈ సినిమా చూసి కొంతమందైనా మారతారన్నది మా నమ్మకం.

'కన్నప్ప'కి దర్శకుడు దొరికాడా?

దొరికాడు. అయితే మన దర్శకులు కాదు. హాలీవుడ్ నుంచి తీసుకొస్తాం. ఇద్దరు దర్శకుల పేర్లు పరిశీలిస్తున్నాం. అందులో ఒకరి పేరు ఏప్రిల్‌లో అధికారికంగా ప్రకటిస్తాం. రూ. 70 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కే సినిమా అది. ప్రస్తుతానికైతే నాకు అంత మార్కెట్ లేదు. కానీ ఓ మొండి ధైర్యంతో దిగిపోతున్నాం.

మేనరిజంలోనూ, డైలాగులు పలకడంలోనూ నాన్నగారిని అనుసరించారా?

అంత సాహసమైతే చేయలేదు. నేను ఎలా చేస్తానో అలానే చేశా. నాన్నగారైతే ఒక్క రోజు కూడా సెట్‌కి రాలేదు. ఎలాంటి సలహాలూ ఇవ్వలేదు. ఒక్కటి మాత్రం నిజం... ఇలాంటి పాత్ర ఎప్పుడూ చేయలేదు. నా పాత్రలెప్పుడూ సరదాగా, హుషారుగా సాగిపోయేవే. తొలిసారి మాత్రం సెంటిమెంట్‌తో గుండెల్ని పిండేస్తా. సినిమా చూసి బయటకు వచ్చే ప్రేక్షకుడు గాయత్రి పటేల్‌తో పాటు నా గురించి కూడా మాట్లాడుకుంటే నేను విజయం సాధించినట్టే.

ఈమధ్య ట్విట్టర్‌లో ఆడపిల్లల గురించీ, వారసత్వం గురించీ మీరు చేసిన కామెంట్లు చర్చనీయాంశమయ్యాయి...

అవును. నాకు ఇద్దరు కూతుర్లు. మూడోసారి కొడుకు పుట్టాడు. మూడోసారి కూతురు పుడితే... అన్న ప్రశ్నకు నేను ఆవిధంగా స్పందించాల్సి వచ్చింది. కూతురు పుడితే ఏంటట? అబ్బాయికీ, అమ్మాయికీ తేడా ఏమిటి? నేను అన్ని విషయాల్లోనూ నా భార్య వినీపైనే ఆధారపడతాను. అమ్మాయిలకంటే గొప్ప పరిపాలకులు ఎవరూ లేరన్నది నా నమ్మకం. 'న్యూయార్క్ అకాడమీ' అనే ఓ ఇంటర్నేషనల్ స్కూల్ స్థాపించాం. దక్షిణాదిలోని అత్యుత్తమ పాఠశాలల్లో అదొకటిగా నిలిచింది. ఇదంతా వినీ నైపుణ్యమే. నా పిల్లలకు నేను పూర్తి స్వేచ్ఛ ఇస్తా. వాళ్లని నాలా సినిమా రంగంలో చూడాలని నా ఆశ. 'నేను పైలట్ అవుతా, డాన్సర్‌ని అవుతా' అని వాళ్లు అడిగితే అదే చేస్తా. ఏమో ఆయా రంగాల్లో వాళ్లు నాకంటే గొప్ప పేరు తెచ్చుకోవొచ్చేమో..?

ఈనాడు సినిమా


రామ్‌చరణ్

జిల్ జిల్ జిగేల్...

సుకుమార్ - దేవిశ్రీ ప్రసాద్ కాంబినేషన్ అనగానే... ఓ అదిరిపోయే ప్రత్యేక గీతం గుర్తొచ్చేస్తుంటుంది. 'అ అంటే అమలాపురం', 'డియాలో డియాలో', 'రింగ రింగ'.... ఇవన్నీ వీరి సినిమాల్లోనివే. 'రంగస్థలం'లోనూ ఓ ప్రత్యేక గీతం ఉంది. రామ్‌చరణ్, సమంత జంటగా నటిస్తున్న చిత్రమిది. మైత్రీ మూవీస్ నిర్మిస్తోంది. ఇందులో 'జిల్ జిల్ జిగేల్' అనే ఓ ప్రత్యేక గీతం ఉంది. చంద్రబోస్ రచించారు. ప్రస్తుతం ఈ పాటను హైదరాబాద్‌లో రామ్‌చరణ్, పూజా హెగ్డేలపై తెరకెక్కిస్తున్నారు. జానీ మాస్టర్ నృత్య రీతులు సమకూరుస్తున్నారు. ఈ పాటతో చిత్రీకరణ పూర్తయినట్టే. ఇటీవల టీజర్ విడుదలైంది. అందులో చిట్టిబాబుగా రామ్‌చరణ్ పాత్రని పరిచయం చేశారు. త్వరలోనే సమంతకు సంబంధించిన ఓ టీజర్‌ని విడుదల చేసే పనిలో ఉంది చిత్రబృందం. మార్చి 30న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు.

విడుదల ఖరారు


నితిన్

నితిన్ కథానాయకుడిగా కృష్ణచైతన్య దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. మేఘ ఆకాష్ కథానాయిక. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ఠ్ మూవీస్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. ఎన్. సుధాకర్‌రెడ్డి నిర్మాత. నిఖితారెడ్డి సమర్పిస్తున్నారు. ఒక పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. ఏప్రిల్ 5న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. ఈ నెల 12న ఫస్ట్‌లుక్‌ని, 14న టీజర్‌ని విడుదల చేయనున్నట్టు నితిన్ సోమవారం ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. ఆయన నటిస్తున్న 25వ చిత్రమిది. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ కథని అందించారు. "ప్రేమతో కూడిన ఓ కుటుంబ కథా చిత్రమిది. ఆద్యంతం సరదాగా సాగుతుంది. హైదరాబాద్, ఊటీ, అమెరికాల్లో చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయ"ని దర్శకుడు తెలిపారు. 'లై'తో ఆకట్టుకొన్న నితిన్, మేఘ జంట ఈ చిత్రంతో మరోసారి సందడి చేయబోతోంది. కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, ప్రగతి, సత్య, ఆశురెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: ఎం.నటరాజ సుబ్రమణియన్, కూర్పు: ఎస్.ఆర్.శేఖర్.


అనుష్క

మంచివాడు మొదట కష్టపడొచ్చు. కానీ ఓడిపోడు. చెడ్డవాడు ముందు సుఖపడొచ్చు. కానీ ఓడిపోతాడు.

చిత్రం: బాషా

- పంపినవారు: షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్- 501512

కొత్త పాత్ర... కొత్త లుక్


శర్వానంద్


సాయిపల్లవి

శర్వానంద్, సాయిపల్లవి జంటగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి, ప్రసాద్ చుక్కపల్లి నిర్మిస్తున్నారు. కోల్‌కతాలో చిత్రీకరణ ప్రారంభమైంది. శర్వానంద్, సాయిపల్లవిలపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. "శర్వానంద్‌ని సరికొత్త పాత్రలోనే కాకుండా ఓ కొత్త రకమైన లుక్‌లో చూపించబోతున్నారు దర్శకుడు. మంచి కథకి, మంచి సాంకేతిక బృందం తోడైంది" అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జయకృష్ణ, సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

అందులోనూ బలం ఉంది!

సానుకూల ధోరణితో ఆలోచిస్తే అన్నింటికీ పరిష్కారం లభిస్తుందని చెబుతోంది అనుష్క. మన బలహీనతలోనే బలం కూడా ఉంటుందని నమ్మే స్వభావం నాది అంటోందామె. 'భాగమతి'గా అలరిస్తున్న స్వీటీ ఇప్పుడు విజయాన్ని ఆస్వాదిస్తూనే, కొత్త కథలపై దృష్టిపెట్టింది. నటిగా, వ్యక్తిగా మీలో మీకు కనిపించే బలాలు ఏవి? అని అడిగితే..."నాలో బలహీనతలే ఎక్కువ. కానీ అవే కొన్నిసార్లు నాకు మేలు చేస్తుంటాయి. ఒకేసారి రెండు మూడు పనులపై దృష్టిపెట్టలేను. చాలామంది అలవోకగా అన్ని పనులూ చేసుకొంటూ వెళుతుంటారు. అది చూసినప్పుడు ఆశ్చర్యంగా అనిపిస్తుంటుంది. కానీ నాకు చేతకాదు కదా అని నా శైలిలో నేను ముందుకు వెళుతుంటా. అయితే నాకున్న అలవాటువల్ల ఒకే పనిపై పూర్తిస్థాయిలో మనసు కేంద్రీకృతం చేసే వీలు దక్కుతోంది. దాంతో చేస్తున్న పనిలో మరింత పరిపూర్ణత సాధ్యమవుతుందనేది నా భావన. ఫ్యాషన్ విషయంలోనూ అంతే. బయట నేను ఫ్యాషన్ గురించి పెద్దగా పట్టించుకోను. అది నా బలహీనత. కానీ తెరపై మాత్రం ట్రెండ్‌కి తగ్గట్టే కనిపించాల్సి వస్తుంటుంది. దాంతో సినిమాకోసం ధరించే దుస్తులన్నీ నాకే కొత్తగా కనిపిస్తూ, నాలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంటాయి" అని చెప్పుకొచ్చింది అనుష్క.


రాకాసి బల్లుల్ని రక్షించబోతే..!

భూమి మీద వేల ఏళ్ల క్రితం ఉండే డైనోసార్ల కథ 'జురాసిక్ పార్క్'గా వెండితెరకొచ్చింది. దేశం, భాష తేడా లేకుండా ప్రపంచవ్యాప్తంగా అందర్నీ ఆకట్టుకొంది ఈ చిత్రం. తర్వాత ఈ సిరీస్‌లో మూడు చిత్రాలొచ్చాయి. ఆ సిరీస్‌లో నాలుగోదిగా 'జురాసిక్ వరల్డ్' తెరకెక్కింది. దీనికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రం 'జురాసిక్ వరల్డ్: ఫాలెన్ కింగ్‌డమ్'. జె.ఎ.బయోనా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా రెండో ట్రైలర్ విడుదలై ఆకట్టుకుంటోంది. ఇస్లా న్యూబ్లర్‌లోని 'జురాసిక్ వరల్డ్' థీమ్ పార్క్ ధ్వంసమయ్యాక అక్కడుండే డైనోసార్లు స్వేచ్ఛగా సంచరిస్తుంటాయి. కొన్నేళ్లకు అక్కడి అగ్ని పర్వతం బద్దలుకావడంతో డైనోసార్లకు ముప్పువాటిల్లుతుంది. వాటిని రక్షించడానికి థీమ్ పార్క్‌కు ఒకప్పుడు మేనేజర్‌గా పనిచేసిన క్లారీ డీరింగ్ సిద్ధమవుతాడు. ఆ క్రమంలో అతడికి ఎదురైన పరిస్థితుల నేపథ్యంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. క్రిస్ ప్రాట్, బ్రైస్ డల్లాస్ హోవర్డ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని జూన్ 22న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

'జురాసిక్ వరల్డ్: ఫాలెన్ కింగ్‌డమ్'



ప్రేమికుల రోజున...


ఓవియా, తరుణ్

తరుణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఇది నా లవ్‌స్టోరీ'. ఓవియా కథానాయిక. రమేష్ గోపి దర్శకత్వం వహించారు. ఎస్.వి.ప్రకాష్ నిర్మాత. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 14న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. తరుణ్ మాట్లాడుతూ "ఒక మంచి అనుభూతికి గురిచేసే ప్రేమకథా చిత్రమిది. తప్పకుండా ప్రేక్షకుల్ని అలరిస్తుంది" అన్నారు. దర్శకులు మాట్లాడుతూ "తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గ ప్రేమకథా చిత్రమిది. కుటుంబమంతా కలిసి చూసేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాం" అన్నారు. "ఒక ఉత్తమ చిత్రంగా ప్రేక్షకుల మనసును గెలుచుకొంటుందనే నమ్మకం మాకుంది" అన్నారు నిర్మాత. ఈ సినిమాని అభిరామ్ సమర్పిస్తున్నారు.

పద్మావత్ @ రూ. 200 కోట్లు

దీపికా పదుకొణె ప్రధాన పాత్రలో నటించిన 'పద్మావత్' బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లు రాబడుతూ ముందుకెళుతోంది. ఎన్ని వివాదాలు ముసురుకున్నా.. పలు రాష్ట్రాల్లో విడుదల కాకపోయినా వసూళ్లు బాగానే ఉన్నాయి. తాజాగా మనదేశంలో రూ.200కోట్ల మైలు రాయిని దాటిందీ చిత్రం. ఈ వారాంతానికి రూ.250 కోట్లు దాటి వెళుతుందని ట్రేడ్ విశ్లేషకుల అంచనా. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్, షాహిద్‌కపూర్ కీలక పాత్రలు పోషించారు.


దీపికా పదుకొణె

చర్మ చాయ బాగుండాలని ఎవరికి మాత్రం ఉండదు. అది సాధ్యం కావాలంటే రాసుకునే క్రీంలూ, అప్పుడప్పుడూ వేసుకునే పూతలతోపాటూ చర్మానికి కాస్త మర్దన కూడా అవసరమే. దానివల్ల ఎన్నో లాభాలు కూడా ఉన్నాయి తెలుసా. మరి అందుకేం చేయాలంటే...

ముఖానికి మర్దనా ముఖ్యమే

- కనీసం వారానికి ఒకసారైనా ముఖాన్ని మర్దన చేసుకోవడం వల్ల రక్త ప్రసరణ బాగుంటుంది. అంతేకాదు ముఖ కండరాలు ఉత్తేజితమై.. చర్మాన్ని మెరిపించడానికి ఈ మర్దన దోహదం చేస్తుంది.
- తరచూ మర్దన చేసుకోవడం వల్ల వృద్ధాప్య చాయలు కూడా దూరమవుతాయి. చాలామందికి, పెదాలూ, కళ్ల చుట్టూ చర్మం త్వరగా ముడతలు పడిపోతుంది. అలాంటి వారికి మర్దన చక్కగా ఉపయోగపడుతుంది. ఆ సమస్యలు దూరం అవుతాయి.



- చర్మంపై నల్లగా మారిందా.... అయితే వారానికి ఒకసారి మర్దన చేసుకుని చూడండి.
- నిరంతరం ముఖం మర్దన చేసకోవడం వల్ల చర్మం బిగుతుగా ఉంటుంది. అంతే కాదు ముఖచర్మంపై వ్యర్థాలు పేరుకోకుండా ఉంటాయి.
- మర్దన వల్ల కళ్ల అలసట దూరమవుతుంది. నల్ల మచ్చలు కూడా తగ్గుతాయి. మర్దన చేసేటప్పుడు తప్పనిసరిగా ఏదో ఒక నూనె ఉపయోగించాలి. సున్నిత చర్మతత్వం ఉన్నవారు మాత్రం అతిగా మర్దన చేయకపోవడం మంచిది.

ఇలా రాసి చూడండి...

అకస్మాత్తుగా బరువు పెరిగినా, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా తగ్గకపోయినా... దానికి మనం చేసే ఏదో ఒక పొరపాటే కారణం. ఇలాంటప్పుడు మీరు చేసే వ్యాయామాలూ, ఆహారనియమాలకు సంబంధించిన వివరాలను ఓ చోట రాసుకోవడం మంచిది.

- ఓవారం పదిరోజులపాటు మీరేం తింటున్నారు.. ఎంతసేపు వ్యాయామం చేస్తున్నారనేదీ క్రమం తప్పకుండా రాసుకోవాలి. మీకంటూ ఓ అవగాహన వస్తుంది.



- మీరు తీసుకునే అల్పాహారం, ఎన్ని సార్లు భోజనం, స్నాక్స్, మధ్యలో అదనపు ఆహారం, కాఫీ, టీ, ఐస్‌క్రీం వివరాలను రాయాలి. అలాగే పండ్లూ, కూరగాయలు ఏ మేరకు తింటున్నారనేదీ రాయాలి.
- మీరు పెట్టుకున్న సమయం పూర్తయ్యాక మీరు అదనంగా, కెలొరీలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని ఎన్నిసార్లు తీసుకున్నారూ... చేసిన వ్యాయామం ఇలా గమనించండి. తక్కువ వ్యాయామం చేస్తే.. దాన్ని పెంచేలా చూసుకోవాలి. ఇక, హానిచేసే పదార్థాల మోతాదును ఒకేసారి కాకుండా నెమ్మదిగా తగ్గించుకుంటూ రావాలి.
- ఒకవేళ మీరు జిమ్ వెళ్లేటట్లయితే.. చేసిన వ్యాయామాలూ, కరిగిన కెలొరీల వివరాలను కూడా రాసుకోవాలి. దానివల్ల కూడా మీకో స్పష్టత వస్తుంది. అదనంగా చేయాల్సిన వ్యాయామాలేంటో నిపుణులను అడిగి తెలుసుకోవచ్చు.

మేళవిస్తే... మెరుపులే!

గళ్లూ, చుక్కలూ, రంగురంగుల పూలు... దుస్తులపై ఇలా ఏదో ఒక డిజైను ఉండటం మామూలే.. కానీ అన్నీ కలిపి ఒకేచోట కుదిరితే.. ఆ అందమే వేరు కదూ.. అలా డిజైన్ల మేళవింపే ఇప్పుడు ట్రెండ్ తెలుసా.. మిక్స్‌డ్ ప్రింట్‌గా పేర్కొనే ఈ డిజైన్లు అన్ని సందర్భాలకు ఆకట్టుకునేలా అమరుతున్నాయి ఇప్పుడు.



గళ్లూ పూలు: జామెట్రిక్ డిజైన్లలో పూలూ, గళ్లూ కలిపి వచ్చే క్రాప్ టాప్స్ రోజూవారీకే కాదు, సాయంత్రపు వేళల్లో కూడా చూడముచ్చటగా ఉంటాయి. లేత వర్ణాల్లో పూలు అయితే, గళ్లు ముదురు రంగుల్లో ఉండేలా చూసుకోవాలి. అలాగే మొత్తం పూలు పరచుకున్నా అక్కడక్కడా చుక్కలు ఉన్నవీ అదిరిపోతాయి. జీన్స్ పైకి నప్పే ఈ డిజైను సాయంత్రపు పార్టీలకు అనువుగా ఉంటుంది. అలాగే మోకాళ్లపై వరకూ వచ్చే మిడీలో అడుగునా, పైనా కూడా రెండు రకాల జామెట్రికల్ డిజైన్ల మేళవింపు కూడా బాగుంటుంది. దీనికి కోల్డ్ షోల్డర్ లేదా మోచేతి వరకు చేతులుండేలా చూసుకోవాలి. ఈ డిజైనులో ఇండో, వెస్టర్న్ తరహాలో గౌన్లూ ఎంచుకోవవచ్చు.

గీతల్లో పూలు: నిలువు లేదా అడ్డ గీతల్లో పూలు ఒదిగిపోయినట్లుండే డిజైన్లు ఇప్పుడు క్రాప్‌టాప్స్, పొడవు గౌన్లపై కనిపిస్తున్నాయి. లేదా కోల్డ్ షోల్డర్‌తో రఫెల్స్ ఉండే గౌన్లూ బాగుంటాయి. అలాగే ఈ రెండు డిజైన్లలో స్లీవ్‌లెస్ కూడా ప్రయత్నించొచ్చు. ముదురు లేదా లేత వర్ణాల గీతల్లో పూల ప్రింట్లు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. టీషర్ట్లూ, క్రాప్‌టాప్‌నకు ఇరువైపులా గీతలూ, ముందు, వెనుకా పెద్ద పూల డిజైన్ల కలయిక కూడా ట్రెండే. ఈ డిజైన్‌ని జీన్స్‌కు జతగా వేసుకున్నా బాగుంటుంది. లెగ్గింగ్‌లు ఎంచుకుంటుంటే మాత్రం టాప్ మోకాళ్ల వరకూ ఉండేలా చూసుకోవాలి. కాటన్, సిల్క్ వస్త్రాల్లో ఈ డిజైన్‌ను ప్రయత్నించొచ్చు.

పూలు, తీగలు: ఈ రెండింటి మేళవింపు అదిరిపోతుంది. సల్వార్‌సూట్లూ, లెహెంగాలూ, కుర్తీలకు ఈ డిజైను అద్భుతంగా అమరుతుంది. పూర్తిగా లేత లేదా ముదురు వర్ణంలో పార్టీవేర్‌కు నప్పేలా వస్తున్న ఈ డిజైన్లు తెలికైన వస్త్రంపై ఉండేలా చూసుకోవాలి. ఈ డిజైన్‌ని ప్రయత్నిస్తున్నప్పుడు దుస్తులు ఏవయినా సరే.. శరీరానికి అతుక్కున్నట్లుగా ఉండాలి. చేతులు పొడుగ్గా లేదా మోచేతుల వరకూ వచ్చేలా చూసుకోవాలి. ఈ మేళవింపులో వచ్చే పొడవు గౌన్లు పార్టీలకు బాగుంటాయి. అదనంగా నగలు వేసుకోవాల్సిన అవసరంలేని డిజైను మేళవింపు ఇది.





- ఈ డిజైన్ల మేళవింపులో లెహెంగాలు కూడా ప్రయత్నించొచ్చు.
- జీన్స్, లేతవర్ణం టీషర్టుపై గీతలూ, పూల మేళవింపుతో బ్లేజర్ లేదా జాకెట్టు పార్టీవేర్‌కు సరిగ్గా నప్పుతుంది.
- ఈ మేళవింపులో సాయంత్రపు పార్టీలకు చీరల్ని కూడా ఎంచుకోవచ్చు. కుదిరితే నలుపూ, తెలుపూ, ఎరుపు వంటి వర్ణాల్లో గీతలూ, చారలూ, జామెట్రికల్ వంటి మూడు డిజైన్ల మేళవింపూ రిచ్‌గా కనిపిస్తుంది. ఈ రంగుల్లో సిగరెట్ ప్యాంటు, గీతల బనీనుపై పెప్లమ్ టాప్ ఆధునికతను తెచ్చిపెడుతుంది. అలాగే లాంగ్‌టాప్‌లో కూడా ఈ రంగుల కాంబినేషన్ బావుంటుంది.

బొమ్మలతో కథలు చెప్పేస్తా...

అంతరించిపోయిన బొమ్మలాటని వెలికి తీసి ఇప్పుడు ఆ కళకి కేరాఫ్ అడ్రస్ అయ్యారు పద్మిని. ఆమె పరిశోధనల ప్రతిఫలంగా టాటా ఫెలోషిప్‌నీ అందుకున్నారు. తాజాగా బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ బొమ్మలాట ప్రదర్శనలో తన శిష్యబృందంతో కలిసి ఓ అద్భుతమైన ప్రదర్శన కూడా ఇచ్చారు.

మా నాన్న రైల్వే ఉద్యోగి. అందుకే మేం తమిళులమే అయినా.. కర్ణాటకలో స్థిరపడ్డాం. పెళ్లైన తర్వాత తెలుగింటి ఆడపడుచునయ్యా. మా నాన్న అద్భుతమైన స్టోరీటెల్లర్. మాకు బోలెడు పిట్టకథలు చెప్పేవారు. ఆయన చిన్నప్పుడు నాకు చెప్పిన కథలనే... నేను మా బాబుకి చెప్పేదాన్ని. పిల్లాడికి బొమ్మలాట ద్వారా ఎందుకు కథలు చెప్పకూడదు అన్నారు నాన్న. వస్త్రంతో చిన్నచిన్న బొమ్మలు కుట్టి వాటిని చేతికి తొడుక్కుని చెప్పేదాన్ని. సాయంత్రం అయితే అపార్ట్‌మెంట్‌లోని పిల్లలంతా మా ఇంటికి వచ్చేసేవారు. మావాడి స్కూలు టీచర్లు కూడా తరగతులు తీసుకొమ్మనేవారు. మరోవైపు రామకృష్ణమఠంలో ఇంగ్లిష్ తరగతులు చెప్పేదాన్ని. అప్పుడు కూడా బ్యాగులో నాలుగు బొమ్మలు వేసుకుని వెళ్లేదాన్ని.

అలా నా పరిశోధన... బొమ్మలాట అనగానే చాలామంది తోలుబొమ్మలాట అనుకుంటారు. కానీ ఇందులో రకాలు ఉంటాయి. ఈ కళ భారత్‌లో పుట్టినా ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల్లో థియేటర్ ఆర్ట్‌గా అభివృద్ధి చెందింది. వీధుల్లో పెద్ద పెద్ద బొమ్మలతో ప్రదర్శనలు ఇస్తారక్కడ. నేనిక్కడ చెబుతున్నది చెక్కతో చేసే బొమ్మల గురించి. ఇవి చాలా బరువుగా ఉంటాయి. పైగా పెద్దవి. వాటిని తెచ్చుకుని కొంతమంది ఈ బొమ్మలాట ఆడేవారు. ఇలా ఈ కళ గురించి కొత్త విషయాలు తెలుస్తున్న కొద్దీ నాలోనూ ఆసక్తి పెరిగింది. అనుకోకుండా కొన్ని ప్రదర్శనలూ చూశాను. అలా పరిశోధన చేయాలని అనిపించింది. 2012 నా పరిశోధన మొదలయ్యింది. జనగాం దగ్గర నా పరిశోధనకు ఒక ఊతం దొరికింది. మోతే అనే ఇంటిపేరుతో ఉన్న కుటుంబీకులు ఈ ఆటని ఆడుతున్నారని తెలిసింది. వాళ్లలో ఓ కుటుంబం వరంగల్ దగ్గర బూరుగుపేటలో, మరొకటి జనగాం దగ్గర అమ్మాపురంలో స్థిరపడింది. వాళ్లలో మోతే జగన్నాథం ఒకరు. కాస్తో కూస్తో ఈ కళకి ఆయనే ఊపిరి పోశారు. మొదట్లో చాలా కథలని వీళ్లు ప్రదర్శించేవారు. క్రమంగా కుదించారు. కొత్తతరాలు ఈ వృత్తిలోకి రావడం మానేశాయి. ఈ విషయాలని ఇంగ్లిష్, తెలుగులో ఓ పుస్తక రూపంలోకి మార్చే ప్రయత్నంలో ఉన్నాను.



కళ, భాష... నిజమే, కళతోపాటు భాష కూడా అంతరించిపోతుందని గుర్తించాలి. అమ్మాపురంలో స్థిరపడిన బొమ్మలాట వాళ్లు, రాముని వియోగాన్ని కథగా ప్రదర్శిస్తారు. అది లిఖిత పూర్వకంగా ఎక్కడా లేదు. అందులో ఎన్నో మనకు తెలియని తెలుగు పదాలు ఉన్నాయి. కానీ ఇప్పుడు ఆ బృందంలో వాళ్లంతా 70 ఏళ్లు దాటిన వాళ్లే. బరువైన బొమ్మలని వాళ్లు ఆడించలేరు. అంటే ఆ భాష కూడా కుదించుకుపోతుందనేగా దాని అర్థం. ఒకప్పుడు ఆ బృందం ప్రదర్శించిన 16 కథల్లో ఇప్పుడు నాలుగు కథలు మాత్రమే ఉన్నాయి. లవకుశ, చెంచులక్ష్మి, జయంత్‌జయపాల, బాలనాగమ్మ, సారంగధర మాత్రమే చేస్తున్నారు. అది కూడా ఎన్నాళ్లో తెలియదు. 300 సంవత్సరాల నాటి చెక్కలు వాళ్ల దగ్గర ఉన్నాయి.

కొత్తతరం తయారయ్యింది... ఇవన్నీ తెలిశాక ఆసక్తి ఉన్నవారికి ఆ కళ నేర్పించాలని అనుకున్నా. ఇందుకోసం స్ఫూర్తిధిమేటర్ ఆర్ట్స్ పేరుతో ఒక సంస్థని ప్రారంభించాను. సాధారణంగా పిల్లలకు చరిత్రలో యుద్ధాలు గురించి చదవడం అంటే మహాబోర్. అదే బొమ్మలతో తెరపై కథగా చూపిస్తే ఆసక్తిగా నేర్చుకుంటారు. లామఖాన్, అవర్ సెక్రెడ్ స్పేస్ వంటి చోట్ల ప్రదర్శించేదాన్ని. అలా ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ పిల్లలకు చెప్పా. ఆ విద్యార్థులూ నేర్చుకోవడానికి సిద్ధమయ్యారు. పేపర్ మెషే ఆర్ట్‌తో బొమ్మలని తయారుచేసి వాటితో ఈ కళని ప్రదర్శిస్తున్నాం. పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం పిల్లలూ నాతోపాటూ మా ప్రదర్శనల్లో పాల్గొంటారు. అన్నట్టు మా బృందంలో అదిలాబాద్‌కు చెందిన నలుగురు గోండు పిలలూ ఉన్నారు. చాలామంది 'నీకంత కష్టం ఎందుకు' అని అంటారు. కానీ నాకూ, బొమ్మలాటకీ ఏదో తెలియని బంధం ఉంది. నా శ్రమకు గుర్తింపుగా టాటా ఫెలోషిప్ ఫోక్‌లోర్, ఖుషీ టీవీ అవార్డుతో పాటు అమరావతి అవార్డుని అందుకున్నా. ఈ మధ్యే బెంగళూరులో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి వచ్చిన కళాకారులు వర్క్‌షాపులు నిర్వహించారు. అందులో మేమూ ఉన్నాం. మాకు మంచి ప్రశంసలు వచ్చాయి.



తోచట్లేదా...

కాస్త తీరిక దొరికితే టీవీ ముందు కూర్చుంటున్నారా.. ఈసారి పుస్తకం చదివేందుకు ప్రయత్నించండి.

- మెదడుకు పని చెప్పాలంటే పుస్తకాలు చదవాల్సిందే. టీవీ చూడటంతో పోలిస్తే చదవడం వల్లే మెదడుపై ఎక్కువ ప్రభావం పడుతుందట.
- ఏకాగ్రత పెరుగుతుంది. పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకుంటే మరీ మంచిది.
- మీకు నచ్చిన అంశానికి సంబంధించిన పుస్తకాలను చదవడం వల్ల వాటిపై అవగాహన వస్తుంది. ముఖ్యంగా ప్రముఖుల కథలూ, పలు ప్రాంతాల గురించి తెలిపే పుస్తకాలను చదవాలి. అలాగే దినపత్రికలను కూడా.
- మీకు తెలిసిన విషయాలను రాసుకోవడం వల్ల అది మీకు ఎప్పుడో ఒకప్పుడు ఉపయోగపడుతుంది.

తెలియకుండానే పని మార్చేశారు!

డియర్ వసుంధర



డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

? నేనో బహుళజాతి సంస్థలో పనిచేశాను. రెండేళ్ల కిందట ఆ సంస్థను వదిలేసి... స్థానికంగా ఉండే మరో సంస్థలో చేరా. ముందు పని చేసిన సంస్థలో పని విధానం చాలా పక్కాగా ఉండేది. హెచ్‌ఆర్ అన్ని వివరించేవారు. ఏడాదికోసారి సమీక్ష ఉండేది. ఇక్కడా అలానే ఉంటుందని అనుకున్నా. కానీ నేను ఊహించినట్టుగా లేదు. మొదట్లో నాకు పంపిన ఈమెయిల్ తప్పించి మరే సమాచారం లేదు. సంవత్సరం కిందట నా బాధ్యతలు నాకు చెప్పకుండానే మార్చేశారు. దాంతో వాళ్లు నా నుంచి ఏం కోరుకుంటున్నారు అనేది కూడా నాకు తెలియడం లేదు. అలా తెలిసినప్పుడే కదా నాకు కూడా పనిలో ఒక స్పష్టత, అభివృద్ధి ఉంటుంది. మా బాస్‌ని విషయం అడిగితే 'పని ఒత్తిడిలో ఉన్నా' అంటూ సమాధానం దాట వేస్తున్నారు. నా పని గురించి స్పష్టంగా చెబితే బాగుంటుంది కదా?

- ఓ సోదరి

✔ అన్నీ బాగుండి... కేవలం విధివిధానాలు బాగోలేదని, సరైన సమాచారం లేదు అన్న కారణంతో ఉద్యోగం మానేయలేరు కదా! ఇది మీ ఒక్కరి సమస్యే కాదు. చాలామంది ఉద్యోగులు ఇలాంటి వాతావరణంలోనే పని చేస్తున్నారు. మీరు గతంలో బహుళజాతి సంస్థలో ఉన్నారు కాబట్టి, అక్కడి పని వాతావరణంతో పోల్చుకుని ఇలా ఆలోచిస్తున్నారు కానీ.. చాలా చిన్న సంస్థలు ఈ విషయంలో అంత స్పష్టంగా ఉండవు. అయితే అలా ఉండటం వల్ల ఎటువంటి లాభాలు ఉంటాయో చూద్దాం. మీ పనిలో మరొకరు జోక్యం చేసుకోవడానికి ఆస్కారం ఉండదు. అలాగే మీకు కూడా అనేక రకాల బాధ్యతలు చుట్టు ముట్టకుండా ఉంటాయి. కానీ చిన్న సంస్థల్లో లక్ష్యాలు, పని విధానం కూడా వేరుగా ఉంటుంది. మీరు ఇప్పటికే మీ బాస్‌తో మాట్లాడనంటున్నారు. అంటే ఆమె ఈ విషయానికి మరీ అంత ఎక్కువగా ప్రాముఖ్యం ఇస్తున్నట్లు కనిపించడం లేదు. మీ సమస్యకు పరిష్కారం కావాలంటే సమయం తీసుకుని మాట్లాడండి. అలా కాకపోతే తాత్కాలిక లక్ష్యాలతో ముందుకు వెళ్లండి. ఇచ్చిన పనిని సమర్థంగా పూర్తి చేయడానికి ప్రయత్నించండి. మీ పని తీరు గురించి కూడా మీ బాస్‌ని అడగండి. అక్కడ వాతావరణం బాగున్నంత వరకు జాబ్ డిస్క్రిప్షన్ అనే దాని గురించి ఎక్కువ ఆలోచించకండి.

బంగారం-వెండి

5న ముగింపు-క్రితం


హైదరాబాద్	ముగింపు	క్రితం
బంగారం(24క్యా)	31,380	31,350
ఆర్నమెంట్	29,310	29,280
వెండి (కిలో)	39,900	39,650
విజయవాడ		
బంగారం (24క్యా)	30,100	--------
ఆర్నమెంట్	28,800	--------
వెండి (కిలో)	40,000	--------
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	30,088	30,080
ఆర్నమెంట్	28,858	28,610
వెండి (కిలో)	39,600	39,900
రాజమండ్రి		
బంగారం (24క్యా)	30,960	31,050
ఆర్నమెంట్	28,960	29,050
వెండి (కిలో)	39,100	39,000
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	31,080	31,240
ఆర్నమెంట్	28,900	29,050
వెండి (కిలో)	40,900	41,500
తమిళనాడు		
ఆర్నమెంట్ (గ్రా)	2,896	2,905
వెండి (గ్రా)	41.70	41.70

(రూ. లలో)

నజరానా

లెదర్ బ్యాగులు మురికిగా మారాయా... హ్యాండ్‌వాష్‌లో ముంచిన దూది ఉండతో బ్యాగును తుడిచి చూడండి.

తొక్కలని తీసిపారేస్తే ఎలా!



ఇంట్లో రకరకాల కూరగాయలూ, పండ్లని తొక్కలు తీసి ఉపయోగించుకుంటాం. అయితే వాటిని పడేయకుండా ఇలా ఉపయోగించుకుంటే బాగుంటుంది.

బంగాళాదుంపలు: వీటి తొక్కల్లో విటమిన్ సి అధికం. వీటిని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి తీసి కళ్ల మీద ఉంచుకొని, పావుగంటయ్యాక తీసేసి కళ్లను శుభ్రం చేసుకుంటే మంచిది.

అరటి: ఈ పండు తొక్కలతో దంతాలను శుభ్రం చేసుకుంటే, తెల్లగా మారతాయి. వీటి ద్వారా దంతాలకు మెగ్నీషియం, మాంగనీసు, పొటాషియం అంది దృఢంగా ఉంటాయి.

కమలాఫలం: ఈ తొక్కల్ని గుమ్మాల వద్దా, వంటింట్లో, గదుల్లో ఉంచితే దుర్వాసన దూరమవుతుంది. ఈ తొక్కల్ని నీళ్లలో వేసి మరిగించి గది మధ్యలో ఉంచితే... పరిమళం వెదజల్లినట్టు మంచి వాసన వస్తుంది.

ఉల్లిపాయ: ఈ పొట్టును పారేయకుండా చెట్ల మొదళ్లలో వేస్తే.. మొక్కలకు సల్ఫర్ అందుతుంది. ఏపుగా ఎదుగుతాయి. పూలు కూడా బాగా పూస్తాయి.

అభ్యర్థి అత్యంత నైపుణ్యాలు కలిగి ఉన్నప్పటికీ సానుకూలత, సహానుభూతి, సహనం, విశ్వసనీయత, విశాల దృక్పథం లేకపోతే ఏ సంస్థా ఉద్యోగం ఇవ్వడానికి సిద్ధపడదు. అందుకే ఆ లక్షణాలు లేని వారిని నిరోధించడానికి అనేక రకాల పరీక్షలు పెడుతుంది. అందులో హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ఒకటి. అందరికీ దాదాపు ఒకే విధమైన ప్రశ్నలు ఉన్నప్పటికీ అభ్యర్థుల స్పందనలను అనుసరించి వారి వారి వైఖరులను పసిగట్టి వడగడతారు. ఈ కేస్ స్టడీలో సక్సెస్‌ఫుల్ అభ్యర్థి నమూనా సమాధానాలను తెలుసుకుందాం.



నైపుణ్యాలే కాదు.. అంతకు మించి!

హెచ్‌ఆర్: మీ గురించి చెప్పి, మా సంస్థలో ఎందుకు చేరాలనుకుంటున్నారో వివరించండి.

మొదటి అభ్యర్థి: నా పేరు రవి. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ నేషనల్ కళాశాల నుంచి 2017లో పాసయ్యాను. పదో తరగతి శివ స్కూల్ నుంచి 82%తో, ఇంటర్ రామా కళాశాల నుంచి 78%తో పాసయ్యాను. నాన్న పేరు సుబ్బారావు, ప్రభుత్వ ఉద్యోగి. అమ్మ పేరు సీత, గృహిణి. అన్నయ్య ఎంబీఏ చేసి ఒక ప్రైవేటు సంస్థలో రూ. 15,000 జీతంతో పనిచేస్తున్నాడు. అక్కయ్యకు పెళ్లి అయింది. తను గృహిణి. ఈమధ్యనే బాబు పుట్టాడు. ఆ బాబంటే నాకు చాలా ఇష్టం. నాకు జావా ప్రోగ్రామింగ్ మీద గట్టి పట్టు ఉంది. గొప్ప ఐటీ ఇంజినీర్ కావాలని కోరిక.



వెంకట్ కాంచనపల్లి
సీఈఓ, సన్‌టెక్ కార్ప్

విశ్లేషణ: అభ్యర్థి తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరచుకోలేదు. రెజ్యూమేలో ఉన్న వివరాలూ, అప్రస్తుతమైనవీ చెప్పటం అనవసరం. తన ప్రొఫైల్ ఏంటో, ఎందుకు దరఖాస్తు చేస్తున్నాడో వివరించలేకపోయాడు.



రెండో అభ్యర్థి: నా పేరు విశాల్. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కేకేఐటీ కళాశాల నుంచి 2017లో పాసయ్యాను. స్నేహితులతో కలిసి చిన్న చిన్న గేమింగ్ అప్లికేషన్స్ రూపొందించాను. ఒక ప్రముఖ సంస్థలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికై, ఒక ప్రత్యేక గేమింగ్ అప్లికేషన్ బేసిక్ వెర్షన్ రూపొందించాను. చదువు పూర్తయ్యాక అడ్వాన్స్‌డ్ వెర్షన్‌కు అవసరమైన అదనపు కోర్సులు చేశాను. గత నెల రోజులుగా ఇలాంటి అప్లికేషన్లను రూపొందిస్తున్న ప్రాజెక్టులు ఉన్న సంస్థలకు దరఖాస్తు చేస్తోంటే మీ సంస్థ నుంచి ఇంటర్వ్యూ కాల్ వచ్చింది.

విశ్లేషణ: ఇతడు ఈ ఇంటర్వ్యూకు ప్రాస్పెక్టివ్ అభ్యర్థి. ప్రొఫైల్ ఈ సంస్థలో ఉన్న స్థానానికి దగ్గరగా ఉంది. ఇలాంటి అవకాశం కోసం మాత్రమే వెతకడం అతడి సన్నద్ధత ప్రయాణాన్ని తెలియజేస్తోంది.

హెచ్‌ఆర్: మీ స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు ఏమిటి?

రవి: రూ. 25000తో ఒక మంచి సంస్థలో చేరి మా అమ్మానాన్నలను సంతోషపెట్టడం నా షార్ట్‌టర్మ్ ఆబ్జెక్టివ్. ఇక ఆ ఉద్యోగంలో ఒక 5-10 సంవత్సరాల్లో మేనేజర్ అయ్యి పెద్ద స్థాయికి చేరడం నా లాంగ్‌టర్మ్ ఆబ్జెక్టివ్.

విశ్లేషణ: భావోద్వేగాలతో డబ్బు, హోదా కోసం చూసే దృష్టి ఇతడిది. తన ప్రొఫైల్‌కు తగ్గట్టు పనిచేస్తే స్థాయి పెరిగి, దాని వల్ల అతడు ఆశించినవి నెరవేరతాయనే పరిణతి లేదు.

విశాల్: నాకు గేమింగ్ అప్లికేషన్స్ మీద పట్టు రావాలంటే మొదట ఆ ప్లాట్‌ఫాంను కల్పించే మీలాంటి ఒక సంస్థలో ఉద్యోగం సాధించి, ఒక మూడేళ్లు అన్ని స్థాయుల అప్లికేషన్స్ బిల్డ్ చేసి అనుభవం గడించడం నా షార్ట్‌టర్మ్ ఆబ్జెక్టివ్. ఇక నా ఆలోచనలతో గేమింగ్‌లో వినూత్న ప్రయోగాలను ఆ తరువాత పదేళ్లు చేపట్టి, సంస్థకు ఆర్థికంగా సహకరించడం, వాటిని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం నా లాంగ్‌టర్మ్ ఆబ్జెక్టివ్.

విశ్లేషణ: నాలుగు వాక్యాల్లో తన కెరియర్ ప్రయాణాన్నీ, ప్రస్తుత స్థితినీ, భవిష్యత్ ప్రణాళికనూ వ్యక్తపరిచాడు. అతడికి ఈ సంస్థ మంచి ప్లాట్‌ఫాం అయితే, సంస్థకు మంచి అసెట్ అయ్యే అవకాశం ఉంది.

స్వభావ లక్షణాలు

హెచ్‌ఆర్ ఇంటర్వ్యూయర్‌కు వారిద్దరి ప్రొఫైల్ కెరియర్ జర్నీ, ప్రస్తుత స్థాయి, భవిష్యత్తు గురించి ఒక అవగాహన వచ్చింది. ఇంటర్వ్యూలో ముఖ్యమైన స్వభావ లక్షణాలను అర్థం చేసుకోవడానికి ఇక తరువాతి ప్రశ్నలకు సంసిద్ధమయ్యారు.

హెచ్‌ఆర్: మీరు ఇంటర్వ్యూకు చాలా దూరం ప్రయాణం చేసి వచ్చినట్టున్నారు. ఇక్కడ వెయిటింగ్ కూడా చాలా ఉన్నట్టుంది. ఏమైనా ఇబ్బంది అనిపించిందా?

రవి: అవును. మా ఇల్లు మీ ఆఫీస్‌కు 30 కి.మీ.ల దూరంలో ఉంది. అక్కడి నుంచి రావడానికి పొద్దున్నే 7 గంటలకు బయల్దేరి, బస్సుల్లో నానా తిప్పలు పడితే 9 గంటలకు చేరుకున్నాను. ఇక్కడ సెక్యూరిటీ అంతా చెక్ చేసి లోపలికి పంపించారు. చాలాసేపు వెయిటింగ్ హాల్లో ఎదురుచూసిన తరువాత నన్ను ఇంటర్వ్యూకు పిలిచారు.

విశాల్: మా ఇల్లు దూరమే. కానీ నా కెరియర్‌కు ప్లాట్‌ఫామ్‌ను ఏర్పరచగలిగే సంస్థ కోసం నేను విదేశాలకైనా వెళ్తాను. ఎందుకంటే సంస్థకు దరఖాస్తు చేసేవారు చాలామంది ఉంటారు. ఇంటర్వ్యూకి సమయం పడుతుంది. నేను దాన్ని ఇబ్బందిగా భావించను.

హెచ్‌ఆర్: మీరు అంతసేపు వెయిటింగ్ హాల్‌లో ఉన్నారు కదా! మరి ఏం గమనించారు?

రవి: అందరినీ పిలుస్తున్నారు. నన్నెపుడు పిలుస్తారా అనే ఉత్సాహంలో పెద్దగా ఏం గమనించలేదు.

విశాల్: నాకు ఆఫీస్ చాలా నచ్చింది. ఇంటర్వ్యూకు వచ్చినవారిని నేహ అనే హెచ్‌ఆర్ పర్సన్ ఒక వరుసలో కూర్చోబెట్టారు. ఇంకో హెచ్‌ఆర్ సందీప్ అందరికీ సూచనలు ఇచ్చారు. ఇంటర్వ్యూకు వెయిటింగ్ ఉంటుంది కాబట్టి, మాకు మంచినీళ్లు, టీ, కాఫీ, కూల్ డ్రింక్స్, స్నాక్స్ ఒక పక్క కౌంటర్‌లో ఏర్పాటు చేశారు. ఒక క్రమంలో 10 ప్యానెళ్లలోకి పంపిస్తున్నారు. సందేహాలు ఉంటే తీరుస్తున్నారు. అంతా వ్యవస్థీకృతంగా అనిపించింది.

విశ్లేషణ: రెండు ప్రశ్నలకూ రవి భావోద్వేగపరంగా స్పందించాడు. ఇబ్బందిని వ్యక్తపరిచాడు. అతడికి ఓపిక లేదని తెలుస్తోంది. ఉద్యోగంపై శ్రద్ధ లేకపోవడమో, ఇంకేదో కారణాలు కావచ్చు. ఇవన్నీ ప్రతికూల విషయాలే. విశాల్ విషయానికి వస్తే అతడికి తనకు కావాల్సిన దానిమీద అవగాహన ఉంది. ప్రశాంతతతో ఉండటం వల్ల అన్నీ శ్రద్ధగా గమనించగలిగాడు. స్పష్టత ఉంది. రేపు ఈ సంస్థలో చేరితే ఏ ప్రాంతానికైనా వెళ్లగలడు, ఉన్నతంగా పని చేయగలడు.

టీం వర్క్

హెచ్‌ఆర్: మీరు మీ టీం కలిసి ఒక ప్రాజెక్ట్ చేస్తున్నారు. మీ నాన్న ఆరోగ్యం బాగోలేకపోవడం వల్ల మీరు చేయాల్సిన పనిని సమయానికి చేయలేకపోతారు. మీతో ఎప్పుడూ పోటీపడే మీ టీం సభ్యుడు దాన్ని అవకాశంగా తీసుకుని మీరు పని చేయలేదని మేనేజర్‌కు చెప్పడం వల్ల మీరో ఇంక్రిమెంట్ కోల్పోతారు. తరువాత అదే పరిస్థితి ఆ సభ్యుడికి వచ్చి వాళ్ల తాతయ్యకు బాగాలేక సమయానికి పనిని అప్పజెప్పనపుడు మీరు అతనికి ఎలా బుద్ధి చెబుతారు?

రవి: నేను ఎప్పుడూ గొప్ప పెర్ఫార్మర్‌గా ఉండాలని కోరుకుంటాను. నా బృంద సభ్యుడు నన్ను దెబ్బ తీసినందుకు నాకు అవకాశం వస్తే పూర్తిగా సద్వినియోగపరచుకుంటాను. అతడికి ఇంక్రిమెంట్ పోయేలా చేసి బుద్ధి చెబుతాను.

విశాల్: నా ఉద్దేశంలో అతడు నన్ను దెబ్బతీయడం మూర్ఖత్వం. వ్యక్తి శక్తి కంటే బృంద శక్తి ఎంతో ఎక్కువ. అందుకే అందరూ కలిసి చేయాలి. ఎవరైనా ఇలాంటి అవగాహన లేక మూర్ఖత్వంగా ప్రవర్తిస్తే వారికి అవగాహన కల్పిస్తాను. కష్టసమయంలో తోడుగా ఉంటాను. కుదిరితే వారి పని కూడా నేనే చేస్తాను. దానివల్ల సానుకూల వాతావరణం ఏర్పడుతుంది.

విశ్లేషణ: రవి ఆంబిషన్, స్వార్థచింతన కలిగిన వ్యక్తి. సమైక్య భావాలు లేవు. బృందంలో పని చేయడానికి పనికిరాడు. విశాల్‌కు మెచ్యూరిటీ స్థాయి ఎక్కువ. అందుకే విషయాన్ని విశాల పరిధిలో చూడగలిగాడు, దానికి సరైన పరిష్కారాన్ని చెప్పగలిగాడు. అతడు టీంను నడిపించగలడు. భవిష్యత్తులో మేనేజర్ అవగలడు.

విశ్వసనీయత

హెచ్‌ఆర్: మీతోపాటు ఇంకో సభ్యుడు, మేనేజర్లకు ఒక అరుదైన టెక్నాలజీలో ప్రావీణ్యం ఉంది. మీరు మీ బృంద సభ్యుడు, మేనేజర్‌తో కలిసి ఒక ప్రాజెక్టును దక్కించుకోవడానికి టెక్నికల్ ప్రెజెంటేషన్ ఇవ్వడానికి క్లయింట్ దగ్గరికి వెళతారు. అక్కడ మీలాగే వేరే సంస్థల వాళ్లూ వచ్చారు. అందరికీ మీ ప్రెజెంటేషన్ నచ్చింది. క్లయింట్ మీ ప్రతిభను గుర్తించారు. ఆ ప్రాజెక్టును మీ సంస్థకు ఇవ్వాలని నిర్ణయానికి వస్తారు. వారం రోజుల్లో నిర్ణయ ప్రకటన ఉంటుంది. ఈలోపు మీ పోటీ సంస్థ ప్రతినిధి మీ ముగ్గురినీ వారి సంస్థలో చేరమని ఆఫర్ ఇచ్చారు. ప్రస్తుత జీతభత్యాలకన్నా కొన్ని రెట్లు ఎక్కువగా ఇస్తామనీ, ఆ ప్రాజెక్ట్ వారికే వస్తుందన్నారు. మీ మేనేజర్, ఇంకో సభ్యుడూ చేరాలనే దృఢ నిర్ణయం తీసుకుని, మిమ్మల్ని ఒత్తిడి చేస్తారు. మీ ప్రస్తుత సంస్థకు ఆ ప్రాజెక్ట్ రాకపోతే రూ.50 కోట్ల ఆదాయం పోతుంది. ఆ పరిస్థితిలో మీరు ఏం చేస్తారు?

రవి: ఇది క్లిష్టమైన పరిస్థితి. వారితోపాటు చేరితే నా ఆదాయం పెరుగుతుంది. నా కెరియర్‌లో అదో పెద్ద జంప్. నా ప్రస్తుత పరిస్థితి నుంచి నేననుకున్న హోదాకి వెళ్లగలను. కానీ నమ్ముకున్న సంస్థకు నష్టం వస్తుంది. ఒకవేళ నేనొక్కడినే చేరకపోయినా మిగతా ఇద్దరి నిర్ణయం వల్ల ప్రాజెక్ట్ రాకపోవచ్చు. అప్పుడు నేనొక్కడినే మిగిలిపోతాను. దానివల్ల సంస్థతో పాటు నేనూ నష్టపోతాను. అలాంటప్పుడు విలువలకు పోకుండా ఆ ఆఫర్‌ను తీసుకోవడం మేలని భావిస్తాను.

విశాల్: ఇది సమస్యాత్మక విషయం. కానీ నేను ఆ సమస్యకు కారణాలు వెతుకుతాను. మా ప్రావీణ్యం వల్ల సంస్థకు పెద్ద ఆదాయాన్ని ఇచ్చే ప్రాజెక్ట్ ఇది. కానీ పోటీ వల్ల వేరొక సంస్థ దాన్ని దక్కించుకోడానికి ఎత్తుగడ వేసింది. స్వార్థ చింతనతో సహోద్యోగులతో చేతులు కలిపి సంస్థకు నమ్మకద్రోహం చేసి, నా మనసును కలుషితం చేసుకోలేను. ఆ ముద్ర నన్ను జీవితాంతం వెంటాడుతుంది. ఒక్కసారి విలువలు లేవు అనే ముద్రపడితే మార్కెట్‌లో ఇక నా ప్రొఫైల్‌కి విశ్వసనీయత ఏముంటుంది?

అందుకే పరిష్కారం వెతుకుతాను. మొదట నా హైరార్కీకి జరిగిన విషయాన్ని వివరిస్తాను. నా సహోద్యోగులతో కూడా మాట్లాడుతాను. వారు ఆ సంస్థకే కట్టుబడి ఉండాలంటే ఎక్కువగా ఏం ఆశిస్తారో తెలుసుకుంటాను. ఆ విషయాలను సంస్థకు తెలియజేస్తాను. సంస్థ ప్రాజెక్ట్‌ను కోల్పోవడం కన్నా వారి ఆశలను నెరవేర్చమని అడిగితే మధ్యవర్తిత్వం చేస్తాను. నా సహోద్యోగులు తమ నిర్ణయాన్ని విరమించుకోవడానికి నా వంతు ప్రయత్నం చేస్తాను.

విశ్లేషణ: రవిది యథాలాపంగా ఆలోచించే స్వభావం. బాధ్యతాయుతమైన, విలువలు కలిగిన మనస్తత్వం కాదు. దానివల్ల తను నష్టపోవడమే కాకుండా సంస్థను కూడా నష్టపరుస్తాడు. అదే విశాల్ మొదట బాధ్యత, తరువాత విలువలు, ఆఖరిగా వివేకమున్న అభ్యర్థి. అతను తన సామర్థ్యంతో సంస్థను ఎత్తుకు తీసుకువెళ్లడమే కాకుండా తను కూడా ఎదిగి లీడ్ చేయగలడు. కష్ట సమయాల్లో అండగా నిలబడి సంస్థ అభివృద్ధికి తోడ్పడగలడు.

ఏ వైఖరి అనుకూలం?

హెచ్‌ఆర్ కోణంలో ఇద్దరి ఇంటర్వ్యూల సారాంశం ఇలా ఉంటుంది.

రవి అన్ని రౌండ్లూ క్లియర్ చేసి హెచ్‌ఆర్ రౌండ్ వరకు వచ్చాడంటే అతను నైపుణ్యాల పరంగా బాగానే ఉన్నట్టు. కానీ అతని వైఖరి సంస్థకు అనుకూలమైంది కాదు. అతడు స్కిల్స్‌ను మాత్రమే పెంచుకున్నాడు. ఒక సంస్థలో పని చేయాలంటే కావాల్సిన విషయాలు అతని వద్ద సమృద్ధిగా లేవు.

విశాల్‌కు నైపుణ్యాలతోపాటు ఒక సంస్థలో పనిచేయడానికి కావాల్సిన అన్ని అర్హతలూ ఉన్నాయి.

సంభాషించేటప్పుడు దృష్టి సమన్వయం, శరీర భాష విషయంలో కూడా మెరుగ్గా ఉన్నాడు. ఓర్పు, దేన్నయినా స్వీకరించగల తత్వం, విశాల దృక్పథం, విశ్వసనీయత, నిబద్ధత.. వీటన్నిటిలోనూ పైమెట్టులోనే ఉన్నాడు.

అందుకే హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ అధికారి రవి అభ్యర్థిత్వాన్ని తిరస్కరించి, విశాల్‌ను ఎంపిక చేశారు.

నోటీస్ బోర్డు

ప్రవేశాలు

ఎన్‌ఐటీ, రవుర్కెలా

కోర్సు: ఎంబీఏ
కాలవ్యవధి: 2 సంవత్సరాలు
సీట్ల సంఖ్య: 60
అర్హత: బీఈ/ బీటెక్/ బీఆర్క్/ బీఎస్సీ ఇంజినీరింగ్/ ఎంఎస్సీ/ ఎంఏ ఎకనామిక్స్.
ఎంపిక: అకడమిక్ ప్రతిభ, జాతీయస్థాయి ప్రవేశపరీక్ష స్కోరు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు: ఆన్‌లైన్
దరఖాస్తు ఫీజు: రూ. 500
చివరితేది: 15.03.2018
https://nitrkl.ac.in/

ఫెలోషిప్స్

డీఆర్‌డీఈ, గ్వాలియర్

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)కి చెందిన ఈ సంస్థ మధ్యప్రదేశ్‌లో ఉంది.
ఫెలోషిప్: డీఆర్‌డీఓ జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) **ఖాళీలు:** 07 **స్టైపెండ్:** నెలకు రూ. 25,000తోపాటు హెచ్‌ఆర్ఏ. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ప్రథమ శ్రేణిలో ఎంఎస్సీ ఉత్తీర్ణతతోపాటు నెట్. **వయసు:** 28 సంవత్సరాలకు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ **చివరితేది:** 04.03.2018
చిరునామా: ది డైరెక్టర్, డీఆర్‌డీఈ, ఝాన్సీ రోడ్, గ్వాలియర్.

ప్రభుత్వ ఉద్యోగాలు

నేషనల్ లా యూనివర్సిటీ, జోధ్‌పూర్

పోస్టులు: అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, టీచింగ్ అసిస్టెంట్
విభాగాలు: లా ఆఫ్ ఎవిడెన్స్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ స్టాట్యూట్స్, లేబర్ లా, హ్యూమానిటేరియన్ లా, ఇంటర్నేషనల్ లా, ఐపీఆర్, కాన్‌స్టిట్యూషనల్ లా.
అర్హత, వయసు, ఎంపిక, ఖాళీలు: వర్సిటీ నిబంధనల ప్రకారం.
దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
చివరితేది: 15.02.2018
వెబ్‌సైట్: http://nlujodhpur.ac.in/

ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, దిల్లీ

పోస్టులు: నాన్ అకడమిక్ పోస్టులు (మేనేజర్-01, జూనియర్ మేనేజర్-03)
అర్హత: పీజీ ఇన్ లైబ్రరీ సైన్స్, ఏదైనా పీజీ.
వయసు: మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, జూనియర్ మేనేజర్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
చివరితేది: 16.02.2018
వెబ్‌సైట్: http://iiitd.ac.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

విషయ వ్యక్తీకరణకు విలువైన మార్గం!

సివిల్స్, గ్రూప్స్, ఎస్ఐ తదితర పరీక్షల్లో కొన్ని ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో అభ్యర్థి పరిజ్ఞానంతోపాటు భావవ్యక్తీకరణ తీరును, తార్కికమైన ఆలోచనా విధానాన్ని పరిశీలిస్తారు. తెలిసిందంతా రాసేయడం, పదాడంబరాన్ని ప్రదర్శించడం లాంటి పొరపాట్లు చేయకుండా తెలుగు మాధ్యమం అభ్యర్థులు వివరణాత్మక జవాబులను, వ్యాసాన్ని ప్రభావపూరితంగా ఎలా రాయాలో తెలుసుకుందాం.



పోటీపరీక్షల్లో వ్యాసరచన మంచి మార్కులు తెచ్చుకోడానికి ఒక చక్కని మార్గం. తెలుగు మాధ్యమంలో రాసేవాళ్లు కొంచెం జాగ్రత్త వహిస్తే ఎక్కువ మార్కులు సాధించుకోవచ్చు. అర్హత పరీక్షల్లోనూ వ్యాసరచన ముఖ్యమైనదే. వ్యాసం అంటే విస్తరించడం, వివరించడం అని అర్థాలు. ఒక అంశాన్ని వివరించి అంటే పెంచి రాయడం. అంశం ఏదైనా దానికి సంబంధించిన తగిన విషయ పరిజ్ఞానం ఉంటేనే మంచి వ్యాసం రాయడం సాధ్యమవుతుంది.



డాక్టర్ ద్వానాశాస్త్రి

అర్థమయ్యేలా రాస్తే చాలు!

చక్కటి దస్తూరితో రాయడం మంచి వ్యాసం అనిపించుకోదు. రాతకు సంబంధించి అర్థమయ్యే విధంగా ఉంటే చాలు. వాక్యాల్లో వంకరటింకరలు ఉండకూడదు. కొందరు వాక్యాలను ఏటవాలుగా రాస్తారు. సమంగా రాయాలి. తెలుగు రాసేటప్పుడు భాషాదోషాలపై శ్రద్ధ వహించాలి. భాషాదోషాలంటే వ్యాకరణం ప్రకారం రాయడం కాదు. స్పష్టతతో అర్థభేదాలు లేకుండా రాయాలి.

ఉదాహరణకు– బావి అంటే నుయ్యి. చిన్న వత్తు ఇచ్చేశామంటే భావి అవుతుంది. దానికి అర్థం భవిష్యత్తు. శాకాహారం అంటే కూరగాయల ఆహారం. అదే శాఖాహారం అర్థం కొమ్మలతో ఆహారం. అలాగే పతకం రాయబోయి పతాకం రాస్తే చదివేవాళ్లు అయోమయంలో పడిపోతారు. ఇలా ఒకదాని బదులు ఇంకోటి రాస్తే వ్యాసం లక్ష్యం దెబ్బతింటుంది.

సాధారణంగా వచ్చే తప్పులను కొన్నింటిని పరిశీలిస్తే అవి ఎలా దొర్లుతాయో అర్థం చేసుకోవచ్చు. మొదటి పదం తప్పుగా రాసింది. బ్రాకెట్లో ఉన్నది సరైన ప్రయోగం. విధ్య (విద్య), స్వశ్చం (స్వచ్ఛం), భోదించు (బోధించు), శ్రేష్టం (శ్రేష్ఠం), శతృవు (శత్రువు), రాయభారం (రాయబారం), మహత్యం (మహాత్మ్యం), వర్నం (వర్ణం). కొంతమంది వత్తులు అక్షరాల పక్కన రాస్తుంటారు. దీని వల్ల కూడా అనర్థాలు జరుగుతాయి. అస్పష్టతలకు దారితీస్తుంది.

వాడుక భాషే వాడాలి

తప్పులు లేకుండా రాయాలన్నంత మాత్రాన వ్యాకరణ భాష లేదా మిత్రలాభం (చిన్నయ సూరి) భాష ఉపయోగించాలని కాదు. ఆ భాష రాయడం ఈ రోజుల్లో అనర్థం కూడా. వాడుక భాషలోనే వ్యాసం రాయాలి. అంటే పత్రికా భాష అని చెప్పవచ్చు. పోటీపరీక్షల్లో విషయమే అతి ముఖ్యం. ఆ విషయానికి స్పష్టతను ఇచ్చేది రాత. మనం మాట్లాడే భాషలోనే రాయాలి. కొందరు తమ ప్రాంతీయ భాషా పదాలు (మాండలిక పదాలు) వాడతారు. తప్పుకాదు కానీ ఎగ్జామినర్‌కి తెలియకపోతే మార్కులు తగ్గవచ్చు. అలాంటివి ఉపయోగించినప్పుడు బ్రాకెట్‌లో దాని అర్థాన్ని రాయాలి.

తక్కువగా ఆంగ్ల పదాలు

వీలైనంత వరకు ఆంగ్ల పదాలు రాకుండా చూడాలి. కొన్ని సాంకేతిక పదాలను ఆంగ్లంలో రాయవచ్చు. అయితే వాటికి అర్థాలు రాయడమో లేదా తెలుగు లిపిలో రాయడమో చేయాలి. కంప్యూటర్ అనే ఆంగ్ల పదాన్ని తెలుగులో రాయడాన్ని దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. కానీ ఇంటర్‌నెట్ వంటి పదాలకు ఇప్పుడు వాడుకలో ఉన్న 'అంతర్జాలం' ఉపయోగించవచ్చు.

విషయ విభజన అవసరం

ఇచ్చిన అంశాన్ని పలుకోణాల నుంచి విశ్లేషించాలి. అలా విశ్లేషిస్తున్నప్పుడు విషయాన్ని బట్టి పేరాలుగా విభజించుకోవాలి. అప్పుడే తెలియజేయాలనుకున్న అంశాన్ని పాఠకులు తేలిగ్గా గ్రహించగలుగుతారు.

జాతీయాలు, సామెతల వినియోగం

విషయం వ్యక్తీకరిస్తున్నప్పుడు సామెతలు, జాతీయాలను వాడవచ్చు. అయితే అవి సందర్భానికి అతికినట్లు ఉండాలి. వాటి అర్థాన్ని పూర్తిగా తెలుసుకొని వాడాలి. అప్పుడు భావానికి బలం వస్తుంది. పఠనానికి అనుకూలంగా ఉంటుంది.

ఉదాహరణకు పాకిస్థాన్ మనకి తలనొప్పిగా మారింది. ఒప్పందాలను ఉల్లంఘిస్తోంది. మనకి నష్టం కలిగిస్తోందని చెప్పడానికి 'పాకిస్థాన్ మనకు పక్కలో బల్లెంలా ఉంది' అంటే మరింత ప్రభావపూరితంగా ఉంటుంది. అలాగే 'ప్రభుత్వాలు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదు' అనే విషయాన్ని 'చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా..' అని చెప్పడం బాగుంటుంది.

ప్రారంభమే కీలకం

వ్యాసాన్ని ఎలా ప్రారంభించాలి. ఆంగ్లంలో 'వెల్ బిగన్ ఈజ్ హాఫ్ డన్' అంటారు. ఇచ్చిన అంశాన్ని బట్టి ప్రారంభం ఉండాలి. చక్కటి ఉపోద్ఘాతం లేదా ఒక సూక్తితో ప్రారంభించడం బాగుంటుంది. పూర్వ వివరాలు, ఆవశ్యకత, ఇచ్చిన అంశం ప్రాధాన్యం లేదా అవసరాన్ని గురించి తెలియజేస్తూ మొదలు పెట్టవచ్చు. ప్రారంభం బాగుంటే ఎగ్జామినర్ సానుకూల దృక్పథంతో మంచి మార్కులు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.

ముగింపు జ్ఞానాన్ని మదింపు చేస్తుంది

విషయ విశ్లేషణ చేశారు. లోపాలను లేదా మంచి చెడులను వెల్లడించారు. అయినా చివరి పేరాలో ముగింపు కూడా చాలా ముఖ్యం. అభ్యర్థి అంచనా ఏమిటి? ఏ వైపు మొగ్గుతున్నాడు? కారణాలేమిటి? సొంత అభిప్రాయాలు కలిగి ఉన్నాడా? వాటిని సమర్థించుకోగలుగుతున్నాడా అనే అంశాలు కూడా ఇతరుల కంటే ఎక్కువ మార్కులు సంపాదించి పెడతాయి. చివరకు తేలిందేమిటో స్పష్టంగా చెప్పాలి. అది అభ్యర్థి ఆత్మవిశ్వాసాన్ని తెలుపుతుంది. నిర్దిష్ట పదాల్లో రాయాల్సి వచ్చినప్పుడు నిబంధన అతిక్రమించకుండా సంక్షిప్తత పాటించాలి. ఒక ఇరవై పదాలు అటూ ఇటూ ఉన్నా ప్రమాదం లేదు. పూర్తి చేయకుండా వదిలేయకూడదు. ఇందుకోసం వ్యాసరచనను తప్పనిసరిగా సాధన చేయాలి.

మోదీ పాలనలో దేశ సమగ్రతకు ముప్పు

- ఎన్డీయే హయాంలో ప్రజాస్వామ్య, పార్లమెంటరీ వ్యవస్థలపై దాడులు
- త్రిపురలో ఎనిమిదోసారీ అధికారం మాదే
- పశ్చిమబెంగాల్‌లో పూర్వ వైభవం సాధిస్తాం
- ఆర్ఎస్ఎస్ ప్రోద్బలంతోనే కేరళలో హింస
- 'ఈనాడు - ఈటీవీ' ముఖాముఖిలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



ఈనాడు, నల్గొండ: ప్రధాని నరేంద్ర మోదీ పాలన దేశ సమగ్రత, సమైక్యతకు ముప్పుగా పరిణమించిందని సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. దేశంలో నాలుగేళ్లుగా ఆర్ఎస్ఎస్, భాజపా అనుబంధ సంస్థలు మతోన్మాద హింసను సృష్టిస్తున్నాయని ఆరోపించారు. క్రమంగా మోదీ భ్రమలు తొలగుతున్నాయని.. రానున్న కాలంలో వామపక్షాలకు పూర్వవైభవం తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే సర్కారును గద్దె దించడానికి తమ విధానాలకు దగ్గరగా ఉన్నవారితో పొత్తులుంటాయని పేర్కొన్నారు. నల్గొండలో జరుగుతున్న పార్టీ తెలంగాణ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశ సమకాలీన రాజకీయాలు, వచ్చే ఎన్నికల్లో పొత్తులు, భాజపా, సీపీఎం పాలిత రాష్ట్రాల్లో మౌలిక తేడా తదితర అంశాలపై ఆయన 'ఈనాడు- ఈటీవీ'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

■ గత యూపీఏ, ప్రస్తుత ఎన్డీయే పాలనకు నడుమ మౌలిక వ్యత్యాసం?

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో దేశంలోని అన్ని వ్యవస్థలూ జవసత్వాలు కోల్పోయాయి. ఆర్థిక వ్యవస్థను పట్టించుకోలేదు. విద్యారంగంతో సహా అన్ని రంగాలూ ప్రైవేటీకరణ జరిగాయి. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏ వర్గానికీ పూర్తిస్థాయి న్యాయం జరగలేదు. ఆర్థిక దోపిడీ పెరగ్గా.. ఇప్పుడు మోదీ ప్రభుత్వం ఆ దోపిడీని శరవేగంగా విస్తరిస్తోంది. రక్షణ, రైల్వే, విమానయాన, షేర్ మార్కెట్‌తో సహా అన్ని రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డీఐ) ఆహ్వానిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను అమెరికా సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడుతున్నారు. ఇరుగు పొరుగు దేశాలతోనూ సంబంధాలు దెబ్బతిన్నాయి.

■ ప్రస్తుత భాజపా ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఎలా ఎదుర్కొంటారు?

దేశంలో జరుగుతున్న మత హింసను అడ్డుకోవడానికి మా విధానాలకు దగ్గరగా ఉన్నవారితో ఏకమవుతాం. 'దళిత్ స్వాభిమాన్ సంఘటన్'తో కలిసి లౌకికశక్తులను ఏకం చేస్తున్నాం. పాలకవర్గానికి వ్యతిరేకంగా, మాపార్టీ విధానాలకు అనుకూలంగా ఉన్నవారితోనే వచ్చే ఎన్నికల్లో పొత్తు పెట్టుకుంటాం. ఆ కూటమిలో కాంగ్రెస్, సీపీఐతో సహా ఏ పార్టీ అయినా ఉండొచ్చు. ఉండకపోవచ్చు. మాకు వ్యక్తుల కన్నా విధానాలు ముఖ్యం. మతతత్వ రాజకీయాలు ఎక్కువకాలం కొనసాగవు. మోదీ ప్రభుత్వానికి 31 శాతం మద్దతుంటే, 69 శాతం మంది ప్రజల వ్యతిరేకత ఉంది. వీరే వచ్చే ఎన్నికల్లో భాజపాకు గుణపాఠం చెబుతారు.

■ సీపీఎం పాలిత కేరళ, త్రిపురలో ఆర్ఎస్ఎస్, హిందూత్వవాదులను కక్షతో హత్య చేస్తున్నారనే ఆరోపణలపై అభిప్రాయం?

దొంగే దొంగ అన్నట్లుంది భాజపా పరిస్థితి. కేరళలో మైనార్టీ జనాభా ఎక్కువ. దీన్ని ఆధారంగా చేసుకొని హిందువులంతా సంఘటితం కావాలనే నెపంతో ఆర్ఎస్ఎస్ అక్కడ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోంది. కేరళలో మాప్రభుత్వం (ఎల్‌డీఎఫ్) అధికారంలోకి వచ్చాక ఎన్ని హత్యలు జరిగాయి? అందులో చనిపోయిన సీపీఎం కార్యకర్తలెందరనే లెక్క తీస్తే సరిపోతుంది. మత విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలనేది భాజపా సంస్కృతి. త్రిపురలో ఈతరహా ప్రణాళిక కుదరదు కాబట్టి అక్కడ గిరిజన, గిరిజనేతరులకు చిచ్చు పెట్టడానికి ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. రానున్న ఎన్నికల్లో త్రిపురలో 8వసారీ మాపార్టీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది.

■ ఒకప్పుడు పశ్చిమబెంగాల్‌లో వెలిగిన పార్టీ పరిస్థితి తీసికట్టుగా తయారవుతోంది?

పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల పట్ల పక్షపాతంగా వ్యవహరిస్తోంది. భాజపా మెజార్టీ ప్రజలైన హిందువులను చేరదీస్తోంది. సహజంగానే సీపీఎంకు, ప్రజలకు మధ్య కొంతదూరం పెరిగింది. ప్రజా ఉద్యమాల ద్వారా దూరాన్ని తగ్గించి, పూర్వవైభవం సాధిస్తాం.

■ తెలంగాణలో మాదిరిగానే పాలకవర్గాలపై ఉమ్మడి పోరుకు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) లాంటి సంస్థలను ఇతర రాష్ట్రాల్లో ఏర్పాటు చేస్తారా?

తెలంగాణ వస్తే సమస్యలన్నీ తీరుతాయని గతంలో ఉద్యమకారుల మాటలను ప్రస్తుతం ప్రజలు నమ్మడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో వెనుకబాటుతనం పోవాలంటే ఇక్కడి వనరులను సమర్థంగా వాడుకుంటూ క్షేత్రస్థాయిలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా విధానాల రూపకల్పన జరగాలి. ఇప్పుడు ఆదిశగా ప్రయత్నాలు జరగడం లేదు. అందుకే పాలకవర్గాలపై పోరుకు దళితవర్గాలతో కలిసి పోరాడాలనే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)ను ఏర్పాటు చేశాం. "జై భీమ్. . లాల్‌సలాం- నీల్ జెండా, లాల్ జెండా" నినాదం స్ఫూర్తితో ముందుకు సాగుతాం.

ప్రధాన పార్టీలన్నింటిదీ ఒకే తీరు

- అధికారంలో పార్టీలు మారినా పాత విధానాలే
- ప్రజా పక్షం బహుజన వామపక్ష కూటమే
- సీపీఎం రెండో రాష్ట్ర మహాసభల్లో రాజకీయ తీర్మానం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని తెరాస, కాంగ్రెస్, తెదేపా, భాజపా తదితర ప్రధాన పార్టీల విధానాలన్నీ ఒకేతీరుగా ఉన్నాయని, తెలంగాణ సెంటిమెంట్‌పైనే తెరాస బతుకుతుందే తప్ప పాలనలో గత ప్రభుత్వ విధానాలకు ఏమాత్రం భిన్నంగా లేదని సీపీఎం రెండో రాష్ట్ర మహాసభల్లో నేతలు అభిప్రాయపడ్డారు. 2019లో అధికారం మాదే అని కాంగ్రెస్ చెబుతున్నా , పార్టీలో అనైక్యత వల్ల ప్రజల్లో ఆ పార్టీ విశ్వాసం పొందడం కష్టమని చెప్పారు. ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ విధానాల వైపు ఆలోచించే విధంగా రాజకీయ పరిస్థితిని మార్చాలని, ఆ దిశగా వామపక్ష, సామాజిక శక్తులతో ఏర్పడిన బహుజన వామపక్ష కూటమి(బీఎల్‌ఎఫ్) పట్ల చర్చ మొదలైందని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడేది ఈ కూటమేనని మహాసభల్లో తీర్మానించారు. నల్గొండలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర రెండో మహాసభల్లో సోమవారం 'రాజకీయ నిర్మాణ నివేదిక'ను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలన ప్రజలను తీవ్రంగా నిరాశపరుస్తోందని, అవినీతి సాగుతోందని నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే శ్రుతి, సాగర్‌ను ఎన్‌కౌంటర్ల పేరిట పొట్టనపెట్టుకున్నారని ఆరోపించారు. భారీగా వలసలను ప్రోత్సహించి తెరాస బలపడిందని, ప్రజాబలంలో ప్రస్తుతం ఆధిక్యంలో ఉన్నా.. నిర్మాణపరంగా ఆ పార్టీ బలహీనంగానే ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలపై కాంగ్రెస్ పార్టీ కొంత కదలికలను పెంచిందని, కమిటీల పనితీరు బాగోలేకపోయినా ఆ పార్టీకి బలమైన కార్యకర్తల వ్యవస్థ ఉందని మహాసభ పేర్కొంది. తెదేపా ఎన్నికల నాటికి ఇంకా బలహీనపడే అవకాశముందని, రాష్ట్రంలోనూ అధికారంలోకి రావడానికి భాజపా ప్రయత్నిస్తోందన్నారు. మహాజన పాదయాత్ర, టీమాస్, భూనిర్వాసితుల తరఫున పోరాటాలు, బహుజన వామపక్ష కూటమి నిర్మాణం తదితర కార్యక్రమాలన్నీ సీపీఎంను ప్రజల తరఫున పోరాడే విజేతగా నిలబెట్టాయని రాజకీయ నిర్మాణ తీర్మానం వెల్లడించింది.

నిధులు కేటాయించకుండా
మద్దతు ధర ఎలా సాధ్యం?

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాష్ కారాట్

నల్గొండ వన్‌టౌన్, న్యూస్‌టుడే: బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా పంట ఉత్పత్తులకు మద్దతు ధర ఎలా కల్పిస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాష్ కారాట్ ప్రశ్నించారు. నల్గొండలో జరుగుతున్న పార్టీ ద్వితీయ మహాసభల ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని.. పేదలపై పన్నుల భారం మోపిందని చెప్పారు. రూ.2 వేల కోట్లు కేటాయించి సుమారు 10 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని చెప్పటం బూటకమేనన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం పెరిగాయన్నారు. జమిలి ఎన్నికలు నిర్వహించాలని ప్రధాని ఆరాటపడుతున్నా.. అది రాజ్యాంగ విరుద్ధ ప్రక్రియ అన్నారు. ఎన్డీఏ సర్కారును గద్దె దించేందుకు ఎన్నికల సమయంలో పొత్తులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. తెలంగాణలో తెరాస సర్కారు ఎన్నికల వాగ్దానాలను అమలుచేయటంలో విఫలమైందని ఆరోపించారు. ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఏర్పడిందని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలోనూ ఇలాంటి ప్రత్యామ్నాయ వేదికను తీసుకొస్తామన్నారు. అంతకుముందు మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, బి.వెంకట్, జూలకంటి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న ప్రకాష్ కారాట్, జూలకంటి తదితరులు

ఆ ఒక్కటీ వస్తే చాలు

సీఎం పదవిపై మనసులో మాట చెప్పిన జానారెడ్డి

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఇప్పటివరకూ 17 ఏళ్లపాటు మంత్రిగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగిన ఘనత ఉమ్మడి రాష్ట్రంలో తనకుందని సీఎల్పీనేత, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జానారెడ్డి అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలంలో జరిపిన పర్యటనలో భాగంగా తానేదార్‌పల్లిలో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తనకున్న రాజకీయ అనుభవం చంద్రబాబుకు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి గానీ లేవన్నారు. తాను అన్ని శాఖల్లో మంత్రిగా పనిచేసిన అనుభవముందని ఇక ఆ ఒక్కటీ(సీఎం పదవి) వస్తే అన్ని పదవులూ చేసినట్లేనని, యువత తలచుకుంటే అది కూడా సాధ్యమవుతుందని తన మనసులోని మాటను బయటపెట్టారు.

మహిళా మంత్రుల్లేని ప్రభుత్వంగా తెరాస రికార్డు

- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శ
- 'వనపర్తి డిక్లరేషన్' వెల్లడి

ఈనాడు డిజిటల్, వనపర్తి : మహిళా మంత్రుల్లేని ప్రభుత్వంగా తెరాస రికార్డు సృష్టించిందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. వనపర్తి జిల్లా నాగవరంలో ఎమ్మెల్యే చిన్నారెడ్డి అధ్యక్షతన సోమవారం 'మూడున్నర సంవత్సరాల తెరాస ప్రభుత్వ పాలనలో దగాపడిన స్వయం సహాయక సంఘాల మహిళలు' అనే అంశంపై నిర్వహించిన 'మహిళా గర్జన' కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. 2019లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, మహిళల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా 'వనపర్తి డిక్లరేషన్'ను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ప్రతి చిన్న మహిళా సంఘానికి రివాల్వింగ్ ఫండ్ కింద రూ.1లక్షకు తగ్గకుండా సభ్యురాలికి రూ.10వేల చొప్పున రూ.1.50 లక్షలు అందిస్తామన్నారు. ఇది పూర్తిగా గ్రాంటు రూపంలో అందిస్తామన్నారు. కనీస పింఛను రూ.500 నుంచి రూ.వెయ్యికి పెంచి గరిష్ఠంగా రూ.3వేలు చేస్తామన్నారు. సహజ మరణానికి రూ.2.50 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.5లక్షలు చెల్లిస్తామన్నారు. బ్యాంకులు అందించిన రుణాలపై వడ్డీలేని రుణం రాయితీ రూ.2వేల కోట్ల బకాయిలను సంఘాలకు చెల్లిస్తామన్నారు. స్త్రీనిధి రుణాలపై వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. ప్రతి గ్రామపంచాయతీలో రూ.15 లక్షలతో డ్వాక్రా భవనాలు, మండల సమాఖ్య భవనాన్ని రూ.30లక్షలతో నిర్మించి ఇస్తామన్నారు.



సెర్ప్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని, వీవోఏలకు రూ.10 వేల వరకు వేతనాలు పెంచుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సుష్మితాదేవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరముందన్నారు. కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తెరాస అధికారంలోకి వచ్చాక మహిళా సంఘాలకు ఎలాంటి సాయమూ అందడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి కుంతియా మాట్లాడుతూ.. గత యూపీఏ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భట్టి విక్రమార్క, నేతలు మధుయాష్కి గౌడ్, నేరెళ్ల శారద, ఎమ్మెల్యేలు డీకే అరుణ, గీతారెడ్డి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధనిక రాష్ట్రమంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు

తెదేపా నేత రావుల ఆరోపణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ధనిక రాష్ట్రమంటూ తెరాస ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని, నిజంగా ధనిక రాష్ట్రమైతే ఆసరా పింఛన్లు, ఫీజు బకాయిలు ఎందుకు నిలిపివేశారని తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి ఆరోపించారు. సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ అధికార ప్రతినిధి దుర్గాప్రసాద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ కింద ప్రభుత్వం ఇచ్చిన నిధులు వడ్డీలకే సరిపోవడంతో పట్టాదారు పాసుపుస్తకాలు బ్యాంకుల్లోనే ఉన్నాయని రావుల చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకానికి నిధులు ఆపివేయడంతో ఆస్పత్రులు ఇప్పటికే మూడు సార్లు వైద్యం నిలిపివేశాయని, ఫీజుల రుసుములకు నిధులు రాక కాలేజీలు మూతపడుతున్నాయని చెప్పారు. కేసీఆర్‌పై పోటీచేసినందుకు తెదేపా నేత ఒంటేరు ప్రతాప్ రెడ్డిపై ఎన్ని కేసులు పెడతారని ప్రశ్నించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇతర పార్టీలను నాశనం చేయడం సాధ్యం కాదని కేసీఆర్ గుర్తుంచుకోవాలన్నారు.

సర్వే పరీక్షకు 79,423 మంది హాజరు

ఈనాడు, హైదరాబాద్: పదో తరగతి విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలను అంచనా వేయడానికి దేశవ్యాప్తంగా సోమవారం నిర్వహించిన జాతీయ సాధన సర్వే(న్యాస్) పరీక్షకు తెలంగాణలోని 2,481 పాఠశాలల నుంచి 79,423 మంది విద్యార్థులు హాజరయ్యారు. అయిదు సబ్జెక్టుల్లో 180 ప్రశ్నలు ఇవ్వగా కాపీయింగ్ జరగకుండా ఒక్కో సబ్జెక్టుకు మూడు ప్రశ్నపత్రాలు రూపొందించినట్లు ఎస్‌సీఈఆర్‌టీ సంచాలకురాలు శేషుకుమారి తెలిపారు.

మార్చి 14 నుంచి పాలిసెట్ దరఖాస్తులు

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఏప్రిల్ 21న నిర్వహించే తెలంగాణ పాలిసెట్-2018కు మార్చి 14వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని రాష్ట్ర సాంకేతిక విద్యా, శిక్షణ మండలి తెలిపింది. సహాయ కేంద్రాలను 52 నుంచి 58కి పెంచుతున్నారు. రాష్ట్రంలో 57 ప్రభుత్వ, 2 ఎయిడెడ్, 128 ప్రైవేట్ కళాశాలల్లో 44,451 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఉద్యోగుల సమస్యలపై త్వరలో సమావేశం

టీఎన్జీవో నేతలకు సీఎస్ హామీ

ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే ఒక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి వెల్లడించారు. సమావేశంలో చర్చకొచ్చిన అంశాలు అన్నింటినీ ముఖ్యమంత్రికి తెలిపి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీఎస్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన జోషిని టీఎన్జీవో నేతలు కారం రవీందర్ రెడ్డి, మామిళ్ల రాజేందర్, ముజీబ్, ప్రతాప్ తదితరులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎస్ వారికి హామీ ఇచ్చారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యునితో తెలంగాణ ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఛైర్మన్ భేటీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సోమవారమిక్కడ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములుతో భేటీ అయ్యారు. ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా రాములు తెలంగాణ కమిషన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కమిషన్ నియామకంపై సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనుభజ్ఞులైన వారితో కమిటీ ఉందని, రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని జాతీయ కమిషన్ సభ్యుడిని కోరామని చెప్పారు. సీఎం దళితుల పక్షపాతిగా ఉన్నందున రాష్ట్రంలోని దళితులకు పూర్తి న్యాయం చేసేందుకు కమిషన్ కృషి చేస్తుందని అన్నారు.

రెండో ఏఎన్ఎంలకు మూడు రోజుల్లో వేతనాల పెంపు

- మంత్రి లక్ష్మారెడ్డి

ఈనాడు- హైదరాబాద్, బాగ్‌లింగంపల్లి- న్యూస్‌టుడే: రెండో ఏఎన్ఎంలకు మూడు రోజుల్లో వేతనాల పెంపునకు చర్యలు చేపడతామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ శుభవార్త ముఖ్యమంత్రి నోటి నుంచి త్వరలోనే వింటారని చెప్పారు. సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో నిర్వహించిన రెండో ఏఎన్ఎంల రాష్ట్ర ప్రథమ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రెండో ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మాకు ప్రజలే ప్రభువులని, తమకు దిల్లీ లేదని, సీఎం కేసీఆర్ మా నేత అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 70 సీట్లు సాధిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని, కాంగ్రెస్ పార్టీ 7 సీట్లకే పరిమితమవుతుందన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, తెరాస కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్, రెండో ఏఎన్ఎం రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ, ప్రధాన కార్యదర్శి తారాదేవి మాట్లాడారు. అన్ని జిల్లాల నుంచి రెండో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రెస్టారెంట్లు, హోటళ్లకు గ్రేడ్లు: ఆహార నాణ్యత, ప్రమాణాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, తోపుడు బండ్లకు ఏ, బీ, సీ గ్రేడ్లు ప్రకటించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. వాటిలో ఆహార నాణ్యత, పరిసరాలు, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత ఇతరత్రా అంశాలన్నీ పరిగణనలోకి తీసుకొని గ్రేడ్లు ఇచ్చేలా యోచిస్తున్నామన్నారు. ఆహార కల్తీని కనిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో రూ.50 లక్షల వ్యయంతో రూపొందించిన సంచార ప్రయోగశాల (మొబైల్ ల్యాబ్)ను సోమవారమిక్కడ ఐపీఎంలో శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ కల్తీల నిరోధానికి కఠిన చట్టాలతోపాటు అవసరమైతే పీడీ యాక్టు ప్రయోగించాలన్నారు. ఆహార కల్తీని నిరోధించేందుకు ఆయా శాఖల్లో ఖాళీల భర్తీతోపాటు కొత్త నియామకాలను చేపడతామన్నారు. మొబైల్ ల్యాబ్‌లో పాలు, వంటనూనెలు, నెయ్యి, మసాలాలతోపాటు అన్ని రకాల ఆహార పదార్థాలను పరిశీలించవచ్చన్నారు.

ఉర్దూ మాధ్యమంలోనూ ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాలు

- ముఖ్యమంత్రి ఆదేశంతో 'మండలి' నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే అన్ని ఆన్‌లైన్ పరీక్షల ప్రశ్నపత్రాలనూ ఇక ఉర్దూ మాధ్యమంలోనూ ఇవ్వనున్నారు. ప్రస్తుతం ప్రశ్నపత్రాలను తెలుగు, ఆంగ్లంలోనే ఇస్తుండగా ఈసారి నుంచి వాటికి అదనంగా ఉర్దూలో రూపొందించనున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సోమవారం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి సోమవారం సచివాలయంలో సమావేశమై చర్చించారు. ఇప్పటివరకు ఇంకా ఏ ఒక్క ప్రవేశ పరీక్షకు ప్రకటన జారీ కానందున వచ్చే మే నెలలో జరిగే పరీక్షల్లో ప్రశ్నపత్రాలను ఉర్దూలోనూ ఇవ్వాలని తుది నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం విద్యామండలి ఆధ్వర్యంలో ఎంసెట్, ఈసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, పీజీఈసెట్, లాసెట్, పీఈసెట్‌లను నిర్వహిస్తున్నారు. పీఈసెట్ (వ్యాయామ విద్య) తప్ప మిగతా వాటిని ఈసారి ఆన్‌లైన్‌లో జరుపుతారు. పీఈసెట్‌కూ రాత పరీక్ష ఉండదు. దరఖాస్తుదారులకు మైదానంలో క్రీడాపోటీలు నిర్వహిస్తారు. మిగతా వాటికి తెలుగు, ఆంగ్లంతోపాటు ఉర్దూలోనూ ప్రశ్నపత్రం తయారు చేస్తారు. ప్రస్తుతం అన్ని ప్రవేశ పరీక్షలకూ దాదాపు 4.50 లక్షల మంది ఏటా దరఖాస్తు చేస్తున్నారు. ఈసారి ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నందున అభ్యర్థులు ఆసక్తి ఉన్న మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. సాధారణంగా రాత పరీక్ష అయితే ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. తెలుగులో అనువాద దోషాలుంటే ఆంగ్ల ప్రశ్నలను చూడగలరని అందులో పేర్కొంటారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూమాధ్యమాల్లో ఏ ఒక్కటైనా ఎంచుకోవచ్చు.

మార్చి 26 ముహూర్తం!

కొత్తగూడెం కొత్త విద్యుత్కేంద్రం ప్రారంభానికి తేదీ ఖరారు

ఈనాడు, హైదరాబాద్: కొత్తగూడెం సమీపంలో తెలంగాణ జెన్‌కో కొత్తగా నిర్మిస్తున్న 800 మెగావాట్ల విద్యుత్కేంద్రంలో ప్రయోగాత్మకంగా విద్యుదుత్పత్తిని మార్చి 26 నుంచి ప్రారంభించాలని సోమవారం నిర్ణయించారు. రాష్ట్రం ఏర్పడ్డాక నిర్మాణం ప్రారంభించిన ఈ కేంద్రాన్ని త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ప్రయోగాత్మక ఉత్పత్తి ప్రారంభమైన మూడునెలల్లో వాణిజ్య ప్రాతిపదికన ఉత్పత్తి తేదీ ఉంటుంది. అప్పటినుంచి అధికారికంగా కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఇది ప్రారంభించిన ఏడాదిలోగా కొత్తగూడెంలో 720 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యమున్న 7 ప్లాంట్లను మూసివేయాలని జెన్‌కో నిర్ణయించింది. వీటిని నిర్మించి దశాబ్దాలు గడిచినందున మూసివేయాలనే షరతుతోనే కొత్తగా ఈప్లాంటుకు కేంద్ర పర్యావరణశాఖ అనుమతించింది.

అధ్యయనానికి మంగళం?

గొర్రెల పంపిణీ పథకంలో మలుపు

ఈనాడు, హైదరాబాద్: గొర్రెల పంపిణీ వల్ల గ్రామీణ కుటుంబాల్లో ఆర్థికాభివృద్ధి ఏ మేరకు జరిగిందనే అంశంపై అధ్యయనం చేయించాలనే యోచనను పశుసంవర్ధక శాఖ విరమించుకుంది. 'సామాజిక, ఆర్థిక అధ్యయనాల సంస్థ'(సెస్)తో గ్రామాల్లో అధ్యయనం చేయించాలని డిసెంబరు 30న ఆదేశాలిచ్చింది. కానీ, ఆ తరవాత ప్రభుత్వ అంతర్గత సూచనతో వీటిని పక్కనపెట్టింది. గొర్రెలను పంపిణీ చేసిన తరవాత వాటిని కొందరు అక్రమంగా అమ్ముకుంటున్నారు. ఒకసారి అమ్మినవాటినే తిరిగి మళ్లీ రాయితీపై (రీసైక్లింగ్) ఇచ్చినట్లు చూపుతున్నట్లు సైతం గతంలో అధికారులు పట్టుకున్నారు. రోగాలతో ఇప్పటికే 30 వేల గొర్రెలు మృత్యువాత పడినట్లు రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య అధికారికంగానే వెల్లడించింది. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే రోగాలతో మరణించిన వాటి సంఖ్య ఇంకా అధికంగా ఉంటుందని తెలుస్తోంది. సెస్ అధ్యయనంతో పలు వివరాలు బయటికొస్తాయని తొలుత భావించారు. కానీ దాన్ని ఆపేయడంతో వాస్తవాలు ఇప్పట్లో వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. సెస్‌తో అధ్యయనం చేయించాలా? వద్దా? అన్నది ప్రభుత్వ విధాన నిర్ణయమని దీనిపై తానేమీ వ్యాఖ్యానించలేనని సమాఖ్య ఎండీ లక్ష్మారెడ్డి 'ఈనాడు'తో చెప్పారు.

42 లక్షల గొర్రెల పంపిణీ: రాష్ట్రంలో ఇప్పటివరకూ 42 లక్షల గొర్రెలను. . 2 లక్షల గొల్ల, కురుమ కుటుంబాలకు పంపిణీ చేశామని గొర్రెలు, మేకల సహకార అభివృద్ధి సమాఖ్య ఎండీ లక్ష్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం (2017-18)లో మొత్తం 3.62 లక్షల కుటుంబాలకు 21 గొర్రెల చొప్పున పంపిణీ చేయాలన్న లక్ష్యంలో 55 శాతం పూర్తయినట్లు వివరించారు. వీటికి రూ.2,502 కోట్లు వ్యయంకాగా ప్రభుత్వం రూ.1,877 కోట్లు విడుదల చేసిందని, మిగతావి లబ్ధిదారుల వాటాగా భరించారని తెలిపారు. పంపిణీ చేసిన గొర్రెలకు 15.50 లక్షల పిల్లలు పుట్టాయని, వీటిద్వారా రూ.700 కోట్ల సంపద పేద కుటుంబాలకు ఏర్పడిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది పంపిణీ లక్ష్యాల్లో కామారెడ్డి 94.85, జగిత్యాల 92శాతంతో వరసగా అగ్రస్థానాల్లో ఉండగా రంగారెడ్డి 22.65 శాతంతో చిట్టచివరనుంది. ఒక్కో కుటుంబానికి రూ.425 విలువ గల మందుల కిట్ ఇవ్వడానికి రూ.6 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

బీసీలంతా ఎంబీసీలే

బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని 113 బీసీ కులాలు అత్యంత వెనుకబడిన వర్గాలే (ఎంబీసీలే)నని బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. బీసీల విద్య కోసం మరిన్ని గురుకులాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. నాయీబ్రాహ్మణుల వృత్తిలోకి ఇతరులను రానీయకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నాయీబ్రాహ్మణ శిక్షణ పూర్తి చేసుకున్న 138 మందికి సోమవారమిక్కడ సచివాలయంలో సాంకేతిక పరికరాల కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా నాయీబ్రాహ్మణ వృత్తి శిక్షణ తీసుకున్న వారికి రూ.5 వేల విలువైన కిట్లు, బ్యూటీపార్లర్ శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు రూ.5,500 విలువైన కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామన్న మాట్లాడారు. 'నాయీబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించింది. ఇందులో వృత్తిపరమైన శిక్షణకు రూ.20 కోట్లు ఇస్తున్నాం. మార్చి నాటికి 20,109 మంది లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వాలన్నది లక్ష్యం. త్వరలో రెండో బ్యాచ్ శిక్షణ ప్రారంభిస్తాం. 30 జిల్లాల నుంచి 25 మంది చొప్పున, హైదరాబాద్ నుంచి 50 మందిని ఎంపిక చేస్తాం. నాయీబ్రాహ్మణులు దుకాణాలు పెట్టుకునేందుకు బ్యాంకుల పూచీకత్తు లేకుండా నేరుగా రూ.2 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు పంపిణీ చేస్తాం. ఇతర వ్యాపారాలు చేసుకున్నా సహకారం అందిస్తాం' అని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్, నాయీబ్రాహ్మణ సహకార సమాఖ్య ఎండీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలే శ్రీను హత్యకు కారణం: మంత్రి జగదీష్‌రెడ్డి

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: నల్గొండ పురపాలిక ఛైర్‌పర్సన్ లక్ష్మి భర్త శ్రీనివాస్ హత్యకు కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలే కారణమని విద్యుత్తు శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్గొండలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డి సోదరులు చేస్తున్న శవరాజకీయాలు పతాక స్థాయికి చేరాయన్నారు. శ్రీనుకు రక్షణ కల్పించాలని కాంగ్రెస్ నేతలు కోరలేదని తెలిపారు. అసత్య ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకులపై న్యాయపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ బలంగా ఉందని.. శ్రీనివాస్ హత్య వెనుక ఎవరున్నా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. సీబీఐ విచారణ అవసరం లేదని.. త్వరలో వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, వేముల వీరేశం, రవీంద్రకుమార్, శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్, అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిషన్ భగీరథకు మరో రూ.201 కోట్ల రుణం

ఈనాడు, హైదరాబాద్: మిషన్ భగీరథ కింద గ్రామాల్లో అంతర్గత పైపులైన్లను ఏర్పాటు చేసేందుకు నాబార్డు మరో రూ.201 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. దీనికి తన 20 శాతం వాటా కింద రూ.36 కోట్లను జోడించి మొత్తం రూ. 237 కోట్లను నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని కొన్ని మండలాల్లో వినియోగించనున్నట్టు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

సెన్సెక్స్ ▼ 310
34757

నిఫ్టీ ▼ 94
10667

రూపాయి 64.07 ▼ 01 పైసలు
(ఒక అమెరికా డాలరుకు)

బంగారం 30,455 ▼ రూ.లలో 180
(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)

వెండి 38,730 ▼ రూ.లలో 540
ముంబయిలో కిలో

ముడి చమురు 67.71 ▼
(బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం-/నష్టం-
డోజోన్స్	25,264	−257
నాస్‌డాక్	7,210	−31
నిక్కీ 225 (జపాన్)	22,682	−592
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,483	−47
షాంఘై(చైనా)	3,487	+25
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,335	−108
డాక్స్ (జర్మనీ)	12,687	−98

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.37	67.68
పౌండ్ స్టెర్లింగ్	82.44	95.62
యూరో	72.73	84.34
జపనీస్ యెన్/100	53.10	61.59
ఆస్ట్రేలియా డాలరు	46.29	53.55
సింగపూర్ డాలరు	44.32	52.50
థాయ్ బాత్/100	185.32	221.64
బహ్రెయిన్ దీనార్	158.08	181.15
కువైట్ దీనార్	176.98	220.32
సౌదీ రియాల్	15.52	18.40
యూఏఈ దిర్హమ్	15.89	18.57
మలేషియా రింగిట్	14.67	18.03
చైనీస్ యువాన్	7.20	11.68

సోమవారం నిఫ్టీ కదలికలు



మార్కెట్ కబుర్లు

✦ **ఆస్టర్ డీఎమ్ హెల్త్‌కేర్** తన పబ్లిక్ ఇష్యూకు ధరల శ్రేణిని రూ.180-190గా నిర్ణయించింది. ఈ నెల 12న ప్రారంభమై 18న ముగిసే ఈ ఇష్యూ ద్వారా రూ.980 కోట్ల వరకు నిధులు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.

✦ 87.6 లక్షల షేర్లను రూ.210.4 కోట్లతో తిరిగి కొనుగోలు చేసే ప్రతిపాదనకు బోర్డు అంగీకరించిందని ప్రభుత్వ రంగ సంస్థ **ఎమ్ఓఐఎల్** ప్రకటించింది. సోమవారం జరిగిన సమావేశంలో ఆ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో తెలిపింది.

✦ టాటా టెక్నాలజీస్‌లో 43 శాతం వాటాను 360 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.2320 కోట్లు)తో వార్‌బర్గ్ పింకస్‌కు విక్రయించడానికి కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు **టాటా మోటార్స్** తెలిపింది. అంతర్గత పనితీరు లక్ష్యాలను చేరలేకపోవడం; నియంత్రణ సంస్థల అనుమతులు లభించకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

✦ రూ.300 కోట్ల సమీకరణకు **ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్** వాటాదారులు ఆమోదం తెలిపారు. ఈజీఎంలో నిధుల సమీకరణకు వాటాదారులు అంగీకరించారని కంపెనీ తెలిపింది.

✦ **ఎస్‌బీఐ కార్డ్** ఎండీ, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా హరిదయాళ్ ప్రసాద్ నియమితులయ్యారు.

2 రోజులు.. 1150 పాయింట్లు

● కొనసాగిన అమ్మకాల వెల్లువ ● 310 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ ● 10,700 దిగువకు నిఫ్టీ

సూచీల నష్టకష్టాలు కొనసాగాయి. దీర్ఘకాల మూలధన లాభాల పన్ను ప్రతిపాదనకు తోడు, అంతర్జాతీయ మార్కెట్ల సెగా మన మార్కెట్లకు తగిలింది. అమెరికా బాండ్ రాబడులు గణనీయంగా పెరగడమే ఇందుకు నేపథ్యం. బ్యాంకింగ్, యంత్ర పరికరాలు, ఐటీ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా అయిదో రోజూ డీలాపడ్డాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశం నేడు ప్రారంభం కానుండటంతో మదుపర్లు ఆచితూచి అడుగేశారు. రెండు రోజుల్లో సెన్సెక్స్ 1,150 పాయింట్లు కోల్పోవడంతో మదుపర్ల సంపద రూ.5.04 లక్షల కోట్లు క్షీణించి, రూ.147 లక్షల కోట్లకు చేరింది. ఆసియా షేర్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా మార్కెట్లు నేలచూపులు చూశాయి.

సెన్సెక్స్ ఉదయం 34,718.85 పాయింట్ల వద్ద భారీ నష్టాల్లోనే ప్రారంభమైంది. రోజంతా మదుపర్లు అమ్మకాలకే మొగ్గుచూపడంలో ఏదశలోనూ కోలుకోని సూచీ. . ఇంట్రాడేలో 35,520.80 పాయంట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివర్లో స్వల్పంగా కోలుకున్న సూచీ 309.59 పాయింట్ల నష్టంతో 34,757.16 వద్ద ముగిసింది. జనవరి 12 తర్వాత సూచీకిదే కనిష్ఠ స్థాయి. గత నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1,216.50 పాయింట్లు



కోల్పోయింది. ఇక నిఫ్టీ సైతం 94.05 పాయింట్లు తగ్గి 10,666.55 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,586.80- 10,702.75 పాయింట్ల మధ్య కదలాడింది.

ఎయిర్‌టెల్ పరుగులు: భారతీ టెలికాంలో రూ.2,649 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు సింగపూర్ టెలికాం సంస్థ సింగ్‌టెల్ ప్రకటించిన నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్ షేర్లు పరుగులు తీశాయి. ఇంట్రాడేలో 5.68 శాతం పెరిగిన షేరు.. చివరకు 4.20 శాతం లాభంతో రూ. 439.50 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 7,075.73 కోట్లు పెరిగి రూ.1,75,685.73 కోట్లకు చేరింది. తాజా పెట్టుబడి ద్వారా సంస్థలో సింగ్‌టెల్ వాటా 1.7 శాతానికి పెరగనుంది.

సెన్సెక్స్ 30 షేర్లలో 19 నష్టాలను చవిచూశాయి. హెచ్‌డీఎఫ్‌సీ 4.06%, ఎల్ అండ్ టీ 3.65%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.36%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.32%, అదానీ పోర్ట్స్ 2%, బజాజ్ ఆటో 2%, ఓఎన్‌జీసీ 1.87%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.79%, యెస్ బ్యాంక్ 1.69%, టీసీఎస్ 1.35%, హిందుస్థాన్ యునిలీవర్ 1.05%, ఎం అండ్ ఎం 1.01% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి. టాటా మోటార్స్ 3.12%, పవర్‌గ్రిడ్ 2.08%, ఐటీసీ 1.43%, సన్‌ఫార్మా 1.08%, కోల్ ఇండియా 0.99%, మారుతీ 0.98%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో యంత్ర పరికరాలు 2.65% నీరసపడింది. బ్యాంకింగ్ 1.11%, లోహ 0.56%, స్థిరాస్తి 0.36% చొప్పున డీలాపడ్డాయి. టెలికాం, వాహన, విద్యుత్, పీఎస్‌యూ, ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ షేర్లు రాణించాయి. బీఎస్ఈలో 1,753 షేర్లు ప్రతికూలంగా, 1,027 షేర్లు సానుకూలంగా ముగిశాయి. 196 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

11 రెట్లు పెరిగిన టాటా మోటార్స్ లాభం

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో టాటా మోటార్స్ గ్రూప్ నికర లాభం రూ.1215 కోట్లకు చేరింది. 2016-17 ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.111.6 కోట్లతో పోలిస్తే ఇది 11 రెట్లు ఎక్కువ కావడం విశేషం. ఇదే సమయంలో గ్రూప్ ఆదాయం 16.1 శాతం హెచ్చి రూ.74,156 కోట్లకు పెరిగిందని కంపెనీ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. స్టాండలోన్ పద్ధతిన టాటా మోటార్స్ ఇండియా లాభాల్లోకి వచ్చింది. రూ. 16,102 కోట్ల ఆదాయంపై రూ.183.65 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఏడాది క్రితం ఇదే మూడు నెలల కాలంలో కంపెనీకి రూ.1052.13 కోట్ల నష్టం వాటిల్లింది. సెప్టెంబరు త్రైమాసికంలో రూ.295.30 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. జేఎల్ఆర్ పన్నుకు ముందు లాభం 192 మిలియన్ పౌండ్లకు చేరింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన 255 మిలియన్ పౌండ్లతో పోలిస్తే ఇది తక్కువే. ఆదాయం మాత్రం 4.3 శాతం హెచ్చి 6.3 బిలియన్ పౌండ్లకు చేరింది. టాటా మోటార్స్ ప్యాసింజరు, వాణిజ్య వాహనాల ఆదాయం 57.8 శాతం పెరిగి రూ.16,101.6 కోట్లకు చేరింది.



బీఎస్ఈలో షేరు 3.12% లాభంతో రూ.396.05 వద్ద స్థిరపడింది.

కోల్గేట్ లాభంలో 33% వృద్ధి

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం కోల్గేట్- పామోలివ్ ఇండియా రూ.170.65 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.127.82 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 33.50 శాతం ఎక్కువ. అమ్మకాల్లో వృద్ధి ఇందుకు దన్నుగా నిలిచిందని కంపెనీ తెలిపింది. ఇక మొత్తం ఆదాయం రూ.1,002.12 కోట్ల నుంచి 4.01 శాతం వృద్ధితో రూ.1,042.36 కోట్లకు పెరిగింది. జీఎస్‌టీ అమలు ప్రభావాన్ని మినహాయిస్తే.. నికర అమ్మకాలు 19 శాతం పెరిగాయని కోల్గేట్ వెల్లడించింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో మొత్తం వ్యయాలు రూ.811.33 కోట్ల నుంచి 2.57 శాతం తగ్గి రూ.790.47 కోట్లకు పరిమితమయ్యాయి.

మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ లాభంలో 81% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ ఏకీకృత ప్రాతిపదికన రూ.6.78 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాల నికర లాభం రూ.3.74 కోట్లతో పోలిస్తే 81.4 శాతం పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.76.72 కోట్ల నుంచి రూ.85.16 కోట్లకు చేరింది. 2017, డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు ఆదాయం రూ.265.89 కోట్లు ఉండగా.. రూ.21.06 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మధ్యంతర డివిడెండుపై నిర్ణయాన్ని బోర్డు వాయిదా వేసింది.

నేటి మార్కెట్

నేడూ సూచీల నష్టాలు కొనసాగే అవకాశం ఉంది. దీర్ఘకాల మూలధన లాభాల పన్ను ప్రతిపాదనకు తోడు ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతర్జాతీయంగా కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచొచ్చన్న అంచనాలతో విదేశీ మార్కెట్ల సెంటిమెంట్ బలహీనంగా మారింది. నేడు నిఫ్టీకి 10,600 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభించొచ్చని, 10,714 పాయింట్ల దగ్గర నిరోధం ఎదురుకావొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సూచీలు ఒడుదొడుకుల మధ్య కదలాడొచ్చు. వడ్డీ రేట్ల ఆధారిత రంగాల షేర్లు స్తబ్దుగా కదలాడొచ్చని అంటున్నారు. ప్రభుత్వ ద్రవ్య విధానం బాండ్ల రాబడులపై ఆర్‌బీఐ వ్యాఖ్యలు కీలకం కానున్నాయని భావిస్తున్నారు. కంపెనీల అక్టోబరు- డిసెంబరు త్రైమాసిక ఫలితాలపై సైతం మదుపర్లు కన్నేయొచ్చు.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2017–18	2016–17	2017–18	2016–17
హడ్కో	163.59	182.18	1,091.88	929.82
వెస్ట్‌లైఫ్ డెవలప్‌మెంట్	7.75	(1.71)	305.19	241.75
కొచ్చిన్ షిప్‌యార్డ్	113.76	90.35	666.04	619.26
ఐఎఫ్‌సీఐ	(176.87)	(45.17)	655.53	635.55
ఎవరెడీ ఇండస్ట్రీస్	20.94	35.19	373.80	346.90
ఉజ్జీవన్ ఫైనాన్షియల్	29.32	43.94	384.12	371.31
పవర్ గ్రిడ్	2040.83	1930.02	7785.04	6787.51
బాష్	281.00	218.19	3174.18	3027.15

సేవల రంగం దూకుడు

● జనవరిలో వేగవంతమైన వృద్ధి
● కొత్త ఆర్డర్లు పెరగడమే కారణం

దిల్లీ: జనవరిలో సేవల రంగం 3 నెలల్లోనే వేగవంతమైన వృద్ధిని నమోదు చేసింది. కొత్త వ్యాపార ఆర్డర్లు విస్తరించడమే ఇందుకు ప్రధాన కారణమని ఒక ప్రైవేట్ సర్వే వెల్లడించింది. కార్యకలాపాలు, నియామకాలు డిసెంబరు నుంచే పెరిగినా.. దీర్ఘకాల సగటులతో పోలిస్తే బలహీనంగా ఉన్నాయి. నిక్కీ సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ సూచీ జనవరిలో 51.7 పాయింట్లుగా నమోదైంది. డిసెంబరులో ఇది 50.9 వద్ద ఉంది. సేవల రంగంలో కార్యకలాపాలు విస్తరించడాన్ని ఇది సూచిస్తోంది. తటస్థ స్థాయి అయిన 50 ఎగువనే సూచీ నిలిచింది. నవంబరులో సూచీ 48.5 శాతానికి చేరి ప్రతికూల వృద్ధి నమోదు చేసింది. అంతర్లీనంగా డిమాండ్ పరిస్థితులు మెరుగుపడటంతో భారత సేవల రంగం వరుసగా రెండో నెలలోనూ పుంజుకుందని సర్వేను రూపొందించిన ఐహెచ్ఎస్ మార్కిట్ సంస్థ ఆర్థికవేత్త ఆస్నా ధోడియా పేర్కొన్నారు. మొత్తంగా చూస్తే.. దేశీయ సేవల రంగ సంస్థలు వచ్చే 12 నెలలపై ఆశావహంగా ఉన్నట్లు తెలిపారు. ఇక తయారీ వృద్ధిని సూచించే నిక్కీ ఇండియా కాంపోజిట్ ఉత్పత్తి సూచీ జనవరిలో 52.5 పాయింట్లకు తగ్గింది. జనవరిలో ఈ సూచీ 53.0గా ఉంది.

పతంజలి వినియోగదారులకు బీమా సౌకర్యం

బళ్లారి(కర్ణాటక), న్యూస్‌టుడే: పతంజలి దుకాణాల వినియోగదారులకు ఈ నెల 22 నుంచి పరిహార బీమా (లాయల్టీ ఇన్సూరెన్స్) వర్తింపజేయనున్నట్లు పతంజలి రామ్‌దేవ్‌బాబా తెలిపారు. బళ్లారిలో మూడ్రోజుల యోగా శిబిరంలో పాల్గొన్న ఆయనవాల్మీకి కూడలిలో ఏర్పాటైన పతంజలి దుకాణాన్ని పరిశీలించారు. పతంజలి దుకాణ వినియోగదారులకు సంస్థ బీమా కార్డు అందిస్తుందన్నారు. దీనిని పొందిన వినియోగదారులు ఏదైనా ప్రమాదాల్లో మృతి చెందితే రూ.5 లక్షలు, వైకల్యానికి గురైతే రూ.2.50 లక్షల పరిహారం అందజేస్తామన్నారు. ఈ నెల 22 నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందన్నారు. ఈ లాయల్టీ కార్డుల పంపిణీ బళ్లారి నుంచే ప్రారంభమవుతుందన్నారు. దేశ వ్యాప్తంగా 260 మెగా స్టోర్స్ ఉన్నాయన్నారు. ఒక్కొక్క దుకాణం నుంచి తొలివిడతగా వెయ్యి మందికి బీమా కార్డులు అందజేస్తామన్నారు. దీనికోసం వినియోగదారు రూ.120 చెల్లించాల్సి ఉంటుందన్నారు. బీమా వర్తించాలంటే పతంజలి దుకాణంలో ప్రతి ఆరునెలలకు ఒకసారి కనీసం రూ.500 విలువైన వస్తువులు కొనుగోలు చేయాల్సి ఉంటుందని, వస్తువుల కొనుగోలుపై 10శాతం రాయితీ ఉంటుందన్నారు.

నేటి బోర్డు సమావేశాలు

★ హీరో మోటోకార్ప్ ★ లుపిన్ ★ హెరిటేజ్ ఫుడ్స్ ★ సీమెన్స్ ★ పీఎన్‌బీ ★ నాట్కో ఫార్మా ★ అపోలో టైర్స్ ★ బెర్జర్ పెయింట్స్ ★ స్పైస్‌జెట్ ★ ఆర్‌ఈసీ ★ రామ్‌కో సిమెంట్ ★ బ్లూస్టార్ ★ క్యాస్ట్రోల్ ఇండియా ★ కేఈసీ ఇంటర్నేషనల్ ★ అడ్వాన్స్‌డ్ ఎంజైమ్ ★ క్లారిస్ లైఫ్‌సైన్సెస్ ★ డిష్ టీవీ ★ ఫ్యూచర్ రిటైల్ ★ జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ★ కామత్ హోటల్స్ ★ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ★ మోన్‌శాంటో ★ ప్రజ్ ఇండస్ట్రీస్ ★ టాటా కెమికల్స్ ★ థెర్మాక్స్ ★ వింధ్యా టెలీలింక్స్ ★ వర్ధమాన్ టెక్స్‌టైల్స్ ★ వీల్స్ ఇండియా

ఇందూ టెక్ దివాలా ప్రక్రియపై ఎన్‌సీఎల్‌టీ నిర్ణయం వాయిదా

ఈనాడు, హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ నిందితుల జాబితాలో ఉన్న ఇందూ టెక్ జోన్, తీసుకున్న రుణం చెల్లించనందున దివాలా ప్రక్రియ ప్రారంభించాలంటూ ఆర్థిక సంస్థ ఐఎఫ్‌సీఐ లిమిటెడ్ దాఖలు చేసిన దరఖాస్తుపై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ ధర్మాసనం సోమవారం నిర్ణయాన్ని వాయిదా వేసింది. దివాలా పరిష్కార నిపుణుడు(ఐఆర్‌పీ)ని నియమించి, దివాలా ప్రక్రియ ప్రారంభించాలంటూ ఐఎఫ్‌సీఐ దాఖలు చేసిన దరఖాస్తుపై ఎన్‌సీఎల్‌టీ జ్యుడిషియల్ సభ్యులు రాజేశ్వరరావు విత్తనాల, రవికుమార్ దురైస్వామిలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఇందూ టెక్ జోన్‌కు రూ.60 కోట్ల రుణాన్ని మంజూరు చేయగా 2009లో రూ.9.90 కోట్ల రుణాన్ని విడుదల చేసినట్లు ఐఎఫ్‌సీఐ న్యాయవాది వి.కె.సాజిత్ తెలిపారు. రుణదాతల బృందంలో ఐఎఫ్‌సీఐ వాటా 22 శాతమేనని, మిగిలిన రుణదాతలు ఏవీ దరఖాస్తు దాఖలు చేయలేదని ఇందూటెక్ న్యాయవాది వాదించారు. అనంతరం ధర్మాసనం నిర్ణయాన్ని వాయిదా వేసింది.

భారతీ ఎయిర్‌టెల్



రూ.417.75 వద్ద ప్రారంభమై రూ.411.20- 446.75 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.422.35తో పోలిస్తే రూ.17.85 (4.23%) లాభంతో రూ.440.20 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 1,35,91,277.

హెచ్‌డీఎఫ్‌సీ



రూ.1866.10 వద్ద మొదలై రూ.1811.80- 1886 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.1903.85తో పోలిస్తే రూ.80.50 (4.23%) నష్టంతో రూ.1823.35 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 60,82,208 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

యునైటెడ్ బ్రూవరీస్	1243.00
జుబిలెంట్ లైఫ్‌సైన్సెస్	999.00
టెక్ మహీంద్రా	631.20
జనరల్ ఇన్సూరెన్స్	718.35
ఎంసీఎక్స్	697.40
స్ట్రైడ్స్ షాసున్	678.45
టీసీపీఎల్ ప్యాకేజింగ్	570.00
ఎల్ఐసీ హౌసింగ్	495.05
యూనియన్ బ్యాంక్	120.35


52 వారాల కనిష్ఠం (రూ.లలో)

బీఎస్ఈ	822.00
న్యూలాండ్ లేబొరేటరీస్	721.00

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
05/02	5,806	7,069	−1,264	4,890	3,726	1,164
02/02	7,957	7,007	950	4,945	5,454	−509
31/01	7,030	7,167	−137	5,823	4,528	1,295
30/01	6,183	6,288	−106	4,636	4,918	−282

5వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	360	వరంగల్	362
చిల్లరగా(ఒక గుడ్డు)	4.40	విశాఖపట్నం	355
బెంగళూరు	370	చెన్నై	380
6వ తేదీకి		చిత్తూరు	373
విజయవాడ/గోదావరి	350	నమక్కల్	365

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 408.20 (417.95) 2936554
AMBUJA CEMEN 259.10 (259.55) 2745947
ASIAN PAINTS 1134.10 (1137.90) 1263378
AUROBIND PHA 614.00 (605.45) 1848942
AXIS BANK LT 566.25 (564.90) 9318595
BAJAJ AUTO L 3185.55 (3241.30) 585934
BAJAJ FINANC 1604.95 (1628.90) 1472164
BHARTI AIRTE 440.20 (422.35) 13591277
BHARTI INFRA 349.00 (344.85) 2690533
BOSCH LTD 19951.55 (19474.40) 61031
BPCL 475.95 (477.15) 3435092
CIPLA 580.10 (581.15) 797017
COAL INDIA L 294.80 (290.35) 7795465
DR. REDDYS 2116.50 (2123.55) 603638
EICHER MOTOR 27537.95 (27811.75) 48683
GAIL 462.35 (466.45) 3277580
HCL TECH 993.15 (990.90) 1088789
HDFC 1823.35 (1903.85) 6082208
HDFC BANK 1913.85 (1948.00) 1981696
HERO MOTOCOR 3636.40 (3623.45) 319150
HINDALCO IND 246.60 (249.85) 8462501
HINDUSTAN UN 1355.75 (1372.20) 1585136
HPCL 383.85 (374.50) 5467111
ICICI BANK 329.70 (335.10) 17339547
INDIABULLS H 1292.45 (1319.60) 1509725
INDIAN OIL 409.00 (408.65) 6571394
INDUSINDBANK 1713.00 (1761.30) 1600927
INFOSYS LTD 1138.20 (1143.25) 4930110
ITC 279.25 (275.35) 19706340
KOTAK MAHIND 1062.25 (1085.95) 2370531
LARSEN & TOU 1363.65 (1415.45) 3060688
LUPIN 849.10 (847.00) 1407031
M&M 760.50 (770.25) 2018332
MARUTI SUZIK 9080.60 (8990.60) 651062
NTPC LTD 166.25 (165.20) 5941662
ONGC 188.75 (192.70) 7607002
POWER GRID C 196.50 (192.90) 12373481
RELIANCE IND 902.15 (904.35) 8773525
SBI 298.05 (297.35) 18940578
SUN PHARMA 557.45 (551.20) 4734366
TATA CONSULT 3103.20 (3153.65) 1378871
TATA MOTORS 395.80 (383.75) 9876017
TATA STEEL L 664.05 (670.45) 4698722
TECH MAHINDR 629.05 (619.45) 3500770
ULTRATECH 4146.40 (4179.45) 178020
UPL LIMITED 722.50 (733.05) 1661523
VEDANTA LIMI 328.85 (334.30) 12360798
WIPRO 298.75 (300.60) 2194146
YES BANK LTD 343.60 (349.05) 13407059
ZEE ENTERTAI 582.70 (586.10) 1228509

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1627.85 (1678.55) 94627
ACC 1641.15 (1679.80) 486961
ASHOK LEYLAN 129.35 (122.30) 22945256
AVENUE SUPER 1117.30 (1135.10) 544060
BAJAJ FINSER 4918.00 (4935.75) 295940
BANK OFBAROD 157.50 (153.20) 13827865
BEL 150.00 (151.85) 19218194
BHEL 94.85 (93.50) 10260198
BRITANNIA 4616.70 (4726.45) 177420
CADILA HEALT 408.15 (410.85) 474543
COLGATE PALM 1122.65 (1117.65) 1051990
CONTAINER 1341.30 (1337.70) 254172
CUMMINS INDI 807.00 (829.20) 821469
DABUR INDIA 339.10 (344.45) 1270434
DLF LIMITED 228.30 (223.40) 10372280
EMAMI LIMITE 1092.40 (1104.85) 291362
GLAXOSMI CON 6521.95 (6607.95) 6810
GLAXOSMI PHA 2479.00 (2467.85) 14091
GLENMARK PHA 591.55 (589.55) 392893
GODREJ CONSU 1039.00 (1051.60) 307126
HAVELLS INDI 499.05 (509.60) 1543999
HINDUSTAN ZI 292.95 (294.35) 2515888
ICICI PRU LI 423.90 (422.80) 1382538
IDEA CELLULR 87.55 (88.30) 14048237
INTERGLOBE A 1200.20 (1177.80) 422286
JSW STEEL LT 291.25 (299.00) 6863987
LIC HOUS.FIN 516.40 (511.90) 1861979
MARICO LIMIT 295.40 (304.50) 1283740
MCDOWELL 3189.70 (3182.30) 416338
MOTHERSON 354.60 (352.05) 3144428
MRF 68615.10 (69259.40) 12193
NHPC LTD 28.05 (27.85) 8162704
NMDC LTD 132.85 (132.80) 5801912
OIL INDIA 336.60 (345.65) 261006
ORACLE FIN S 4233.90 (4192.80) 45086
P&G HYG&HEAL 9252.20 (9226.75) 3457
PETRONET LNG 247.65 (243.30) 4839007
PIDILITE IND 875.20 (862.80) 524002
PIRAMAL ENTE 2617.00 (2648.65) 216426
PNB 163.70 (161.85) 20688955
POWER FIN CO 112.35 (110.95) 5860031
RURAL ELEC C 147.70 (145.40) 3864556
SAIL 84.80 (83.60) 11446302
SHREE CEMENT 16635.65 (17038.40) 49055
SHRIRAM TRAN 1345.80 (1321.90) 668938
SIEMENS 1269.00 (1292.85) 199908
SUN TV LTD 953.60 (953.15) 822601
TATA POWER 85.00 (84.80) 5165430
TITAN IND 802.30 (822.20) 3079541
TORRENT PHAR 1342.35 (1358.35) 164677

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 191.10 (193.20) 1212397
ADANI ENTERP 199.45 (197.20) 6443758
ADANI POWER 32.70 (32.70) 15384812
ALL BANK 60.55 (61.75) 2834815
AMARA RAJA 779.85 (767.90) 454465
ANANT RAJIND 58.25 (58.80) 1653116
ANDHRA BANK 48.70 (49.15) 2914881
APOLLO HOSPI 1129.55 (1156.95) 276192
APOLLO TYRES 252.00 (249.50) 2874449
APTECH 274.30 (271.85) 892945
BAJAJ ELECT. 432.45 (440.75) 470020
BAJAJ HIND 13.85 (13.35) 5488508
BAJAJ HOLDIN 2742.70 (2781.45) 15267
BALAJI TELE 138.80 (141.25) 137667
BALLARPUR IN 14.80 (14.30) 1731662
BALRAMPUR CH 116.20 (111.30) 4063944
BANK OF MAHA 19.35 (19.15) 990372
BANK OFINDIA 147.20 (147.55) 3706252
BATA INDIA 693.80 (689.70) 435547
BGR ENERGY S 122.55 (123.45) 104042
BHARAT FORGE 714.05 (690.80) 1720727
BHUSHAN STEE 44.60 (46.80) 15077256
BIOCON LTD 605.20 (598.20) 2250781
BOMBAY DYE 222.55 (191.75) 16083954
CANARA BANK 317.65 (311.30) 4525833
CEAT LIMITED 1619.65 (1647.45) 772377
CENTRAL BANK 68.10 (70.35) 420292
CHAMBAL FERT 142.25 (144.45) 376295
CHENNAI PETR 377.30 (382.90) 414702
CITY UNIBANK 157.35 (158.45) 1567702
CORPO BANK 35.60 (36.30) 513707
COX & KINGS 236.35 (235.30) 110139
D B REALTY L 56.00 (58.90) 582756
DELTA CORP L 342.85 (330.50) 3592757
DENA BANK 23.10 (23.75) 2123615
DHANALAKBANK 25.10 (25.30) 1164056
DIVIS LAB 1034.65 (1028.25) 545693
EDELWEISS CA 249.10 (261.40) 4315726
EID PARRY 319.45 (318.65) 97328
EIH 176.55 (182.00) 192219
ESSAR SHIPPI 26.05 (26.35) 70964
ESTER INDUST 65.15 (68.55) 339046
EXIDE INDUST 204.85 (211.75) 2572885
FEDERAL BANK 94.20 (93.30) 8713749
FINOLEX CABL 675.20 (700.85) 66900
G E SHIP LTD 386.95 (380.25) 45294
GAMMON INFRA 3.20 (3.20) 5249743
GATI LIMITED 119.45 (119.80) 1007280
GITANJALIGEM 60.05 (60.80) 2010967
GMR INFRASTR 20.15 (19.25) 85508428
GODREJ IND 557.00 (580.75) 625239
GRASIM IND 1098.05 (1128.85) 1197858
GUJ ALK&CHEM 739.65 (708.55) 180512
GUJ NRE COKE 1.10 (1.15) 1521071
HCL INFOSYS 54.70 (53.85) 3623010
HEXA TECH 370.80 (370.05) 550826
HIMACHAL FUT 26.30 (26.65) 6782305
HOUSING DEV 52.65 (51.35) 17022856
IDBI 60.40 (58.65) 7114915
IDFC 53.25 (52.45) 8944598
IFCI 24.70 (25.35) 21476954
IL&FS TRANS 75.95 (75.30) 322007
INDBULLS REL 202.70 (193.40) 10387324
INDIA CEM 153.10 (153.30) 7389388
INDIAN BANK 340.10 (340.30) 801237
INDO RAMA SY 39.95 (38.70) 224809
INDRAPRASTHA 296.75 (289.15) 4556834
INGERSOLL-R 743.20 (758.05) 15122
IOB 21.05 (21.10) 2369017
IPCA LAB 557.40 (561.90) 46508
IRB INFRA DE 223.65 (224.05) 1217306
J&K BANK 70.65 (69.10) 487446
JAI CORP 161.45 (161.55) 2737232
JAIN IRRIGAT 121.30 (116.90) 19584334
JAYPEE INFRA 14.65 (14.25) 4861853
JET AIRWAYS 690.80 (685.60) 2956211
JINDAL SAW 136.90 (131.00) 3989205
JINDAL STEEL 259.55 (250.55) 13957982
JK LAKSHMI C 409.35 (405.20) 66440
JK PAPER LIM 138.20 (133.35) 856050
JM FINANCIAL 156.05 (158.75) 844458
JP ASSOCIATS 19.05 (17.95) 67254823
JSW ENERGY L 85.15 (84.05) 3499211
JUBILANT FOO 1959.35 (2006.20) 996002
JUBILANT ORG 955.75 (880.10) 2027748
JYOTHY LABS 360.55 (365.30) 220660
JYOTI STRUC 10.05 (10.05) 401267

ఘనం (+)

నిఫ్టీ	5న	మార్పు %
BHARTI AIRTEL	440.20	4.23
TATA MOTORS	395.80	3.14
HPCL	383.85	2.50
BOSCH	19951.55	2.45
POWER GRID CORP.	196.50	1.87
TECH MAHINDRA	629.05	1.55
COAL INDIA	294.80	1.53

గ్రహణం (-)

నిఫ్టీ	5న	మార్పు%
HDFC	1823.35	-4.23
L & T	1363.65	-3.66
INDUSIND BANK	1713.00	-2.74
ADANI PORT	408.20	-2.33
KOTAK MAHI BANK	1062.25	-2.18
INDIABULLS HSG	1292.45	-2.06
ONGC	188.75	-2.05

KARNATA BANK 137.90 (138.85) 2516188
KEC INTL LTD 352.25 (340.20) 370275
KOLTE PATIL 315.45 (329.35) 276966
KPIT CUMMINS 207.10 (197.35) 3747554
L&TFIN.HOLD 158.40 (157.70) 9835428
LAK VIL BANK 129.50 (128.40) 532384
M & M FINANC 438.45 (446.35) 2113143
MANAPPURAM G 105.40 (106.25) 5489351
MMTC LIMITED 54.60 (56.10) 1745868
MPHASIS LTD 856.30 (854.65) 179437
MRPL 117.95 (117.05) 3315310
MTNL 20.95 (21.75) 2583376
NAGARJUNA OI 3.95 (3.95) 561462
NCC LIMITED 112.50 (114.95) 6588853
NETWORK18 FI 51.30 (50.75) 990430
NEULAND LAB 742.95 (788.60) 39391
NIIT LTD 94.50 (96.55) 456329
NIIT TECHNOL 826.75 (790.00) 1065954
OMAXE LTD 228.65 (228.85) 629433
ONMOBILE GLO 47.15 (49.95) 819286
ORIENT PAPER 43.15 (42.10) 392469
ORIENTALBANK 113.55 (112.40) 4103172
PARSVNATH DE 21.70 (22.65) 114936
PATEL ENGG 69.30 (68.55) 295069
PFIZER 2208.85 (2230.35) 13176
POLARIS SOFT 450.95 (412.70) 1570548
POWERTRADING 97.30 (97.15) 1632229
PRAJ IND 96.20 (100.20) 1745094
PRISM CEMENT 126.85 (126.90) 706080
PUNJ LLOYD 21.05 (20.95) 1760546
PUNJAB & SIN 42.15 (42.80) 112199
PURAVANKARA 143.65 (142.25) 449390
PVP VENTURES 7.25 (7.60) 445766
PVR LIMITED 1297.70 (1302.15) 163563
RADICO KHAIT 354.20 (324.80) 3902802
RAJESH EXPOR 817.35 (820.05) 285315
RALLIS INDIA 229.90 (236.10) 450750
RAMCO IND 281.35 (275.20) 94632
RAMCO SYS 461.50 (478.80) 28028
RAMKY INFRA 197.65 (208.05) 173414
RAYMOND 931.90 (933.30) 757335
RELIANCE CAP 456.00 (436.75) 5816240
RELIANCE COM 26.25 (26.10) 93472759
RELIANCE INF 446.20 (449.75) 3037191
RELIANCE POW 42.60 (41.25) 14004413
ROLTA INDIA 60.65 (59.30) 1298036
SAGAR CEMENT 933.35 (962.25) 12946
SAREGAMA 681.90 (678.25) 107489
SHANTHI GEAR 137.20 (140.00) 25078
SHIPPNG CORP 72.00 (74.65) 1210977
SHREE RENUKA 15.25 (14.50) 4195928
SINTEX IND 21.90 (22.15) 4444404
SOBHA DEVELO 536.95 (547.85) 172667
SOUTHINDBANK 27.70 (28.20) 17237756
SRS LIMITED 1.35 (1.40) 291456
STERLITE TEC 323.25 (349.45) 5841033
SUN PHARMA 416.20 (420.95) 267606
SUND FASTNER 505.15 (513.60) 132070
SUZLON ENERG 13.30 (13.60) 40954889
SYND. BANK 66.15 (67.15) 4567088
TATA CHEM 695.45 (692.25) 886221
TATA COFFEE 135.60 (138.85) 616174
TATA COMMUN 619.25 (616.90) 603866
TATA GLOBAL 273.10 (274.85) 6833906
TATA METALIK 822.85 (847.85) 219670
TATA MOT DVR 218.95 (214.20) 3875699
THE INDIAN H 135.95 (129.00) 966551
TORRENT POWE 252.75 (261.45) 1378836
TRIVENI ENGG 62.90 (58.45) 1256734
TTK PRESTIGE 6952.90 (7065.40) 5099
TV TODAY NET 450.95 (449.95) 121588
TV18 BROADCA 54.75 (53.90) 9486324
TVS MOTOR 658.35 (645.25) 1045696
UCO BANK 29.35 (29.60) 649432
UNION BANK 126.65 (127.50) 9548623
UNITECH 7.40 (7.50) 33855525
UNITED BANK 15.40 (15.70) 1344659
UNITED BREWE 1180.20 (1139.85) 1652212
USHA MARTIN 22.65 (23.75) 3931310
VADILAL INDU 831.70 (820.75) 22562
VENKYS 2660.85 (2711.95) 80738
V-GUARD IND 213.00 (215.10) 1253790
VIJAYA BANK 61.10 (60.20) 1533005
VIP 339.40 (341.20) 489667
VOLTAS 596.10 (572.55) 1338482
ZEE LEARN LI 43.35 (43.00) 624704
ZUARI GLOBAL 188.50 (189.05) 87025
ZYDUS WELLNE 976.85 (988.25) 3441

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 876.50 (865.15) 4364
AMAR RAJA BA 778.95 (768.75) 25008
ANDHRA BANK 48.90 (49.20) 375285
ANDHRA CEMEN 11.92 (12.54) 15154
ANDHRA PAPER 313.70 (304.25) 15140
ANDHRA PETRO 67.05 (64.05) 281712
ANDHRA SUGAR 559.65 (612.35) 22422
ANJANI PORTL 205.80 (210.65) 4736
ASTRA MICROW 107.75 (108.15) 88392
AUROBINDO PH 613.65 (605.10) 138011
AVANTEL SOFT 490.25 (510.65) 24219
AVANTI FEEDS 2317.75 (2345.70) 28060
BALAJI AMIN 627.75 (618.90) 11961
BARTRONICS 13.03 (13.35) 17067
BHAGIRA CHEM 278.60 (292.05) 2804
BHAGYA NAG 38.95 (38.85) 11697
BRILLIANT SE 14.20 (14.90) 12134
CAMBRIDGE TE 80.15 (81.75) 3247
CONT COFFEE 280.40 (276.75) 19370
COROMAN FERT 554 (548.05) 40545
CYBERMATE 3.31 (3.36) 107555
CYIENT LIMIT 623.20 (618.50) 12912
DECCAN CEMEN 559.70 (554.55) 422
DIVI'S LAB 1033.25 (1028.90) 27016
DR REDDY 2110 (2122.10) 60256
GATI CORPN 119.30 (120) 171306
GAYATRI PROJ 200.55 (205.05) 12759
GMR INFRASTR 20.20 (19.25) 8312175
GOLDST INFRA 193.10 (199.95) 55751
GRANULES (I) 119.90 (121.40) 296190
GVK POWER 19.50 (20.50) 704509
HBL NIFE POW 55.15 (56.90) 226363
HYD INDUS 1637.15 (1654.40) 3395
IDL INDUSTRS 573.40 (598.05) 2124
ILFS ENGINEE 43.60 (44.15) 11272
INNAREDY COM 4.29 (4.51) 51175
IVRCL INFRAS 4.75 (4.99) 183212
KAKATIYA CEM 312.95 (341.20) 43172
KAVERI SEED 480.60 (493.70) 29275
KCP LTD 128.95 (131.30) 89679
KNR CONSTRUC 299.25 (299.70) 24407
LANCO INDUS 361.10 (363.10) 28662
LANCO INFRAT 1.42 (1.49) 744219
LAURUS LABS 509.35 (510.75) 8536
MADHUCON PRO 28.90 (29.60) 79491
MEGA SOFT 13.52 (14.15) 17447
MIC ELECTRON 7.92 (8.13) 143839
MOLD-TEK.TEC 66 (69.45) 2191
MOLDTK PLA 323.55 (340.45) 30791
NAGARJAGRICH 46.95 (51.10) 117369
NATCO PHARMA 913.50 (924.35) 29740
NAVA BH VENT 149.50 (148.35) 39334
NCC 112.65 (115.15) 473192
NCL IND 247.85 (255.30) 32720
NEHA INTER 7.24 (7.17) 27719
NEULAND LAB 758.10 (787.95) 11095
NIHAR INFO 13.21 (13.85) 50
PANYAM CEMEN 54.60 (55.25) 12114
PENNER IND 57.45 (57) 146465
PIONEER DIST 184.25 (185.50) 4358
PITTI LAMIN 78.40 (80.95) 16039
POKARNA 207.65 (211.70) 7334
PREMIER EXPL 416.10 (408.60) 3832
PRISM CEMENT 127.55 (126.70) 174128
PRUDENTL PHA 4.46 (4.66) 407672
RAIN INDUSTR 337.30 (331.80) 939460
SAGAR CEM 926.50 (962.05) 4995
SAMKRG PIST 307.50 (304.70) 13442
SATVAH. ISPA 23.90 (23.20) 17591
SMS PHARMA 91.10 (92.90) 5305
SREE RAYAL A 57.10 (56.05) 709710
STEEL EXCHAN 30.15 (31.70) 46767
SUJANA METAL 1.43 (1.50) 46426
SUJANA TOWER 4.09 (4.29) 3248
SUJANA UNIVE 1.07 (1.12) 27601
SURYALAKSH.C 82.15 (85.05) 9079
SUVEN PHARMA 198.95 (191.65) 147780
TAJ GVK HOTE 168.55 (166.90) 17560
TANLA 31.30 (31.60) 124111
TERA SOFTWAR 59.10 (60.25) 12190
VAMSHI RUBB 49.10 (49.15) 3551
VICEROY HOTE 16.05 (16.45) 34179
VIMTA LABS 195.20 (199.60) 26901
VISAKA IND 669.70 (694.50) 17167
VIVIMED LABS 80.15 (80.10) 122915
YBRANT DIGIT 5.84 (5.75) 183139
ZENTECH 110.35 (112.65) 43238

రేట్లు యథాతథమే!



ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నేడు, రేపు

దిల్లీ: వరుసగా మూడో సారీ కీలక రేట్లను రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) యథాతథంగా కొనసాగించొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. జోరందుకుంటున్న ద్రవ్యోల్బణం, పెరుగుతున్న చమురు ధరలు, పంటలకు మద్దతు ధర పెంచాలన్న ప్రభుత్వ ప్రణాళికలు ఇందుకు అడ్డంకిగా మారే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆరో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష ఇది. ఉర్జిత్ పటేల్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కూడిన పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) నేడు, రేపు సమావేశం కానుంది. బుధవారం మధ్యాహ్నం సమావేశ నిర్ణయాలను ఆర్‌బీఐ ప్రకటించనుంది. డిసెంబరు సమీక్షలో ద్రవ్యోల్బణ భయాలతో కీలక రేట్లను ఆర్‌బీఐ యథాతథంగా ఉంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి అంచనాలను 6.7 శాతానికి సైతం తగ్గించింది. ఆగస్టులో చివరిసారిగా కీలక రేట్లను పావు శాతం మేర తగ్గించి 6 శాతంగా చేసింది. ద్రవ్యోల్బణం పెరుగుతుండటం, అంతర్జాతీయ విపణిలో ముడిచమురు ధరలు పుంజుకోవడంతో ఈ సారి కూడా ఆర్‌బీఐ కీలక రేట్లను యథాతథంగా ఉంచొచ్చని బ్యాంకర్లు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2017-18 ద్వితీయార్థంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం కూడా ఆర్‌బీఐపై ఒత్తిడి పెంచొచ్చని అంటున్నారు.

టీవీఎస్ తొలి 125సీసీ స్కూటర్ ఎన్‌టార్క్

ధర రూ.58,750



సోమవారం చెన్నైలో కొత్త స్కూటర్‌తో టీవీఎస్ మోటార్ అధ్యక్షుడు, సీఈఓ కె.ఎన్.రాధాకృష్ణన్

చెన్నై: 125 సీసీ స్కూటర్ విభాగంలోకి ప్రవేశిస్తున్నట్లు టీవీఎస్ మోటార్ ప్రకటించింది. ఈ విభాగంలో తొలి స్కూటర్ ఎన్‌టార్క్ ను రూ. 58,750 (ఎక్స్‌షోరూం, దిల్లీ)కి విక్రయిస్తామని తెలిపింది. ఇప్పటికే స్కూటరెట్ స్కూటీ పెప్‌తో పాటు టీవీఎస్ జూపిటర్, వెగో స్కూటర్లను సంస్థ విక్రయిస్తున్న సంగతి విదితమే. 18-24 ఏళ్ల యువతను దృష్టిలో పెట్టుకుని కొత్త స్కూటర్‌ను ఆవిష్కరించినట్లు టీవీఎస్ మోటార్ అధ్యక్షుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) కె.ఎన్.రాధాకృష్ణన్ ఇక్కడ తెలిపారు. ఒక వారంలో దేశవ్యాప్తంగా ఈ వాహనం అందుబాటులోకి వస్తుందని, తొలి ఏడాదిలోనే 2 లక్షల వాహనాలు విక్రయించాలనేది సంస్థ లక్ష్యమన్నారు. స్కూటర్ల విపణిలో తమకు 17 శాతం వాటా ఉందని తెలిపారు.

రిలయన్స్, బీపీ ఆధ్వర్యంలో ఎల్ఎన్‌జీ దిగుమతులు త్వరలో

దిల్లీ: ద్రవరూప సహజవాయువు (ఎల్ఎన్‌జీ) దిగుమతిని త్వరలో ప్రారంభించేందుకు బీపీ పీఎల్‌సీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) సంయుక్తంగా సన్నాహాలు చేస్తున్నాయి. ఈ రెండు సంస్థలు చెరి 50 శాతం వాటా భాగస్వామ్యంతో ఇండియా గ్యాస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసిన సంగతి విదితమే. ఈ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా వినోద్ తహలియాని నియమితులయ్యారు. ఆర్ శ్రేణి క్షేత్రంలోని కేజీ-డీ6 బావుల నుంచి రోజుకు 12 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజవాయువును 2020 నాటికి ఉత్పత్తి చేయాలనేది ఆర్ఐఎల్-బీపీ ప్రణాళిక. దీనికి అదనంగా దిగుమతులూ చేసుకుంటామని వినోద్ తెలిపారు. దేశీయ గ్యాస్ విపణి రాబోయే అయిదేళ్లలో రెట్టింపయ్యే అవకాశం ఉందని, సహేతుక ధరలకు, నమ్మకమైన సరఫరా అందించడమే ధ్యేయమని పేర్కొన్నారు.

ఈనాడు బిజినెస్



“ పరిశ్రమ రంగానికి ఇచ్చిన అన్ని మినహాయింపులు ముగిశాక, కార్పొరేట్ పన్నును 25 శాతానికి తీసుకువస్తాం. కార్పొరేట్ పన్నును నాలుగేళ్లలో 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తామని 2015లో హామీ ఇచ్చాం. అయితే అన్ని మినహాయింపులు ముగిసిపోవాలనే షరతు పెట్టామన్న సంగతి మరచిపోకూడదు. కొన్ని పరిశ్రమలు ఈ మినహాయింపులపై ఆధారపడి ఉండడం వల్ల ఆ మినహాయింపులను మధ్యలో తొలగించడం సబబు కాదు. కాబట్టి అన్ని మినహాయింపులు పూర్తయ్యాకే 25 శాతం పన్ను తీసుకొస్తాం.

- సోమవారం ఫిక్కీ సమావేశంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

ఏప్రిల్ 1 తరవాతే అమలు

- ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 మధ్య షేర్ల విక్రయాలకు మినహాయింపు
- ఎల్‌టీసీజీపై ప్రభుత్వం స్పష్టీకరణ

దిల్లీ

ప్రతిపాదిత దీర్ఘకాల మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను 2018 ఏప్రిల్ 1, ఆ తరవాత విక్రయించే షేర్లకు మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. మూలధన లాభాలను లెక్కవేయడం కోసం.. కొనుగోలు చేసిన ధర లేదా జనవరి 31న ధర.. ఈ రెండింటిలో ఏది ఎక్కువగా ఉంటే దానిని తీసుకుని ఏప్రిల్ 1 లేదా ఆ తరవాత ఎప్పుడు అమ్మితే, అప్పటి ధరతో పోలుస్తారు. రూ.లక్షకు మించిన దీర్ఘకాల మూలధన లాభాలపై 10 శాతం పన్ను విధించనున్నట్లు బడ్జెట్ (2018-19) ప్రసంగంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రతిపాదించిన సంగతి విదితమే. '2018 ఏప్రిల్ 1న, ఆ తరవాత జరిగే షేర్ల బదిలీలపై కొత్త పన్ను విధానం వర్తిస్తుంది. ఈ ప్రతిపాదన వెల్లడించిన 2018 ఫిబ్రవరి 1 నుంచి 2018 మార్చి 31, మధ్య జరిగే షేర్ల విక్రయాలకు సెక్షన్ 10, క్లాజ్(38) కింద మినహాయింపు వర్తిస్తుంద'ని తరచుగా అడిగే ప్రశ్నలు - సమాధానాలు (ఎఫ్ఏక్యూ) రూపంలో ప్రభుత్వం వివరించింది.

ప్రస్తుతం స్వల్పకాలిక మూలధన లాభాలపై 15 శాతం పన్ను అమలవుతోంది. షేర్లు కొనుగోలు చేసి, ఏడాది తరవాత విక్రయిస్తే ఎలాంటి పన్నూ విధించడం లేదు. తాజాగా వీటిపై 10 శాతం పన్ను విధించాలని బడ్జెట్ ప్రతిపాదించింది. ఈ పన్ను నమోదిత కంపెనీల షేర్లు, ఈక్విటీ ఆధారిత ఫండ్‌లపై వర్తిస్తుంది. అయితే లాభం రూ.1 లక్ష దాటితేనే ఈ పన్ను పడుతుంది.

ఎల్‌టీసీజీని ఇలా లెక్కవేస్తారు

ఉదాహరణకు మీరు 2017 జనవరి 15న ఒక్కో షేరు రూ.100తో కొన్నారనుకుందాం. 2018 జనవరి 31న ఆ షేరు రూ.200 వద్ద స్థిరపడిందనుకుందాం. 2018 ఏప్రిల్ 1న ఆ షేరు రూ.250కు చేరిందనుకుందాం.

ఇక్కడ షేరు కొన్న ధర, 2018 జనవరి 31న ముగింపు ధరల్లో రెండోది ఎక్కువగా ఉంది కాబట్టి.. దానిని ఏప్రిల్ 1 నాటి ధర నుంచి తీసివేస్తే వచ్చేదే (+50) మూలధన లాభం లేదా నష్టం. ఒక వేళ కొన్న ధర ఎక్కువగా ఉంటే.. దానిని ఏప్రిల్ 1 నాటి ధర నుంచి తీసివేయాలి. ఆయా సందర్భాల్లో నష్టం వస్తే పన్ను ఏమీ ఉండదు. లాభం వచ్చి.. అది రూ. లక్ష కంటే ఎక్కువగా ఉంటే.. ఆ ఎక్కువగా ఉన్న మొత్తంపై 10 శాతం పన్ను చెల్లించాలి. 2018 జనవరి 31 వరకు వచ్చిన లాభాలపై ఎలాంటి పన్ను ఉండదు కాబట్టే ఈ లెక్కలన్నీ.

కాగా, 2018 ఫిబ్రవరి 1 నుంచి 2018 మార్చి 31 మధ్య జరిగే షేర్ల విక్రయాల వల్ల వచ్చే మూలధన నష్టాన్ని రిటర్నుల సమయంలో పరిగణనలోకి తీసుకోరనీ ఎఫ్ఏక్యూలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రపంచ మార్కెట్ల ప్రభావం వల్లే ఇక్కడా నష్టాలు: అధియా

బలహీన అంతర్జాతీయ సెంటిమెంటు నేపథ్యంలోనే మార్కెట్లు నష్టపోతున్నాయి మినహా దీర్ఘకాల మూలధన లాభాల పన్ను విధించడం వల్ల కాదని ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా పేర్కొన్నారు. ఎల్‌టీసీజీపై 10 శాతం పన్ను అన్నది కూడా తక్కువేనని.. నమోదు కాని స్క్రిప్‌ల విక్రయాలు, స్థిరాస్తుల విక్రయాలపై పన్ను 20 శాతంగా ఉందని ఆయన గుర్తు చేశారు.



అయితే అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల పాలవుతున్న సమయంలో ఈ నిర్ణయమూ వెలువడడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రపంచ సూచీలు 3.4 శాతం దాకా నష్టపోవడం వల్ల మన స్టాక్ మార్కెట్లపై కూడా ప్రభావం పడింది మినహా ఎల్‌టీసీజీ పన్ను ప్రభావం కాదని అధియా వివరించారు.

కొంత ఆదాయాన్ని త్యాగం చేశాం: వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) అమలు కోసం ప్రభుత్వం కొంత ఆదాయాన్ని త్యాగం చేసిందని అధియా పేర్కొన్నారు. భవిష్యత్‌లో జీఎస్‌టీకి మరింత ఆదరణ లభిస్తుందన్న అంచనాలతోనే ఆ త్యాగానికి సిద్ధపడ్డామని తెలిపారు. సంస్థాగత రంగంలో జీఎస్‌టీ అమలు వల్ల ప్రయోజనాలు కనిపిస్తున్నాయని.. కంపెనీల బ్యాలెన్స్ షీట్లలో అది ప్రస్ఫుటమవుతోందని ఆయన అన్నారు. 'జీఎస్‌టీ వల్ల ఎంత ఆదాయాన్ని కోల్పోయామో మాకు తెలుసు. అది వేరే ఇతరుల బ్యాలెన్స్ షీట్లలోకి వెళ్లింద'ని చెప్పుకొచ్చారు.

ఒక్కటి మినహా ఐఫోన్ల ధరలన్నీ పెరిగాయ్

దిల్లీ: దిగుమతి చేసుకునే సెల్‌ఫోన్లపై కస్టమ్స్ సుంకాన్ని 15 నుంచి 20 శాతానికి పెంచినందున, యాపిల్ సంస్థ తమ ఐఫోన్ల ధరలను రూ.3,210 వరకు పెంచింది. సోమవారం నుంచే కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. ఐఫోన్ టెన్ (x) 256 జీబీ గరిష్ఠ విక్రయధరను రూ.3,210 పెంచి రూ.1,08,930 చేసింది. ఐఫోన్ 6 (32 జీబీ) ధరను 3.6 శాతం (రూ.1,120) పెంచి రూ.31,900గా నిర్ణయించింది. అయితే విడిభాగాలు దిగుమతి చేసుకుని, దేశీయంగా బిగిస్తున్న (అసెంబ్లింగ్ చేయిస్తున్న) ఎస్ఈ మోడల్ ధరను మాత్రం సంస్థ మార్పు చేయలేదు. ఈ మోడల్ 32 జీబీ ధర రూ.26,000, 128 జీబీ ధర రూ.35,000. యాపిల్ వాచీ ధరలను కూడా 7.9 శాతం (రూ.2,510) వరకు పెంచింది. యాపిల్ వాచీ శ్రేణి 3 (38ఎంఎం) ధర రూ.32,380 కాగా, 42 ఎంఎం ధర రూ.34,410.



✦ గత డిసెంబరులో కస్టమ్స్ సుంకాన్ని 10 నుంచి 15 శాతానికి పెంచినపుడు, తమ ఉత్పత్తుల ధరలను 2.5 శాతం మేర యాపిల్ పెంచిన సంగతి విదితమే.

దేశీయ విమానయాన వృద్ధిలో అగ్రస్థానం మనదే

వరుసగా ఇది మూడో ఏడాది: ఐఏటీఏ నివేదిక

దిల్లీ: శరవేగంగా వృద్ధి చెందుతున్న దేశీయ విమానయాన విపణుల్లో అగ్రస్థానం భారత్‌దేనని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) నివేదిక వెల్లడించింది. వరుసగా మూడో ఏడాదీ (2017) భారత్ ఈ ఘనత సాధించింది. భారత్‌లో దేశీయ ప్రయాణికుల సంఖ్య 17.5% పెరిగిందని, చైనాలో ఇది 13.3 శాతమని వివరించింది. భారత్‌లో ఆర్థిక వృద్ధికి తోడు, విమానాశ్రయాల విస్తరణ, కొత్త విమానయాన సంస్థల ప్రవేశం ఇందుకు ఉపకరించాయని పేర్కొంది. గత డిసెంబరులో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్యలో వృద్ధి 17.4శాతంగా నమోదైంది. విమాన ఇంధన ధర (ఏటీఎఫ్)కు తోడు ఇతర వ్యయాలు కూడా అధికమవుతున్నందున, విమాన ఛార్జీల ధరలు పెరగొచ్చని, అందువల్ల 2017తో పోలిస్తే, 2018లో దేశీయంగా వృద్ధి కాస్త తగ్గవచ్చని ఐఏటీఏ అంచనా వేసింది. అంతర్జాతీయంగా 2017లో ప్రయాణికుల సంఖ్య 7.6% వృద్ధి చెందిందని, గత పదేళ్ల సగటు 5.5 శాతమేనని తెలిపింది. ప్రతి దేశం ఆర్థికంగా వృద్ధి చెందడానికి తోడు, విమానయాన సంస్థలు ప్రకటించే పథకాలూ ఇందుకు కారణమవుతున్నాయని వివరించింది.



ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సేవలు మే నుంచి

- దశలవారీగా 650 శాఖలు ● రూ.1,450 కోట్ల పెట్టుబడి

దిల్లీ: ఇండియా పోస్ట్ పేమెంట్స్‌బ్యాంక్ దేశవ్యాప్తంగా తమ శాఖల ఏర్పాటును మే నుంచి ప్రారంభించనుంది. ఇందుకోసం రూ.1,450 కోట్ల పెట్టుబడి పెడతామని తపాలా కార్యదర్శి అనంత నారాయణ్ నందా తెలిపారు. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, సిబ్బందికి శిక్షణ, అదనపు సిబ్బంది వంటి వాటికి ఈ మొత్తం అవసరమని పేర్కొన్నారు. ఏప్రిల్ నాటికి తమ వ్యవస్థలన్నీ సిద్ధమవుతాయని, మే-సెప్టెంబరు మధ్య బ్యాంకు 650 శాఖలను దేశవ్యాప్తంగా ప్రారంభిస్తామని వివరించారు. దేశంలోని 1.55 లక్షల తపాలా కార్యాలయాలు, ఈ బ్యాంకు శాఖలకు సహకరిస్తాయని వెల్లడించారు. ఇంటివద్దకే బ్యాంకు సేవలు అందించే సామర్థ్యం తమకు ఉందని వెల్లడించారు. ఇప్పటికే తపాలా కార్యాలయాల్లో 17 కోట్ల పొదుపు ఖాతాలున్నాయని, వీటికి కొన్ని సేవలను పోస్టల్ పేమెంట్స్‌బ్యాంక్ నుంచి అందించవచ్చని తెలిపారు. ఈ బ్యాంకు కోసం మొత్తం 3,500 మంది సిబ్బందిని నియమించుకుంటున్నామని వివరించారు. 2015లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పేమెంట్స్‌బ్యాంకుల ఏర్పాటుకు సూత్రప్రాయంగా అనుమతులివ్వగా, ఇప్పటికి ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, పేటీఎం బ్యాంకులు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.



పన్నుల విధింపునకు సంబంధించి చట్టంలో తొమ్మిది ప్రాథమిక సూత్రాలు ఉన్నాయి. ఆదాయ స్థాయిలకు అనుగుణంగా ప్రజలకు పన్ను విధించడం ఇందులో ఒకటి. ఒక వ్యక్తికి ఆదాయం ఎక్కువగా ఉంటే.. పన్ను ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ మధ్యస్థంగా ఉంటే ఆ మేరకు పన్నులు కట్టాలి. అదే తక్కువగా ఆర్జిస్తే, తక్కువగానైనా చెల్లించాల్సి రావొచ్చు.. ఒక్కోసారి పన్ను చెల్లించాల్సిన అవసరమూ ఉండకపోవచ్చు. 'ఎవరైనా ఆదాయ స్థోమతకు తగ్గట్లుగానే ఆభరణాలు ధరించాల'ని చాణక్య నీతి కూడా చెబుతోంది. ఈ రెండింటి ప్రకారం చూస్తే.. ఎవరు ఎంత మేర పన్ను చెల్లించాలో నిర్ణయించాల్సింది ఆదాయం ఆధారంగానే అనే విషయం మనకు అవగతమవుతోంది. అయితే జీఎస్‌టీ విధానంలో ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఆదాయ సామర్థ్యాలతో సంబంధం లేకుండా, అందర్నీ ఒకే తాటికి కట్టేసి అధికారులు జరిమానాలు విధిస్తున్నారనే మాట వినిపిస్తోంది.

ఒక జీఎస్‌టీ అధికారి ఓ కిరాణా దుకాణంలోకి వినియోగదారునిగా అడుగుపెట్టాడు. కొన్ని సరుకులు కొన్నాక, చెల్లించిన డబ్బులకు రశీదు ఇవ్వమని దుకాణదారుని అడిగాడు. అయితే ఆ సమయంలో గిరాకీ ఎక్కువగా ఉండటంతో రశీదు ఇవ్వలేనని ఆయన చెప్పాడు. దీంతో అధికారి ఆ దుకాణదారుకి రూ. 20,000 జరిమానా విధించాడు. మరి ఈ స్థాయిలో ఓ చిన్న వ్యాపారికి పన్ను విధించడం ఎంత వరకు సమంజసం.



జీఎస్‌టీ అధికారులూ.. చిన్న వ్యాపారులను కనికరించండి

- నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.20,000 జరిమానా
- రోజువారీ అమ్మకాల కంటే ఇది ఎక్కువ ● ముందు హెచ్చరించండి.. మారకుంటేనే చర్యలకు దిగండి

ఆలోచించండి సారూ..



సతీష్ సరాఫ్

చార్టర్డ్ అకౌంటెంట్

వ్యాపారులు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు వినియోగదారుని రూపంలో (మఫ్టీలో) ఏదేని దుకాణం లేదా వ్యాపార సంస్థలోకి అడుగుపెట్టే అధికారం జీఎస్‌టీ అధికారులకు ఉంది. సరకులు కొన్నాక, జీఎస్‌టీ నిబంధనలకు అనుగుణంగా వ్యాపారి నడుచుకుంటున్నట్లు గుర్తిస్తే, సరకులను తిరిగి ఇచ్చేసి, డబ్బులను అధికారులు వెనక్కి తీసుకుంటారు. ఒకవేళ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే తగువిధంగా జరిమానా విధిస్తారు. ఒకవేళ ఆ ఉల్లంఘనకు ఇంత మొత్తం జరిమానా అని చట్టంలో పేర్కొనకపోతే, సాధారణ జరిమానా కింద రూ.20,000 విధిస్తారు. జరిమానా విధింపు విషయంలో అధికారులు చాలా వరకు ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన ముమ్మాటికీ తప్పే.. అందుకు జరిమానా విధించాల్సిందే. ఈ విషయాన్ని ఎవరూ కాదనరు. అయితే కిరాణా దుకాణం లేదా చిన్న వ్యాపార సంస్థల్లో రోజువారీ అమ్మకాల మొత్తమే రూ. 20,000 ఉండకపోవచ్చు. మరి ఇలాంటివాళ్లని రూ.20,000 జరిమానా చెల్లించమని అడగడం సబబు కాదేమోనన్న అభిప్రాయం వినిపిస్తోంది. అదే పెద్ద వ్యాపారులు, ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తున్న వాళ్లకు రూ.20,000 జరిమానా విధించడాన్ని పట్టించుకోనవసరం లేదు.

భారీ జరిమానాల వల్ల దుష్పరిణామాలు

- చిన్న వ్యాపారుల జీవనంపై ప్రతికూల ప్రభావం పడుతుంది.
- సాధారణంగా ప్రజల దగ్గర నుంచి పన్నుల వసూలు చేసి ప్రభుత్వానికి ఆ మొత్తాన్ని వ్యాపారులు కడుతుంటారు. భారీగా జరిమానా విధిస్తే.. దానిని ధరల పెంపు రూపంలో వినియోగదారులకు బదిలీ చేసేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తారు. కొన్ని సందర్భాల్లో జరిమానా మొత్తాన్ని కూడా వినియోగదారుల దగ్గర నుంచి వసూలు చేసేందుకు ప్రయత్నించవచ్చు. ఇలా చేయడం జీఎస్‌టీ ఉద్దేశానికే విరుద్ధం.
- పన్ను పరిధిలోకి రాకుండా పన్ను ఎగవేతలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తారు. ఇదే జరిగితే దేశీయ రిటైల్ రంగం పరోక్షంగా దెబ్బతింటుంది.

ఆచరించండి బ్రదరూ..

కాలం మారే కొద్ది పరిస్థితులు మారుతుంటాయి. ఆ పరిస్థితులకు తగ్గట్లుగా ప్రతి ఒక్కరూ మారాల్సిందే. ఇందుకు చిన్న, పెద్ద, ధనిక, పేదా ఎవరూ మినహాయింపు కాదు. మారే ఇష్టం లేదని మనం చెప్పలేం. చెప్పకూడదు కూడా. ముఖ్యంగా ప్రభుత్వ నియమ నిబంధనల్లో చోటుచేసుకున్న మార్పులను తప్పక పాటించాల్సిందే. అది ప్రజలైనా.. వ్యాపారులైనా. లేకుంటే జరిమానా కట్టాల్సిందే. జీఎస్‌టీ విషయంలోనూ అంతే. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అతిపెద్ద పన్ను సంస్కరణ ఇది. దీనిని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ముఖ్యంగా వ్యాపారులపై. అందుకే జీఎస్‌టీలో నియమ నిబంధనలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించండి. ఒకేసారి అన్నింటినీ ఆచరించడం అసాధ్యం కావచ్చు.. కాని క్రమక్రమంగా ఒక్కో నిబంధనా పాటించుకుంటూ వద్దాం. దేశ ఆర్థిక వ్యవస్థ మన భుజస్కంధాలపై ఉంది. నియమ నిబంధనలు పాటించి, మన ఆదాయంలో కొంత మొత్తాన్ని పన్నుల రూపేణా దేశానికి తిరిగి ఇద్దాం. దేశ వృద్ధికి పాటుపడదాం.

ఎందుకు పాటించడం లేదంటే..

ఎవరో కొంత మంది మినహా చిన్న వ్యాపారులెవరికీ నియమ నిబంధనలు ఉల్లంఘించాలనే ఉద్దేశం ఉండదు. అయితే ఆదాయం తక్కువగా ఉంటుండటం, జీఎస్‌టీని తొలి దశలో ఆచరించే వీలు లేకపోవడం లాంటి పరిస్థితుల వల్ల, వీళ్లు నిబంధనలు పాటించలేక పోతున్నారు. మరికొన్ని కారణాలూ ఉన్నాయి. అవేమిటో చూద్దాం.

- ✦ చిన్న వ్యాపారుల్లో చాలా మంది నిరక్షరాస్యులు, అసంఘటిత వర్గానికి చెందినవారు.
- ✦ ఒక వ్యక్తి లేదా కుటుంబ సభ్యుల సాయంతో చాలా మంది వ్యాపారాన్ని నిర్వహిస్తుండటం.
- ✦ చాలా ఏళ్లుగా రశీదు ఇచ్చే అలవాటే లేకపోవడం. కొత్త పన్నుల విధానం ప్రకారం రశీదు ఇవ్వడానికి అలవాటు పడాలంటే కొంత సమయం పడుతుంది.
- ✦ జీఎస్‌టీపై చిన్న వ్యాపారులకు ఇప్పటివరకు తగినంత శిక్షణ, అవగాహనను ప్రభుత్వం కల్పించకపోవడం.
- ✦ వినియోగదారుల సంఖ్య ఎక్కువగా ఉంటుండటం, వాళ్లకు విక్రయించే సరుకుల విలువేమో తక్కువగా ఉంటుండటం.

అధిగమిద్దాం ఇలా..

- ✦ సీజీఎస్‌టీ నిబంధనల ప్రకారం.. ప్రతి ఒక్క వినియోగదారుని దగ్గర నుంచి అమ్మకం విలువ రూ.200 కంటే తక్కువగా ఉంటే, ఆ రోజు చివర్లో మొత్తం అమ్మకాలకు కలిపి ఒకే రశీదు ఇవ్వొచ్చు.
- ✦ చిన్న వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే ముందుగా ఒకట్రెండు సార్లు హెచ్చరిక లేఖ జారీ చేయాలి. తరవాతే జరిమానా విధించాలి.
- ✦ టర్నోవరు ఆధారంగా జరిమానాలకు శ్లాబ్‌లను తీసుకొని రావాలి.
- ✦ జరిమానా విధించే ముందు చిన్న వ్యాపారుల ఆదాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలి.
- ✦ నియమ నిబంధనల పాటింపు, జరిమానా తదితర అంశాలపై చిన్న వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించాలి.

ప్రస్తుతం రశీదు ఇవ్వాల్సిన నగదు పరిమితి చాలా తక్కువగా ఉంది. దీనిని కనీసం రూ.500కి పెంచే విషయాన్ని పరిశీలించాలి.

నడవడికను మార్చడంలో... ధ్యానం పాత్ర అంతంతే!



లండన్: నడవడికను తీర్చిదిద్దడంలో ధ్యానం పాత్ర చాలా తక్కువని తాజా అధ్యయనంలో తేలింది. బ్రిటన్‌లోని కోవెంట్రీ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. ఇతరుల బాధను అర్థంచేసుకోవడం, వారిపై కరుణను చూపడం లాంటి గుణాలను ధ్యానంతో పెంపొందించుకోవచ్చని ఇదివరకటి పరిశోధనల్లో తేలింది. ప్రస్తుతం ఈ ఫలితాలను పరిశోధకులు లోతుగా విశ్లేషించారు. దీంతో కోపం, పక్షపాతాలను తగ్గించడం, సామాజిక సంబంధాలను మెరుగు పరచడంలో ధ్యానం పాత్ర అంతగా ఉండటంలేదని వెలుగులోకి వచ్చింది. 'ప్రాథమిక దశలో ధ్యానంతో నడవడికలో కొంత సానుకూల ప్రభావం ఉన్నట్లు కనిపిస్తుంది. అయితే ధ్యానం కాకుండా వేరే వ్యాయామం చేసినవారితో పోల్చినప్పుడు ఇలాంటిదేమీ ఉండదని స్పష్టం అవుతుంది'అని పరిశోధనలో పాలుపంచుకున్న మిగ్యూల్ ఫారియాస్ తెలిపారు. ఇదివరకటి అధ్యయనాల సానుకూల ఫలితాలకు పరిశోధన విధానాల్లో లోపాలు, పక్షపాతం కారణమై ఉండొచ్చని ఆయన వివరించారు.

వెన్నెముక బ్యాటరీతో వేరబుల్ పరికరాల తయారీ!



న్యూయార్క్: ధరించడానికి వీలుగా ఉండే(వేరబుల్) ఎలక్ట్రానిక్ పరికరాల సామర్థ్యాన్ని మరింత మెరుగుపర్చే దిశగా శాస్త్రవేత్తలు ముందంజ వేశారు. అవసరానికి అనుగుణంగా వంచుకోగల లిథియం అయాన్ ఘటాన్ని అభివృద్ధి చేశారు. మానవ వెన్నెముక ఆకారంలోని ఈ బ్యాటరీ(ఘటం).. వేరబుల్ పరికరాల తయారీరంగాన్ని కొత్త పుంతలు తొక్కించగలదని శాస్త్రవేత్తలు విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు. స్మార్ట్ గడియారాలు, సెన్సర్లు, స్మార్ట్ దుస్తులు వంటి పరికరాలకు ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉంది. వాటిలో ఉపయోగించేందుకు అనువుగా ఉన్న. . అధిక శక్తిని నిల్వ చేసుకునే బ్యాటరీలు మాత్రం ఎక్కువగా లభించడం లేదు. ఇందుకు పరిష్కారమార్గంగా అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు వెన్నెముక ఆకారంలోని లిథియం అయాన్ బ్యాటరీ నమూనాను అభివృద్ధి చేశారు. ఎలక్ట్రానిక్ పరికరాల్లో వినియోగించేందుకు అది అనుకూలంగా ఉంటుందని తెలిపారు. సాధారణ బ్యాటరీలతో పోలిస్తే దీని శక్తి నిల్వ సామర్థ్యం 85 శాతం అధికమని వెల్లడించారు.

పాలపుంత ఆవల గ్రహాలు


★ తొలిసారి గుర్తించిన శాస్త్రవేత్తలు



వాషింగ్టన్: ఇదేమీ సైన్స్ కాల్పనిక సాహిత్యం కాదు.. నిజంగా ఇది నిజం! ఖగోళ భౌతికశాస్త్రవేత్తలు తొలిసారిగా మన పాలపుంత గెలాక్సీ ఆవల గ్రహాలను కనుగొన్నారు. మనకు 380 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలోని ఒక నక్షత్ర మండలంలో వీటి ఉనికిని పసిగట్టారు. అంతేకాదు.. వాటి పరిమాణాన్నీ కొలిచారు. ఆ గ్రహాలు.. మన చందమామ మొదలు గురుగ్రహం స్థాయి వరకూ ఉన్నాయని తేల్చారు. అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా)కు చెందిన 'చంద్ర' ఎక్స్‌రే అబ్జర్వేటరీ అందించిన డేటాను ఉపయోగించి, ఓక్లహామా విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ ఘనత సాధించారు. ఇప్పటివరకూ మన సౌర కుటుంబం ఆవల ఉన్న ఇతర నక్షత్రాల చుట్టూ తిరుగుతున్న దాదాపు 3వేల గ్రహాలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అవన్నీ పాలపుంత గెలాక్సీలోనివే. ఇతర నక్షత్ర మండలాల్లోని గ్రహాలను పరిశీలించడం ఊహకందని విషయం. అయితే ఒక్లహామా వర్సిటీ శాస్త్రవేత్తలు.. మైక్రోలెన్సింగ్ విధానాన్ని అనుసరించి, దీన్ని సాకారం చేశారు. ఇది ఖగోళ సంబంధమైన ఒక పోకడ. ఇందులో గురుత్వాకర్షణ శక్తి వల్ల వంపునకు గురైన కాంతిని ఉపయోగించి, గ్రహాలను కనుగొంటారు. "ఈ ఆవిష్కారం ఉత్తేజాన్ని కలిగిస్తోంది. మన గెలాక్సీ అవతల గ్రహాలను కనుగొనడం ఇదే మొదటిసారి" అని పరిశోధనలో పాలుపంచుకున్న ప్రొఫెసర్ షిన్యు డాయ్ తెలిపారు. ఇప్పటివరకూ మైక్రోలెన్సింగ్‌ను ఉపయోగించి పాలపుంతలో కొన్ని గ్రహాలను కనుగొన్నారు. ఇతర గెలాక్సీల్లో శోధనకూ ఇది ఉపయోగపడుతుందని తాజాగా వెల్లడైంది.

పూల మొక్కలు 25.6 కోట్ల ఏళ్ల నాటివి!

★ బ్రిటన్‌లో తాజా అధ్యయనం వెల్లడి




లండన్: పూల మొక్కలు సుమారు 149-256 మిలియన్ సంవత్సరాల క్రితం పుట్టి ఉండవచ్చని బ్రిటన్ శాస్త్రవేత్తల తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ అధ్యయన వివరాలను సోమవారం నాడిక్కడ ప్రచురించారు. పూల మొక్కల శిలాజాల ప్రాతిపదిక నిర్వహించిన అధ్యయనాలు... అనంతరం వాటి అణువులపై చేసిన పరీక్షల అనంతరం పేర్కొన్నట్లు అవి మరీ పురాతనమైనవో... అలాగనీ ఇటీవలి కాలానివో కాదని బ్రిటన్ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. పువ్వుల మొక్కల పరిణామక్రమానికి సంబంధించిన అణువుల గణాంకాలు(మాలిక్యులర్ డేటా)... శిలాజాల వివరాలను పోల్చి చూస్తే చాలా తేడాలు గోచరిస్తున్నట్లు వారు తెలిపారు. అసలు నేటికీ చాలామందికి అనూహ్యంగా ...ఏదో మిస్టరీలా ఉన్న పూలమొక్కలు ఏనాటివనే విషయాన్ని నిర్ధారించుకునేందుకు వాటి జన్యుక్రమాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేసినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. వాటి విశ్వ జన్యురాశిలో ఆకస్మిక పరివర్తనాల(ఉత్పరివర్తనాలు) ఎంత వేగంతో వృద్ధి చెందుతాయనే అంశాన్ని పరిశీలించామన్నారు. అనంతరం ఇప్పటికే అందుబాటులో ఉన్న పూల మొక్కల జన్యుక్రమ గణాంకాలను పరిశీలించి... రెండింటినీ విశ్లేషించినట్లు తెలిపారు.

విశ్వసనీయత పెంపే మా ఘన విజయం

- సంక్షోభంలోనూ ప్రగతి సాధించాం
- మధ్య తరగతికి అండగా ఉంటున్నాం
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

దిల్లీ



ప్రపంచవ్యాప్తంగా భారతదేశంపై విశ్వసనీయత పెంచడమే మోదీ ప్రభుత్వం సాధించిన ఘన విజయమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. సంక్షోభ సమయంలో అధికారం చేపట్టి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం మరో విశేషమని తెలిపారు. 'సీఎన్‌బీసీ' టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దేశ ఆర్థిక రంగ ప్రగతి, బడ్జెట్ తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. వాజ్‌పేయీ ప్రభుత్వంలో స్వర్ణ చతుర్భుజి, నూతన టెలికాం విధానం వంటి చెప్పుకోదగ్గ అంశాలు ఉండగా, మోదీ ప్రభుత్వంలో ఏమున్నాయని ప్రశ్నించినప్పుడు విశ్వసనీయత పెంచడమే పెద్ద విజయమని అన్నారు. "ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ఠ దిగజారుతున్న సమయంలో అధికారంలోకి వచ్చాం. విధానాలు లోపభూయిష్టంగా ఉండేవి. అవినీతికరమైన సమాజమన్న ముద్రపడింది. నిర్ణయాలు తీసుకోలేని అసమర్థత నెలకొందన్న అభిప్రాయమూ ఉండేది. అదే సమయంలో ప్రపంచంలో ఆర్థిక మాంద్యం నెలకొంది. మోదీ ప్రభుత్వం వచ్చాక పరిపాలనను, ఆర్థిక వ్యవస్థను సమ్మిళితం చేసి 'ఆర్థిక పరిపాలన'ను తీసుకొచ్చాం. కఠిన నిర్ణయాలు తీసుకున్నాం. సంక్షోభంలోనూ ఆర్థిక ప్రగతి సాధించాం. సంస్కరణల గురించి గతంలో మేధావులే మాట్లాడేవారు. ఇప్పుడు జనమే చర్చించుకుంటున్నారు. పన్నులు చెల్లింపుదారుల సంఖ్య పెరుగుతుందా అని ప్రజలు అనుకునేవారు. సంఖ్యను పెంచి చూపించాం. రాయితీలు పేదలకు అందుతాయా అని సందేహించేవారు. ఆధార్‌తో అనుసంధానం చేసి అర్హులకు అందేలా చేశాం. 17 పన్నులు, 23 రకాల సెస్సులను ఒకే ఒక్క పన్నుగా కుదించాం. పన్ను మదింపులోనూ మార్పులు తెచ్చాం. పన్ను అధికారి, వ్యక్తుల మధ్య ప్రత్యక్ష సంబంధం లేకుండా అన్నీ ఆన్‌లైన్‌లో జరిగేటట్టు చూస్తున్నాం. ఇవన్నీ మా ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల"ని వివరించారు.

మధ్యతరగతికి పలు మినహాయింపులు

బడ్జెట్‌లో మధ్యతరగతి వారికి భారం పడింది కదా అన్న ప్రశ్నకు జైట్లీ సమాధానం వేతనాలు తీసుకుంటున్నవారే దేశంలో నిజాయతీపరులైన పన్ను చెల్లింపుదారులని అన్నారు. వారిని కాపాడుకోవాలని చెప్పారు. గత నాలుగేళ్లుగా ఆదాయపు పన్నులో వారికి పలు మినహాయింపులు ఇస్తున్నట్లు వివరించారు.

- మొదటి సంవత్సరంలో పన్ను పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.2.5 లక్షలకు పెంచాను. సెక్షన్ 80సీ పరిమితిని రూ.1.5లక్షల నుంచి రూ.2లక్షలకు పెంచాను.
- రెండో సంవత్సరంలో ప్రయాణ భత్యం మినహాయింపును రూ.800 నుంచి రూ.1600కు పెంచాను.
- మూడు సంవత్సరంలో చిన్నస్థాయ వృత్తి నిపుణులు, వ్యాపారులపై దృష్టి పెట్టాను.
- నాలుగో ఏడాది రూ.5 లక్షల ఆదాయం ఉన్నవారికి పన్ను శాతాన్ని 10% నుంచి 5శాతానికి తగ్గించాను.
- ఈ ఏడాది కూడా ప్రామాణిక తగ్గింపు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై మినహాయింపుల పేరుతో రూ.12 వేల కోట్ల వరకు రాయితీలు ఇచ్చాం. నల్లధనంపై మేము చేసిన ప్రయత్నాలు కారణంగా పన్ను చెల్లింపుదారులు పెరిగారు. ఇది కూడా మా ప్రభుత్వ ఘనవిజయమే.

1% సెస్సుతో రూ. 11వేల కోట్లు

ఆయుష్మాన్ భారత్ (నమో కేర్)కు రూ.12 వేల కోట్లు అసవరం కాగా, రూ. 2 వేల కోట్లు కేటాయించారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు జైట్లీ సమాధానమిచ్చారు. పథకం ప్రారంభం కోసం ఈ మొత్తాన్ని కేటాయించామని, తరువాత పెంచుతామని చెప్పారు. ఆదాయపు పన్నుపై 1% సెస్సు ద్వారా రూ.11 వేల కోట్లు వస్తాయని తెలిపారు.

రాష్ట్రాలు సుముఖంగా లేవు

పెట్రోలు, డీజిల్‌లను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్రాలు అంగీకరించడం లేదని జైట్లీ అన్నారు. అవి వాటి ఆధీనంలోనే ఉండాలని కోరుకుంటున్నాయని చెప్పారు. జీఎస్టీ అమలు దాదాపుగా గాడిలో పడిందని అన్నారు.

పన్నులు కట్టొద్దని రెచ్చగొడతారా?

- కాంగ్రెస్‌పై అమిత్ షా ధ్వజం



దిల్లీ: వస్తు-సేవల పన్ను (జీఎస్టీ)ని గబ్బర్ సింగ్ టాక్స్ అని అభివర్ణిస్తున్న కాంగ్రెస్ పార్టీ..పన్నులు చెల్లించవద్దంటూ ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందా అని భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రశ్నించారు. రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారిగా సోమవారం సభలో ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ సుమారు 90 నిమిషాల పాటు మాట్లాడారు. జీఎస్టీపై రాహుల్ గాంధీ చేసిన విమర్శలను తిప్పికొట్టారు. 'చట్టబద్ధంగా పన్నులు వసూలు చేయడం దోపిడీ కిందకు వస్తుందా? ఇంతేనా అర్థం చేసుకున్నారు? ఈ సొమ్ము ఎక్కడికి వెళ్తోంది? అమరవీరుల భార్యల ఖాతాల్లో జమవుతోంది. గ్యాస్ కోసం పేద మహిళలకు ఇస్తున్నార'ని తెలిపారు. 'పన్నులు చెల్లించవద్దని రెచ్చగొట్టడం ఎలాంటి రాజకీయం? దేశాన్ని ఎటువైపు తీసుకెళ్తున్నారు? ఈ రోజు మేం అధికారంలో ఉన్నాం. రేపు మీరు రావచ్చు. అవును రావచ్చు. ఎల్లకాలం అధికారంలో ఉండాలన్నది మా మనస్తత్వం కాదు. కొన్ని విషయాలను రాజకీయాలకు అతీతంగా చూడాల'ని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం జీఎస్టీని ప్రతిపాదించినప్పుడు అప్పటి భాజపా పాలిత రాష్ట్రాలు వ్యతిరేకించాయన్నది సరికాదని చెప్పారు. జీఎస్టీ కారణంగా నష్టపోయే రాష్ట్రాలకు కేంద్రం పరిహారం చెల్లిస్తుందన్న నమ్మకం లేకనే అభ్యంతరాలు చెప్పాయే తప్ప, వ్యతిరేకించలేదని అన్నారు. జీఎస్టీ అమలులో ఉన్న ఇబ్బందులను పరిష్కరిస్తున్నామని, దీనివల్ల చిన్నవ్యాపారులకు ఎటువంటి నష్టం జరగబోదని తెలిపారు. కాంగ్రెస్ వైఖరి జీఎస్టీ మండలిలో ఒకలా, పార్లమెంటులో మరోలా ఉందని విమర్శించారు. మినిట్స్ బహిర్గతం చేస్తే అసలు విషయం తెలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో నిరుద్యోగ తీవ్రత పెరిగిందని, దీని పరిష్కారానికి ఎనిమిదేళ్ల పాలన సరిపోతుందని చెప్పారు.

నిరుద్యోగం బదులు పకోడీ అమ్మకమే మేలు

పకోడీ అమ్మడం కూడా ఉద్యోగమేనా అన్న విమర్శలకు షా సమాధానం చెబుతూ నిరుద్యోగిగా ఉండడం కన్నా, ఇది మేలేనని అన్నారు. 'పకోడీలు చేయడం సిగ్గుపడే పనేమీ కాదు. అలాంటి వారిని బిచ్చగాళ్లతో పోల్చడమే అవమానకరం. చాయ్‌వాలా కుమారుడు ఇప్పుడు ప్రధాని అయ్యార'ని అన్నారు. ప్రభుత్వ విజయాలను వివరిస్తూ అయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలే 'నమో' హెల్త్‌కేర్‌గా పిలుచుకుంటున్నారని చెప్పారు.

భద్రత, ఉగ్రపోరు లక్ష్యంగా మోదీ పశ్చిమాసియా పర్యటన

దిల్లీ: ఉగ్రవాదంపై పోరు, రక్షణ రంగం, భద్రత వంటి కీలకాంశాల్లో సహకారం సాధించడం ముఖ్య లక్ష్యాలుగా ప్రధాని మోదీ ఈ నెల 9 నుంచి పశ్చిమాసియా దేశాల పర్యటన నిర్వహించనున్నారని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు. పాలస్తీనా, యూఏఈ, ఒమన్ దేశాల్లో ప్రధాని పర్యటిస్తారని సోమవారం విలేకరులకు చెప్పారు. ఈ దేశాలతో రక్షణ సంబంధాలతో పాటు వాణిజ్యాన్ని, పెట్టుబడుల్ని పెంచుకోవడంపై ప్రధాని దృష్టి సారిస్తారని వివరించారు. దుబయ్‌లో జరిగే ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సులో మోదీ ప్రసంగిస్తారని చెప్పారు. ఉగ్రవాద బెడదను ఎదుర్కొంటున్న గల్ఫ్ దేశాలతో మన దేశానికి సహకారం ఉందని మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి మృదుల్‌కుమార్ చెప్పారు. అధోజగత్తు నేత దావూద్ ఇబ్రహీం అప్పగింత గురించి ఒత్తిడి తెస్తారా అనే ప్రశ్నకు సమాధానమిస్తూ, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ఓ నిరంతర ప్రక్రియ అని బదులిచ్చారు.

వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీపై సీబీఐ కేసు

దిల్లీ: దేశంలో అత్యంత ధనికుడిగా ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్న ప్రముఖ వజ్రాలవ్యాపారి నీరవ్ మోది(46), ఆయన భార్య అమి, సోదరుడు నిశాల్, వ్యాపార భాగస్వామి చినుభాయ్ చోక్సీ కలిసి పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)ను రూ.280 కోట్ల మేర మోసగించారని సీబీఐ కేసు నమోదు చేసింది. 2017లో జరిగిందని చెబుతున్న ఈ మోసంపై పీఎన్‌బీ అధికారుల ఫిర్యాదు మేరకు కేంద్ర దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగింది. నిందితులు తమకు చెందిన డైమండ్ ఆర్ యూఎస్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్స్ అనే వ్యాపార సంస్థల ద్వారా బ్యాంకును మోసగించారన్నది ఆరోపణ. తమ బ్యాంకుకు చెందిన ఇద్దరు అధికారులు..గోకుల్‌నాథ్ శెట్టి(ప్రస్తుతం రిటైర్డ్), మనోజ్ కారాట్‌లతో కుమ్మక్కై అనధికారికంగా అవగాహన లేఖలు పొందారని, వాటిని చూపి నిందితులు తమకు సరకు విక్రయించిన విదేశీ సంస్థలకు విదేశాల్లోని తమ బ్యాంకు ఖాతా ద్వారా చెల్లింపులు జరిపారని పీఎన్‌బీ పేర్కొంది. ఈ వ్యవహారంలో బ్యాంకుకు రూ.280.70 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపింది.

260 మందిని వేధించిన వైద్యుడికి 125ఏళ్ల జైలు


లారీ నస్సేర్

షికాగో: బాలికలు మొదలుకొని యువతుల వరకూ 260 మందికిపైగా అమెరికాలోని క్రీడాకారిణులను దశాబ్దాలకు తరబడి లైంగికంగా వేధించిన మాజీ వైద్యుడు లారీ నస్సేర్‌కు గరిష్ఠంగా 125 ఏళ్ల జైలు శిక్ష పడింది. మిషిగన్‌లోని చార్లెట్ న్యాయస్థానం సోమవారం ఈ శిక్ష విధించింది. మిషిగన్ స్టేట్ వర్సిటీ క్లినిక్‌లో లారీ వైద్యుడిగా పనిచేశారు. ఆ సమయంలోనే చికిత్స పేరుతో క్రీడాకారిణులను లైంగికంగా వేధించారు. బాలికల అశ్లీల వీడియోలను కలిగివున్నందుకు ఈయనకు ఇప్పటికే గత డిసెంబరులో 60 ఏళ్ల జైలు శిక్ష పడింది. భిన్న లైంగిక వేధింపుల ఆరోపణలపై గరిష్ఠంగా 175 ఏళ్ల శిక్షనూ జనవరిలో విధించారు. తాజా 125 ఏళ్ల శిక్షను జిమ్నాస్టిక్స్ కేంద్రంలో శిక్షణ సమయంలో పాల్పడ్డ వేధింపులకుగాను విధించారు. తీర్పు వెలువడిన అనంతరం లారీ క్షమాపణలు చెప్పారు.

పాక్‌కు జవాబును చేతల్లోనే చూపిస్తాం

- సరిహద్దు కాల్పులపై భారత సైన్యం ఉప ప్రధానాధికారి
- సైన్యం పరాక్రమంపై భారతీయులకు పూర్తి విశ్వాసం: రాజ్‌నాథ్
- కొనసాగిన కాల్పులు


సోమవారం దిల్లీలోని పాలం విమానాశ్రయంలో కెప్టెన్ కపిల్ కుందు పార్థివ దేహానికి నివాళి అర్పిస్తున్న రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

దిల్లీ/ శ్రీనగర్/ : సరిహద్దుల్లో భారత్-పాక్ బలగాల మధ్య కాల్పుల హోరు కొనసాగుతూనే ఉంది. ఆదివారం కాల్పుల్లో అమరులైన భారత జవాన్ల సంఖ్య నాలుగుకి చేరింది. తామంటే ఏమిటో చేతల్లోనే పాకిస్థాన్‌కు చూపిస్తామనీ, ప్రతీకారం తీర్చుకుంటామనీ భారత సైన్యం ప్రకటించింది. పాకిస్థాన్‌కు దీటైన సమాధానం ఇవ్వడాన్ని భారత్ కొనసాగిస్తుందని సైనికదళాల ఉప ప్రధానాధికారి శరత్‌చంద్ సోమవారం విలేకరులకు తెలిపారు. 'ఉగ్రవాదులు పాక్ నుంచి మన దేశంలోకి చొరబడేందుకు వీలుగా అక్కడి సైన్యం అన్నివిధాలా సహకరిస్తోంది. ప్రతీకారం తీర్చుకుని తీరుతామని విడిగా చెప్పాల్సిన అవసరం లేదు. మేమేమిటనేది మా చర్యలే చాటుతాయ'ని చెప్పారు. మరో ఆరు రోజుల్లో 22వ జన్మదిన వేడుకలు చేసుకోవాల్సిన కెప్టెన్ కపిల్ కుందు (గురుగ్రామ్ జిల్లా, హరియాణా), మరో ముగ్గురు జవాన్లు ఆదివారంనాటి ఘటనలో ప్రాణాలు కోల్పోయారని వివరించారు. భారత సైన్యం శౌర్యపరాక్రమాలపై దేశ ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. కశ్మీర్‌లోని రాజౌరీ జిల్లా పరిధిలో నియంత్రణరేఖ వెంబడి జరిగిన తాజా కాల్పుల్లో సరిహద్దు భద్రత దళం ఎస్సై గాయపడ్డారు. ఆదివారం రాత్రంతా కాల్పులు జరుగుతూనే ఉన్నాయని అధికారులు తెలిపారు. పాఠశాలలకు మూడ్రోజులు సెలవులిచ్చారు. ప్రజల కోసం శిబిరాలు తెరిచారు.

భారత దౌత్యాధికారిని పిలిపించి పాక్ నిరసన

ఇస్లామాబాద్: భారత సైన్యం నిష్కారణంగా కాల్పులకు దిగడంతో ఇద్దరు పాకిస్థానీయులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపిస్తూ డిప్యూటీ హైకమిషనర్ జె.పి. సింగ్‌ను పాకిస్థాన్ పిలిపించి, నిరసన వ్యక్తం చేసింది.

త్యాగనిరతే ఆ అమరుడి ఆకాంక్ష!

"చాలాకాలం జీవించడం కాదు.. చాలా గొప్పగా జీవించాలి.." ఆ అమరవీరుడు తన ఫేస్‌బుక్‌లో రాసుకున్న ఈ వాక్యాలు ఆయన త్యాగనిరతికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి. పాక్ సైన్యం ఆదివారం జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన నలుగురు భారత జవాన్లలో ఒకరైన కెప్టెన్ కపిల్ కుందు మనసుకు నచ్చిన మాటలివి. హరియాణాకు చెందిన కుందు ఈ నెల 10న 23వ పుట్టినరోజును జరుపుకోవాల్సి ఉండగా.. పాక్ సైనిక దురాగతాలకు బలైపోయారు. కపిల్ కుందు భౌతిక కాయాన్ని సోమవారం గురుగ్రామ్ జిల్లాలోని రాన్సికా గ్రామానికి తరలించారు. పాలం వైమానిక స్థావరంలో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ తదితరులు అమరుడు కెప్టెన్ కపిల్ కుందుకు నివాళులు అర్పించారు.

ట్రంప్‌ను కదిలించిన ఏడేళ్ల బాలిక లేఖ

వాషింగ్టన్: ఎరుపెక్కిన కళ్లతో ఏడేళ్ల బాలిక రాసిన లేఖ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కదిలించింది. ఆయన్ను ప్రత్యుత్తరమిచ్చేలా చేసింది. 15 నెలల క్రితం.. ఓ రోజు మధ్యాహ్నం దక్షిణ కరోలినాలోని పాఠశాల బయట ఏడేళ్ల అవా హాయిగా నడుస్తోంది. అదే సమయంలో 14 ఏళ్ల బాలుడు తుపాకీతో విధ్వంసం మొదలు పెట్టాడు. ఓ తూటా అవా ఉపాధ్యాయుడి భుజానికి తగిలింది. మరోతూటా తన స్నేహితుడి కాలిలోకి దూసుకెళ్లింది. మూడో తూటా మాత్రం తను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే ఆరేళ్ల జాకబ్ హాల్‌ను నేలకూల్చింది. తన తరగతిలో అందరికంటే జాకబ్ చిన్నవాడు. మూడున్నర అడుగుల ఎత్తుండే అతడంటే అవాకు పంచప్రాణాలు. తను ముద్దుపెట్టుకున్న ఏకైకవ్యక్తి అతడే మరి. పెద్దయ్యాక అతణ్ని పెళ్లి కూడా చేసుకోవాలని అనుకుంది. తన కళ్ల ముందే జాకబ్ మృత్యుఒడిలోకి చేరాడు. ఈ బాధ నుంచి అవా బయటకు రాలేకపోయింది. ఆమెను పాఠశాలకు పంపకుండా ఇంటిలోనే ఉంచి చదివిస్తే మేలని వైద్యులు సూచించారు. ఇంటికే పరిమితమైన అవా.. ఆ నాడు పాఠశాల బయటున్న పిల్లల గురించి ఆలోచించడం మొదలు పెట్టింది. వారిలో తన తమ్ముడూ ఉన్న సంగతి గుర్తుచేసుకుంది. దీంతో వారి పరిస్థితిపై ఆందోళనపడుతూ ట్రంప్‌నకు లేఖరాసింది. పెన్సిల్‌తో పెద్ద అక్షరాల్లో జరిగిన సంగతి వివరించింది. 'నాకు చాలా భయం వేసింది. నా ప్రియమిత్రుడు కళ్లముందే చనిపోయాడు. అతణ్ని ప్రేమించాను. పెళ్లికూడా చేసుకోవాలని అనుకున్నాను. అతణ్ని తీసుకుపోయిన తుపాకులంటే నాకు అసహ్యం. దయచేసి పాఠశాలలకు తుపాకుల నుంచి రక్షణ కల్పించండి'అని పేర్కొంది. దీనికి ట్రంప్ ప్రత్యుత్తరమిచ్చారు. 'అవా.. నేను, నా భార్య ఎప్పటికీ నిను మరచిపోలేము. నిను ప్రేమించేవారు, వెన్నుతట్టి ప్రోత్సహించేవారు నీ జీవితంలో చాలా మంది వున్నారు. నీ కలలన్నీ సాకారం కావాలని కోరుకుంటున్నా. చిన్నారులు సురక్షితమైన పర్యావరణంలో పెరిగేలా చూడటం ఓ అధ్యక్షుడిగా నా బాధ్యత. అమెరికన్ల భద్రత, దేశ పరిరక్షణకు చేస్తున్న కృషిని కొనసాగిస్తా'అని ట్రంప్ వివరించారు.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మధ్య కడక్‌నాథ్ 'కోఢీ'



- కుక్కుటం భౌగోళిక గుర్తింపుపై సిగపట్లు
- వెనక్కి తగ్గబోమంటున్న భాజపా పాలిత రాష్ట్రాలు

ఈనాడు - దిల్లీ

కడక్‌నాథ్ కోడి... చూడడానికి నల్లగా ఉంటుంది. కాళ్లు, రెక్కలు, ముక్కు... నిలువెల్లా అదే కృష్ణ వర్ణం. మాంసం, ఎముకలే కాకుండా ఆఖరికి ఆ కోడి పెట్టే గుడ్డు కూడా కారునలుపే. రుచితో పాటు పోషకాలు, ఔషధ విలువలు మెండుగా ఉంటాయనే విశ్వాసంతో కిలో రూ.500 పలుకుతున్నా వీటిని కొని ఓ పట్టు పట్టడానికి మాంసాహారులు లొట్టలేస్తారు. అదంతా ఓ కథ. ఇప్పుడు ఈ నల్ల కోడి... భాజపా పాలిత రెండు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టింది. అనేక ప్రత్యేకతలున్న ఈ కోడి తమ రాష్ట్రానిదంటే తమదని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వాదిస్తున్నాయి. ఈ కోడిపై భౌగోళిక గుర్తింపు (జీఐ) తమకే ఇవ్వాలని 2012 లోనే మధ్యప్రదేశ్ సర్కారు చెన్నైలోని జీఐ నమోదు కార్యాలయానికి దరఖాస్తు చేసింది. తమ రాష్ట్రంలోని ఝబువా జిల్లాలోనే ఆ కోడి పుట్టిందని వాదించింది. గత ఏడాది నవంబరులో ఛత్తీస్‌గఢ్ కూడా దరఖాస్తు చేసుకొంది. దంతెవాడలో చేపట్టిన కడక్‌నాథ్ కోళ్ల ఉత్పత్తి విజయవంతమైందనీ, గుర్తింపు తమకే దక్కాలనీ వాదించింది. రెండింటిలో ఏ రాష్ట్రమూ వెనక్కి తగ్గడం లేదు. రెండు ప్రభుత్వాలు, ఉభయ రాష్ట్రాల అధికారులు కూడా విజయం తమదే కావాలన్నంత పంతంతో ప్రయత్నాలు ముమ్మరం చేసిన తీరు ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'జీఐ యుద్ధంలో గెలవాలని మేం అత్యంత తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. మా దరఖాస్తును సవాల్ చేయడం ఛత్తీస్‌గఢ్‌కు అంత సులభం కాదు. ఝబువా ప్రాంతంలోనే ఈ కోడి పుట్టిందని అందరికీ తెలుసు'నని మధ్యప్రదేశ్ ముఖ్య కార్యదర్శి అజిత్ కేసరి ఫోన్లో 'ఈనాడు'కు చెప్పారు. ఝబువా కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువగా, ఏటా 2.5 లక్షల కోళ్లు దంతెవాడ ప్రాంతం నుంచే ఉత్పత్తి అవుతున్నాయనీ, అందుకే తాము దరఖాస్తు చేశామనీ దంతెవాడ కలెక్టర్ సౌరభ్ కుమార్ చెప్పారు.

భయాందోళన కలిగిస్తున్న భాజపా సర్కారు: ఆజాద్

దిల్లీ: భాజపా ప్రభుత్వం ప్రజల్లో మానసిక భయాందోళన కలిగిస్తోందని రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ విమర్శించారు. సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన ప్రసంగించారు. ప్రజల్లోనే కాకుండా అధికారులు, ప్రతిపక్ష నేతల్లోనూ ఇలాంటి భావన కలిగిస్తోందని చెప్పారు. ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేశారన్న భయంతో వారితో మాట్లాడడానికి చాలా మంది జంకుతున్నారని తెలిపారు. ఇదేనా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ అని ప్రశ్నించారు. ప్రభుత్వం షియాలను, సున్నీలను; భార్యాభర్తలను విడదీసిందని, మైనార్టీల్లో అభద్రత వాతావరణాన్ని కల్పించిందని చెప్పారు. కశ్మీర్‌లో పరిస్థితి దారుణంగా ఉందని అన్నారు. సరిహద్దుల్లో సామాన్యులు, జవాన్లతో పాటు సైనికాధికార్లు కూడా తూటాలకు బలవుతున్నారని చెప్పారు.

విమానాలు వెదజల్లే మసితో ఎగువ వాతావరణంలో తాపం: కేంద్రం

విమానాల నుంచి వెలువడే మసి ప్రభావం రుతుపవనాలు, హిమానీనదాలు, ఓజోన్ పొరపై పడే ప్రభావంపై అనిశ్చితి ఉందని కేంద్రం తెలిపింది. అయితే దాని నిరంతర ఉద్గారాల వల్ల నేల నుంచి 10-12 కిలోమీటర్ల ఎత్తులో వాతావరణం వేడెక్కుతుందని పేర్కొంది. విమానాల నుంచి వెలువడే మసి.. స్ట్రాటోఆవరణం వరకూ చేరుతుందని అధ్యయనాల్లో తేలిందని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి మహేశ్ శర్మ.. సోమవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అనుమతిలేని యాంటీబయోటిక్స్.. భారత్‌లో భారీగా విక్రయాలు

లండన్: భారత్‌లో ఏటా లక్షల్లో "ఆమోదంలేని యాంటీబయోటిక్స్" విక్రయాలు జరుగుతున్నాయని తాజా అధ్యయనం వెల్లడించింది. ఔషధాలకు లొంగని సూక్ష్మజీవులపై పోరాటాన్ని ఈ పరిణామం నీరుగారుస్తోందని హెచ్చరించింది. బ్రిటిష్ జర్నల్ ఆఫ్ క్లినికల్ ఫార్మకాలజీలో ఈ అధ్యయనం ప్రచురితమైంది. 2007 నుంచి 2012 మధ్యకాలంలో యాంటీబయోటిక్స్‌కు అనుమతులు, విక్రయాల సమాచారాన్ని దీనిలో పరిశోధకులు విశ్లేషించారు. ఔషధ ప్రమాణాలు, నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) సమాచారాన్నీ శోధించారు. దీంతో మొత్తంగా వారు గుర్తించిన 118 భిన్నరకాల యాంటీబయోటిక్స్(భిన్న ఔషధాలు కలిపి తయారుచేసే ఎఫ్‌డీసీ)ల్లో 64 శాతం వాటికి సీడీఎస్‌సీవో అనుమతులులేనట్లు వెలుగులోకి వచ్చింది. ఈ ఔషధాల విక్రయాలు చట్టపరంగా నేరమైనప్పటికీ తయారీసంస్థలు పట్టించుకోవట్లేదని బయటపడింది.

సవాళ్లకు యువత సన్నద్ధంగా ఉండాలి: శ్రీశ్రీ రవిశంకర్

కొచ్చి: జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవటానికి యువత సన్నద్ధంగా ఉండాలని ఆధ్యాత్మికవేత్త శ్రీశ్రీ రవిశంకర్ ఉద్బోధించారు. యువత దేశానికి వెన్నెముకలాంటి వారని, దేశాభివృద్ధికి వారు దృఢ సంకల్పంతో కృషిచేయాలని సూచించారు. కొచ్చిలో సోమవారం నిర్వహించిన మహా ధ్యాన శిబిరం 'విజ్ఞాన్ భైరవ్'కు హాజరైన యువతనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఆనంద సందేశాన్ని వ్యాప్తిచేయటంలో భాగంగా ప్రవేశపెట్టిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన కేరళలోని విద్యా సంస్థలకు 'సంతోష అవార్డుల'ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో 5వేల మంది పాల్గొన్నారని, వీరిలో 17 దేశాలకు చెందిన 200 విదేశీయులూ ఉన్నారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ తెలిపింది.


సోమవారం దిల్లీలోని తమ నివాసంలో ప్రపంచ సుందరి–2017 మానుషీ చిల్లర్‌ను సన్మానిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు

మావోయిస్టు అగ్రనేత ఆస్తులను జప్తు చేసిన ఈడీ

- దేశ చరిత్రలో ఇదే తొలిసారి..

దిల్లీ: దేశ చరిత్రలోనే తొలిసారిగా ఓ మావోయిస్టు అగ్రనేత ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జప్తు చేసింది. బిహార్‌కు చెందిన మావోయిస్టు కమాండర్ సందీప్ యాదవ్ అలియాస్ బడ్కా భయ్యా, ఆయన కుటుంబసభ్యుల పేరిట ఉన్న రూ.86 లక్షల విలువైన ఆస్తులను సోమవారం స్వాధీనం చేసుకుంది. వాటిలో భూమి, నగదు, వాహనాలు ఉన్నట్లు వెల్లడించింది. నగదు అక్రమ చెలామణీ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద ఈ మేరకు కొరడా ఝుళిపించినట్లు తెలిపింది. బిహార్-ఝార్ఖండ్ ప్రత్యేక ప్రాంతీయ మావోయిస్టు కమిటీలో 'మధ్య' జోన్‌కు బాధ్యుడిగా సందీప్ వ్యవహరిస్తున్నారు.

పౌరసత్వం నిబంధనల పరిశీలనకు రాజ్యాంగ ధర్మాసనం

బంగ్లాదేశ్ నుంచి అసోంలోకి వలస వచ్చినవారికి భారత పౌరసత్వం కల్పించడంలో అనుసరిస్తున్న విధానాలు సహా పౌరసత్వ చట్టం-1955లోని పలు అంశాలను పరిశీలించేందుకుగాను రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు సోమవారం వెల్లడించింది.

కంది రైతుకు అన్నీ కష్టాలే!

- పంట అమ్మినా అందని సొమ్ము రూ.380 కోట్లు
- కొనుగోలు పరిమితిని పెంచని కేంద్రం
- నేడు కేంద్ర మంత్రి వద్దకు తెలంగాణ ఎంపీలు
- లక్షన్నర టన్నులకు అనుమతి రాకుంటే రాష్ట్రమే భరించాలి

ఈనాడు, హైదరాబాద్: మద్దతు ధరకు కందుల కొనుగోలు వ్యవహారంలో రైతుల కష్టాలు పెరుగుతున్నాయి. పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మిన 20 రోజుల దాకా సొమ్ము చేతికి రావడం లేదు. ఇప్పటికే రైతుల నుంచి రాష్ట్ర కొనుగోలు సంస్థలు 1.10లక్షల టన్నులు కొనేశాయి. వీటికి నాఫెడ్ నుంచి రూ.220 కోట్లే విడుదలవ్వడంతో అవి రైతుల ఖాతాల్లో వేశారు. కనీసం సగం పంటకైనా రైతుకు సొమ్ము అందలేదు. పంట కొనుగోలు పరిమితిని పెంచాలని మంగళవారం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్ సింగ్‌ను కలసి విన్నవించాలని తెలంగాణ ఎంపీలను రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది.

లెక్కల్లో తేడా వల్లనే ఇబ్బందులు: కందుల కొనుగోలులో తొలుత వేసిన లెక్కలన్నీ మారిపోవడంతో రైతులకు సొమ్ము అందడంలో జాప్యం జరుగుతోంది. 'మద్దతు ధర పథకం'(పీఎస్ఎస్) కింద తెలంగాణలో పండిన కందుల్లో 40 శాతం కొనాలని కేంద్రం 'జాతీయ సహకార మార్కెటింగ్ సమాఖ్య'(నాఫెడ్)ను ఆదేశించింది. రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య(మార్క్‌ఫెడ్), హాకాలను నోడల్ ఏజెన్సీలుగా నియమించి 108 పంట కొనుగోలు కేంద్రాలు తెరిచారు. గత అక్టోబరులో అర్థ, గణాంకశాఖ రాష్ట్రంలో దిగుబడిపై ఇచ్చిన అంచనాలమేర 53,600 టన్నుల కొనుగోలుకు కేంద్రం అనుమతించింది. రెండోసారి అంచనాల ప్రకారం 2.84 లక్షల టన్నులొస్తుందని తేలింది. దీంతో లక్షన్నర టన్నులకు కొనుగోలు పరిమితిని పెంచాలని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ కోరగా పరిశీలిస్తామన్న కేంద్రం ఇంతవరకూ తేల్చలేదు. కేంద్రం అనుమతి ఇచ్చాకనే నిధులు ఇవ్వగలమని నాఫెడ్ మిన్నకుండిపోయింది. దీంతో అదనంగా కొన్నవాటికి సొమ్ము ఎప్పుడు వస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈవిషయమై తెలంగాణ ఎంపీలతో కేంద్రంపై ఒత్తిడి తేవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించి కేంద్రమంత్రి వద్దకు పంపుతోంది. కేంద్రం నుంచి సవరణ అనుమతి 1.13 లక్షల టన్నులకే వచ్చే అవకాశముందని సమాచారం. ఇప్పటికి కొన్నవాటికే రూ.380 కోట్ల దాకా రైతులకు బకాయిలున్నందున ఇక అదనంగా కొంటే రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడిస్తుందనే తేలాలి. దీంతో పలువురు రైతులు సొమ్ము కోసం తమ పంటను మద్దతు ధర రూ.5450కన్నా రూ.1000-1500 తగ్గించి అమ్మేస్తున్నారు. ఈపంటను వ్యాపారులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకుని లాభపడుతున్నారు. దీంతో బయట తెరిచిన కేంద్రాలను మూసివేయాలని, మార్కెట్లలో మాత్రమే కందులను కొనాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈవ్యవహారంపై నివేదిక ఇవ్వాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్లు మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రైతుల పేరిట అక్రమంగా కొనుగోలు కేంద్రాల్లో అమ్మినవారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించారు.

భూముల లెక్కలను తనిఖీ చేయండి

డీఏఓలకు పార్థసారథి ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: సాగుభూముల వివరాలతో రెవెన్యూ శాఖ ఇటీవల ఇచ్చిన నివేదికలను తీసుకుని గ్రామాలవారీగా వాస్తవంగా పంటలు సాగుచేస్తున్న వాటిని తనిఖీ చేసి నమోదు చేయాలని అన్ని జిల్లాల వ్యవసాయాధికారి(డీఏఓ)లను, ఉద్యాన అధికారులను వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి ఆదేశించారు. సోమవారం సచివాలయం నుంచి దూరదృశ్య విధానంలో అన్ని జిల్లాల అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ తనిఖీల అనంతరం ఇచ్చే లెక్కల ప్రకారం పెట్టుబడి పథకం కింద ఎకరానికి రూ.4 వేలు, రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్‌కు కేటాయింపులుంటాయని ఆయన చెప్పారు. గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ) కలసి పంట సాగుచేసే భూములనే ఎంపిక చేసి నమోదు చేయాలన్నారు. ఈ తనిఖీలపై జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించి ఈ నెల 12కల్లా నివేదికలు పంపాలని సూచించారు. గ్రామాలవారీగా రైతులకు ఇప్పటివరకు ఉన్న వ్యవసాయ యంత్రాల వివరాలను సేకరించి ఈ నివేదికల్లో తెలపాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన కమిషనర్లు జగన్మోహన్, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూల విత్తనోత్పత్తిని పెంచండి

రాష్ట్రాన్ని విత్తన బాండాగారంగా మార్చాలంటే తొలుత మూల విత్తనాల కొరత తీర్చాలని, అవి సులభంగా లభిస్తే విత్తన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుందని పార్థసారథి చెప్పారు. మూల విత్తనోత్పత్తిపై సోమవారం ఆయన వివిధ పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలతో సమీక్షించారు.

భూదస్త్రాల ప్రక్షాళనలో పాల్గొన్న సిబ్బందికి రూ.18 కోట్ల ప్రోత్సాహకం!

భూ దస్త్రాల ప్రక్షాళనలో విధులు నిర్వర్తించిన రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బందికి ఒక నెల వేతనం ప్రోత్సాహకంగా ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం రూ.18 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తోంది. రాష్ట్రంలో 30 జిల్లాల్లో రెవెన్యూ సిబ్బంది సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు గ్రామాల్లో తిరిగి భూదస్త్రాల ప్రక్షాళనలో పాల్గొన్నారు. వారి సేవలను అభినందించిన సీఎం కేసీఆర్ ప్రోత్సాహకం ఇస్తామని గతంలోనే ప్రకటించారు.

సీసీఎల్ఏగా బాధ్యతలు చేపట్టిన రాజేశ్వర్ తివారి

భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)గా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి సోమవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి ఎస్‌కే సిన్హా, రేమండ్ పీటర్ మాత్రమే సీసీఎల్ఏగా పూర్తి బాధ్యతలు నిర్వర్తించారు. సీఎస్‌లుగా పనిచేసిన రాజీవ్‌శర్మ, ఎస్పీ సింగ్‌లు ఎక్కువ కాలం ఈ బాధ్యతలు నిర్వహించారు. కమిషనర్ పోస్టు అయిన సీసీఎల్ఏ బాధ్యతలను అదే శాఖకు చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి అప్పగించడం చర్చనీయాంశమైంది.

కీలకంగా మారనున్న తహసీల్దారు

- పాత చట్టాలకు తోడు కొత్తగా రెండు..
- ప్రతి తహసీల్దారు కార్యాలయానికి ముగ్గురు సిబ్బంది

ఈనాడు - హైదరాబాద్

ప్రజలకు ఒకేచోట రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సేవలను అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతో తహసీల్దారు స్థానం మరింత క్రియాశీలకంగా మారనుంది. ఇన్నాళ్లూ మండల పరిధిలో దాదాపు 258 చట్టాల అమలును పర్యవేక్షించిన తహసీల్దార్లు ఇకపై రిజిస్ట్రేషన్లు, స్టాంపుల చట్టాల అమలు బాధ్యతల్నీ చేపట్టనున్నారు. ఖ్వాజీ జ్యుడీషియల్ అధికారాలున్న వారికి ప్రభుత్వం తాజాగా రిజిస్ట్రేషన్లు నిర్వహించే కీలక బాధ్యతల్ని కట్టబెట్టనుంది. దీంతో భూ క్రయవిక్రయాల దస్త్రాలను పరిశీలించడం, స్టాంపు చట్టం-1899 ప్రకారం భూమి ధరను నిర్ణయించడం, రిజిస్ట్రేషన్ల చట్టం-1908 ప్రకారం రిజిస్ట్రేషన్ పూర్తి చేసే బాధ్యతలనూ పర్యవేక్షించనున్నారు. పరిపాలన రీత్యా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, విచారణలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదించడం లాంటి కీలకమైన బాధ్యతలను తహసీల్దార్లు నిర్వర్తిస్తున్నారు. ప్రధానంగా భూ వ్యవహారాల పర్యవేక్షణే తెరపైకి కనిపించినా జననం నుంచి మరణం వరకు, ఎన్నికలు, జనగణన వంటి అంశాలన్నీ రెవెన్యూతోనే ముడిపడి ఉన్నాయి. ప్రభుత్వ ఆస్తులు, దేవాదాయ, వక్ఫ్, అసైన్డ్ భూముల పరిరక్షణ, భూ పంపిణీకి సంబంధించిన ప్రక్రియలను కూడా ఈ విభాగమే పర్యవేక్షిస్తోంది. మెజిస్ట్రేట్ అధికారాలు ఉండటంతో ఇతర అంశాల్లోనూ బాధ్యతలు ఉంటున్నాయి. పనిభారం కూడా అధికంగానే ఉంటోంది. ప్రస్తుతం తహసీల్దార్లకే సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలు కట్టబెడుతుండటంతో కీలక స్థానాలపై అధిక ఒత్తిడి ఉండే అవకాశాలూ ఉన్నాయి. మరోవైపు తమపై ఒత్తిడి కూడా అధికమవుతుందన్న అభిప్రాయాన్ని తహసీల్దార్లు వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో కార్యాయానికి ముగ్గురు సిబ్బంది

సంస్కరణల్లో భాగంగా తహసీల్దారు కార్యాలయాలను సిబ్బంది కొరత లేకుండా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. కొత్తగా ఏర్పాటు చేసే సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో సాంకేతిక సహాయకుడిని, జూనియర్ అసిస్టెంట్‌ను నియమించనున్నారు. 'ధరణి' వెబ్‌సైట్ నిర్వహణకూ ఒక సహాయకుడిని నియమించనున్నారు. పనిభారాన్ని బట్టి తాత్కాలిక పద్ధతిలో అదనపు సిబ్బందిని తీసుకునే అవకాశాన్నీ ప్రభుత్వం రెవెన్యూ శాఖకు ప్రభుత్వం ఇవ్వనుంది.

మరింత బాధ్యతతో పనిచేయాలి

- 48 గంటల్లో మ్యుటేషన్ పూర్తి కావాలి
- తహసీల్దార్ల శిక్షణలో ఉప ముఖ్యమంత్రి



తహసీల్దారుకు రిజిస్ట్రేషన్ల శాఖ పుస్తకం అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ

రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సమయంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, 48 గంటల్లోనే ఆ ప్రక్రియ పూర్తి చేసే ఉద్దేశంతో తహసీల్దార్లకే సబ్ రిజిస్ట్రార్ల బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తెలిపారు. రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు ఒకేచోట జరగడం వల్ల రెవెన్యూ దస్త్రాల్లో తప్పులకు వీలుండదన్నారు. సోమవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సబ్‌రిజిస్ట్రార్ల విధులపై తహసీల్దార్లకు అవగాహన కల్పించడం కోసం ఏర్పాటైన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 'భారత స్టాంపులు చట్టం-1899, రిజిస్ట్రేషన్ల చట్టం-1908' అనే పుస్తకాన్ని వారికి అందించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ..1934-36 మధ్య తెలంగాణలో భూ సర్వే జరిగిందని, అటు తర్వాత ఇప్పుడే ప్రక్షాళన జరుగుతోందన్నారు. రాష్ట్రంలోని రెవెన్యూ అధికారులు, సిబ్బంది భూ దస్త్రాల ప్రక్షాళనతోపాటు..రూ.40 వేల కోట్ల విలువైన సంక్షేమ పథకాల అమలు బాధ్యతలను నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. ఈ క్రతువులో బాధ్యతగా వ్యవహరించడంతోపాటు.. ఒత్తిడిని జయించి పనిచేయాలని సూచించారు. తహసీల్దార్లకు అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించేందుకు ఆరు విడతలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీలు సైదిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుభాషిణి పాల్గొన్నారు.

రాష్ట్రంలో గుడుంబా తయారీ లేదు

ఆబ్కారీశాఖ అదనపు కమిషనర్ రాజశేఖరరావు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో గుడుంబాను నియంత్రించగలిగినట్లు ఆబ్కారీశాఖ అదనపు కమిషనర్ రాజశేఖరరావు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రాన్ని గుడుంబా రహితంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుమేరకు అధికారులంతా ప్రణాళిక ప్రకారం కృషి చేశారన్నారు. దీనివల్లే గుడుంబాను తరిమివేయడం సాధ్యమైందని, ఇంకా రాష్ట్రంలో తయారు చేస్తున్నారన్న ప్రచారం అపోహమాత్రమేనన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొలాసిస్ నుంచి గుడుంబా తయారు చేయడం సాధ్యంకాదని, ఒకవేళ అలా తయారు చేసినా అది లాభదాయకం కాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 65 వేల మంది గుడుంబా తయారీదారులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, 94 మందిపై పీడీ చట్టం ప్రయోగించామని వివరించారు. ఎక్కడైనా గుడుంబా తయారు చేస్తున్నట్లు సమాచారం ఉంటే 18004252523 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని, 24 గంటల్లోనే అధికారులు తగు చర్యలు తీసుకుంటారన్నారు.

'ఏపీ వారికివ్వాల్సి వస్తే మా పదోన్నతులూ వదులుకుంటాం'

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఏపీ స్థానికత గల ఉద్యోగులను తెలంగాణ విద్యుత్తు సంస్థల్లోకి తీసుకునేందుకు వీల్లేదని తెలంగాణ విద్యుత్తు ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఈఈఏ) ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమవారం హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శివాజీ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. విద్యుత్తు ఉద్యోగుల విభజనపై ఇటీవల హైకోర్టు స్థానికత రాజ్యాంగ విరుద్ధం అని తీర్పిచ్చిన నేపథ్యంలో కార్యవర్గం చర్చించింది. సమైక్య రాష్ట్రంలో కార్పొరేషన్లలో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నియామకాలు చేయాలని పేర్కొన్నారని, ఆ ప్రకారం తెలంగాణ వారికి 42 శాతం ఉద్యోగ అవకాశాలు కచ్చితంగా కల్పించాలన్నారు. ప్రస్తుతం వాటినే తప్పుగా చూపి న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించారని సంఘం నేతలు పేర్కొన్నారు. అవసరమైతే తమకిచ్చిన పదోన్నతులు వదులుకుంటామే తప్ప వారికి మాత్రం ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. ఏపీ వారిని ఇక్కడ కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే సహాయ నిరాకరణకు దిగుతామన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదన్న మనస్తాపంతో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేడ్చల్ జిల్లా పరిధిలోని హైదరాబాద్ బిట్స్ పిలాని క్యాంపస్‌లో జరిగిన ఘటన సోమవారం వెలుగుచూసింది. చెన్నైకు చెందిన రాఘవ శాంతారామ్(21) హైదరాబాద్ బిట్స్ పిలాని క్యాంపస్‌లో ఇంజినీరింగ్(ట్రిపుల్ ఈ) మూడో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం వరకు గది నుంచి బయటికి రాకపోవడం, తలుపులు తట్టినా స్పందన లేకపోవడంతో స్నేహితులు వార్డెన్ సాయంతో తలుపులు పగలగొట్టారు. రాఘవ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. 'రాఘవ గతంలో ఒక సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. ఆ మనస్తాపంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చాం' అని ఇన్‌స్పెక్టర్ వి.వి.చలపతి తెలిపారు.

బైబిల్‌ను తగలబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

డీజీపీకి ఎంఐఎం శాసనసభ్యుడు బలాలా విజ్ఞప్తి

ఈనాడు, హైదరాబాద్: పవిత్ర బైబిల్‌ను తగలబెట్టడంతోపాటు ఆ ఘటనను వీడియోలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాలలో ప్రసారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎంఐఎం శాసనసభ్యుడు బలాలా డీజీపీ మహేందర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మైనార్టీలపై జరుగుతున్న దాడులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సోమవారం డీజీపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొందరు బైబిల్‌ను తగలబెట్టారని, దీనిపై గత నెల 27న పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు నిందితులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ఇటువంటి వాటివల్ల మతసామరస్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ మతపెద్దలు మధు, ఏసుబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిలు'విల్లా' అవినీతే!

- రూ.100 కోట్ల విల్లాల నిర్మాణ ప్రాజెక్టుకు ప్రణాళిక
- పురుషోత్తమ్‌రెడ్డి... అతని అల్లుడి సోదరుడికి వాటాలు
- తాజాగా గుర్తించిన ఏసీబీ అధికారులు
- అతనికి ఆశ్రయం ఇవ్వవద్దని హెచ్చరిక



పురుషోత్తమ్‌రెడ్డి (పాతచిత్రం)

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళిక విభాగం సంచాలకుడు పురుషోత్తమ్ రెడ్డి 'అవినీతి ప్రణాళిక'లపై..పరిశోధన కొనసాగిస్తున్న కొద్దీ ఏసీబీ అధికారులకు విస్తుపోయే నిజాలు తెలుస్తున్నాయి. అవినీతిలో తారస్థాయికి చేరిన ఆయన..ఆ సొమ్ముతో హైదరాబాద్ శివారులోని ఆర్థిక జిల్లాలో విల్లాల నిర్మాణం..విక్రయం ద్వారా రూ.100 కోట్లు ఆర్జించేందుకు సన్నాహాలు ప్రారంభించారన్న ఆధారాలను ఏసీబీ అధికారులు తాజాగా సేకరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఐటీ కంపెనీలు...రిలయన్స్ టవర్‌తోపాటు పదుల సంఖ్యలో స్థిరాస్తి వెంచర్లు వస్తున్న ఆర్థిక జిల్లా (రంగారెడ్డి జిల్లా మంచిరేవుల)లో విల్లాలు నిర్మించే ప్రాజెక్టుకు పురుషోత్తమ్‌రెడ్డి తుదిరూపమిచ్చాడు. తెలిసిన వ్యక్తికి చెందిన ఆరు ఎకరాల భూమిని అభివృద్ధి నిమిత్తం తీసుకునేలా గతేడాది మార్చి నెలలో చర్చలు జరిపాడు. పురుషోత్తమ్‌రెడ్డి, అతని అల్లుడి సోదరుడు, మధ్యవర్తి పెట్టుబడులు పెట్టేలా..భూమి ఇచ్చిన వ్యక్తికి ఆదాయంలో 25 శాతం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. పెట్టుబడి రూ.15 కోట్లవుతుందని ప్రాథమికంగా లెక్కలేశారు. రూ.50 లక్షలు ఇచ్చి సొంతదారు నుంచి భూమి తీసుకోవాలని నిర్ణయించుకుని, గతేడాది మేలో మధ్యవర్తి ద్వారా రూ.30 లక్షలు చెల్లించాడు కూడా. ఇంతలోనే మధ్యవర్తి విదేశాలకు వెళ్లడంతో రెండు నెలల తర్వాత పనులు ప్రారంభించేలా భూయజమానితో అంగీకారం కుదుర్చుకున్నాడు.

ఒప్పందంలో లొసుగులతో జాప్యం

రెండు నెలల తర్వాత వచ్చిన మధ్యవర్తి ఒప్పందాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సిద్ధమవగా..అప్పటికే రిజిస్ట్రేషన్ చేయించిన పత్రాలను పురుషోత్తమ్‌రెడ్డి అతనికి చూపాడు. పురుషోత్తమ్‌రెడ్డికి 50 శాతం, అతని అల్లుడి సోదరుడికి 50 శాతం వాటా ఉన్నట్టు పత్రాల్లో రాసి ఉండటంతో మధ్యవర్తి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ క్రమంలో కొత్త ఒప్పందం రాసుకోవాలన్న నిర్ణయానికి వచ్చినా.. ఇప్పటివరకూ అది జరగలేదని, పనులు మాత్రం మార్చి నుంచి మొదలు పెట్టేందుకు ముహూర్తం నిర్ణయించుకున్నారని విశ్వసనీయంగా తెలిసింది.

ఆశ్రయమిస్తే కఠిన చర్యలు తప్పవు

పరారీలో ఉన్న పురుషోత్తమ్‌రెడ్డిపై కేసు నమోదైనందున అతనికి ఆశ్రయమిచ్చిన వారిపైనా కఠినంగా వ్యవహరిస్తామని అవినీతి నిరోధక శాఖ అధికారులు సోమవారం హెచ్చరించారు. 'అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఉత్తర్వులతో సోదాలు చేసేందుకు బంజారాహిల్స్ సాగర్ సొసైటీలోని అతని ఇంటికి వెళ్లాం. ఇంటికి తాళం వేసుంది. కొన్ని వారాలుగా పురుషోత్తమ్‌రెడ్డి కుటుంబం ఇంట్లో లేరని ఇరుగుపొరుగు వారు చెప్పారు. అరెస్ట్‌ను తప్పించుకునేందుకే అతడు తప్పించుకు తిరుగుతున్నాడు. ఆయనకు రక్షణ కల్పించినా, ఆశ్రయమిచ్చినా ఐపీసీ 212 సెక్షన్ ప్రకారం విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని ఏసీబీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

సెల్‌ఫోన్ ఎక్స్ఛేంజిని పేల్చివేసిన మావోయిస్టులు

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలంలో ఘటన



మావోయిస్టులు పేల్చివేడయంతో ధ్వంసమైన సెల్‌ఫోన్ ఎక్స్ఛేంజి

వెంకటాపురం,చర్ల, న్యూస్‌టుడే: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దండకారణ్యంలో మావోయిస్టులు చెలరేగారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలం ఎదిర గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి బీఎస్ఎన్ఎల్ సెల్‌ఫోన్ ఎక్స్ఛేంజిని పేల్చివేసి అలజడి సృష్టించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ సోమవారం దండకారణ్యం, తెలంగాణ బంద్‌కు సీపీఐ మావోయిస్టు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. అంతకు ముందు రాత్రి మందుపాతరతో సెల్‌ఫోన్ ఎక్స్ఛేంజిని పేల్చివేశారు. 50 మందికి పైగా సాయుధ మావోయిస్టులతో పాటు పెద్ద ఎత్తున మిలీషియా సభ్యులు మందుపాతర పేల్చడానికి ముందు వెంకటాపురం-భద్రాచలం ప్రధాన రహదారిని ఎక్స్ఛేంజికి ఇరువైపులా దిగ్బంధం చేసినట్లు అక్కడి ఆనవాళ్లు స్పష్టం చేస్తున్నాయి. ప్రధాన మార్గానికి చెంతనే ఆరోగ్య ఉప కేంద్రం పక్కన ఉన్న ఎక్స్ఛేంజిలోకి ప్రవేశించిన మావోయిస్టులు సిగ్నల్స్‌ను సరఫరా చేసే పరికరాల వద్ద మందు పాతరను అమర్చి ఆరోగ్య ఉప కేంద్రం భవనం వెనుకకు తీగలను పరిచి బ్యాటరీల సాయంతో మందుపాతరను పేల్చినట్లు పరికరాలు ఉన్నాయి. దీనిపై కేసు నమోదు చేసినట్లు వెంకటాపురం ఎస్సై బండారి కుమార్ తెలిపారు.

రైలు పట్టాల తొలగింపు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా బచేలీ, భాన్సీ మధ్యలో సోమవారం మావోయిస్టులు రైలు పట్టాలు తొలగించారు. దీంతో గూడ్సు రైలు పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో 6 బోగీలు పల్టీ కొట్టాయి. ఇదే జిల్లాలో కిరండోల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎన్ఎండీసీ సాగునీటి ప్రాజెక్టు పంప్‌హౌస్ నిర్మాణ పనులకు వచ్చిన హరేళీ గ్రామస్థులను పంపివేసి అక్కడే ఉన్న పొక్లెయిన్, టిప్పర్‌కు నిప్పంటించారు. బీజాపూర్ జిల్లాలో పలు చోట్ల మావోయిస్టులు కందకాలు తవ్వి చెట్లు నరికివేశారు.

బడ్జెట్‌లో అన్యాయంపై కేసీఆర్ మాట్లాడరేం?: పొన్నం

హైదరాబాద్, న్యూస్‌టుడే: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగినా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదని కాంగ్రెస్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ. . సీబీఐ కేసులు ఉన్నందుకే ప్రధాని మోదీకి కేసీఆర్ బయపడుతున్నారని జరుగుతున్న ప్రచారానికి బలం చేకూరుతోందన్నారు.

ఛాంపియన్స్



ముంబయిలో భారత అండర్‌-19 జట్టు

ఐపీఎల్ వేలం ఇబ్బంది పెట్టింది

- ఆ వారం రోజులు భయపడ్డా
- ఫైనల్లో పూర్తి స్థాయిలో ఆడలేదు
- కుర్రాళ్లకు అసలు పరీక్ష ఇకపైనే
- అండర్‌-19 జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్



ముంబయి

అండర్‌-19 వన్డే ప్రపంచకప్ జరుగుతున్న సమయంలోనే ఐపీఎల్ వేలం జరగడం భారత కుర్రాళ్లకు ఇబ్బందిగా మారిందని కోచ్ రాహుల్ ద్రవిడ్ అన్నాడు. ప్రపంచకప్ గెలిచిన భారత యువ జట్టుతో కలిసి ముంబయికి చేరుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడిన ద్రవిడ్.. వేలం సందర్భంగా కుర్రాళ్లు పరిణతి ప్రదర్శించారని చెప్పాడు. "ఐపీఎల్ వేలానికి ముందు, వెనుక ఒక వారం రోజుల పాటు పరిస్థితులు ఇబ్బందికరంగా సాగాయి. ఐతే కుర్రాళ్లు చూపిన పరిణతికి అభినందించాలి. వేలం అవ్వగానే ఆ సంగతి వదిలేసి ప్రాక్టీస్‌లో మునిగిపోయారు. ఐతే ఆ మూడు రోజులు మాత్రం కొంచెం భయపడ్డా" అని ద్రవిడ్ అన్నాడు. ఐపీఎల్ వేలంలో అండర్‌-19 జట్టులోని ఏడుగురు అమ్ముడుబోగా.. నాగర్‌కోటి రూ.3.2 కోట్లు, శివమ్ మావి రూ.3 కోట్లు ధర పలికిన సంగతి తెలిసిందే. ఇక ప్రపంచకప్‌లో కుర్రాళ్ల ప్రదర్శనపై ద్రవిడ్ మాట్లాడుతూ.. 'ఫైనల్లో భారత్ అత్యున్నత స్థాయి ఆట ఆడలేదు. కానీ క్వార్టర్స్, సెమీస్‌లో మాత్రం చాలా బాగా ఆడారు. ఫైనల్ మంచి అనుభవం. పాకిస్థాన్‌తో ఆడటం కుర్రాళ్లకు మంచి అవకాశం. ఈ 15 మంది కుర్రాళ్లు ప్రపంచకప్ పతకాలు ధరించడం చాలా సంతోషంగా ఉంది. ఈ టోర్నీ కోసం ఎన్నో త్యాగాలు చేశారు. చివరగా టోర్నీలో నాణ్యమైన క్రికెట్ ఆడటం చాలా సంతృప్తినిచ్చింది. కొన్ని మ్యాచ్‌ల్లో ఒత్తిడి ఎదుర్కొన్నపుడు కొందరు ఆటగాళ్లు నిలబడి చక్కటి ప్రదర్శన చేశారు. ప్రపంచకప్ గెలవడం కంటే ఈ 14-16 నెలల ప్రయాణం ఎక్కువ సంతృప్తినిస్తుంది. ఎంతో ప్రణాళిక, సన్నద్ధత ఉన్నాయందులో. ప్రపంచకప్‌ను పక్కన పెడితే అండర్‌-19 కుర్రాళ్లను తీర్చిదిద్దడం సంతోషాన్నిచ్చింది. ఈ విజయానికి సెలక్టర్లు, జాతీయ క్రికెట్ అకాడమీ శిక్షకులు, బీసీసీఐ కూడా కారణం. జట్టు సమష్టి కృషికి ప్రతిఫలమే ఈ విజయం" అన్నాడు. అండర్‌-19 కుర్రాళ్ల భవితవ్యంపై ద్రవిడ్ స్పందిస్తూ.. "వారికి అసలు సవాలు ఇకపైనే మొదలవుతుంది. దాని గురించి ఇప్పటికే మాట్లాడాం కూడా. 2012 ప్రపంచకప్ ఫైనల్లో భారత్.. ఆస్ట్రేలియాను ఓడించింది. ఐతే అప్పటి భారత జట్టు నుంచి ఒక్కరే జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. కానీ నాటి ఆస్ట్రేలియా జట్టు నుంచి ఐదారుగురు అంతర్జాతీయ క్రికెట్ ఆడారు. ప్రస్తుత జట్టులో ప్రతిభ, సామర్థ్యం ఉన్నాయి. ఐతే ఒత్తిడిని ఎదుర్కోవడం, అంచనాల్ని తట్టుకోవడం కీలకం. భారత జట్టులోకి రావడం సులువు కాదు. ముందు మెరుగైన ఫస్ట్‌క్లాస్ క్రికెటర్లుగా ఎదగాలి. అక్కడి నుంచి భారత జట్టులోకి రావచ్చు" అని చెప్పాడు.

నాన్న వల్లే ఈ స్థాయికి.. షా: అండర్‌-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు నాయకత్వం వహించడం గొప్ప అనుభూతి అని పృథ్వీ షా అన్నాడు. తన ఉన్నతికి తండ్రి శ్రమే కారణమని అతనన్నాడు. 'నా ప్రయాణం ఎన్నో కష్టాలతో సాగింది. నేనీ స్థాయిలో ఉన్నానంటే అందుకు మా నాన్నే కారణం. మా ఇంటి నుంచి నన్ను మ్యాచ్‌ల కోసం, ప్రాక్టీస్‌ల కోసం చాలా దూరం దూసుకెళ్లేవారు. రైళ్లలో రెండు గంటలు ప్రయాణించాల్సి వచ్చేది. గత రెండు మూడేళ్లుగా అండర్‌-19 జట్టుకు ఆడేందుకు ఎంతో శ్రమించాను. 7-8 ఏళ్ల వయసు నుంచే పాఠశాల స్థాయి క్రికెట్ ఆడటం మొదలుపెట్టాను. అప్పటి కోచ్‌ల నుంచి ద్రవిడ్ సర్ వరకు నాకెంతో తోడ్పడ్డారు. వీరితో నా అనుభవాలే నన్ను ఎదిగేలా చేశాయి" అని పృథ్వీ చెప్పాడు.

మెరిసిన మంధాన

దక్షిణాఫ్రికాపై భారత మహిళల ఘనవిజయం


కింబర్లే: ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్‌లో భాగంగా సోమవారం జరిగిన తొలి వన్డేలో భారత జట్టు 88 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. స్మృతి మంధాన (84), కెప్టెన్ మిథాలీ



మంధాన (84)

రాజ్ (45) రాణించడంతో మొదట భారత్ 7 వికెట్లకు 213 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో జులన్ గోస్వామి (4/24), శిఖా పాండే (3/23), పూనమ్ యాదవ్ (2/22) ధాటికి దక్షిణాఫ్రికా.. 43.2 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. డేన్ వాన్ నీకెర్క్ (41) టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సంపాదించింది.

కోహ్లి భయపెట్టే రకం



సెంచూరియన్: టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మారాల్సిన అవసరముందని దక్షిణాఫ్రికా మాజీ కోచ్ రే జెన్నింగ్స్ అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌లో కోహ్లి ప్రాతినిధ్యం వహించే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు కోచ్‌గా పని చేసిన జెన్నింగ్స్.. అతను ప్రత్యర్థుల్నే కాక సహచరుల్నీ భయపెట్టే రకమని అభిప్రాయపడ్డాడు. "కెప్టెన్‌గా కోహ్లి ఇంకా అత్యుత్తమ స్థాయికి చేరలేదు. కోహ్లికి భారత క్రికెట్ వ్యవస్థ సరైన తోడ్పాటు అందించాలి. ధోని చాలా ప్రశాంతంగా వ్యవహారాలు నడిపే రకం. కోహ్లి అతడికి పూర్తి భిన్నం. అతను డ్రెస్సింగ్ రూంలో తన సహచరుల్ని కూడా భయపెట్టే రకం. చాలామంది కుర్రాళ్లు జట్టులోకి వస్తున్నపుడు డ్రెస్సింగ్ రూంలో ఇలాంటి వాతావరణం ఉండకూడదు. కాబట్టి కోహ్లికి సాయం చేస్తూ, అతడిపై సానుకూల ప్రభావం చూపించే వ్యక్తులు అవసరం. అప్పుడే అతను మెరుగైన నాయకుడవుతాడు. వయసుతో పాటే కోహ్లి మెరుగవ్వొచ్చు. అతను ప్రశాంతంగా మారొచ్చు. కోహ్లి మారడానికి సుముఖంగా ఉండే వ్యక్తే. ప్రపంచ అత్యుత్తమ ఆటగాడు కావడానికి అవసరమైన నైపుణ్యాలు అతడికున్నాయి. కానీ తనకో సాయం చేసే వ్యక్తులు మాత్రం అవసరం" అని జెన్నింగ్స్ అన్నాడు. భారత్‌తో టెస్టు సిరీస్‌కు పిచ్‌లను మార్చేందుకు దక్షిణాఫ్రికా ప్రయత్నించిందని.. అది వారికి అంత మంచి ఫలితాన్నేమీ ఇవ్వలేదని జెన్నింగ్స్ అన్నాడు.


ఫోర్బ్స్ 30లో నలుగురు అథ్లెట్లు



హీనా సిద్ధూ

దిల్లీ: బిజినెస్ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 30 అండర్‌-30లో నలుగురు అథ్లెట్లు.. క్రికెటర్లు జస్‌ప్రీత్ బుమ్రా, హర్మన్‌ప్రీత్ కౌర్, హాకీ గోల్‌కీపర్ సవితా పూనియా, షూటర్ హీనా సిద్ధూలకు చోటు దక్కింది. తమ తమ రంగాల్లో తమదైన ముద్ర వేసిన యువతను ఫోర్బ్స్ ఇండియా-30కి ఎంపిక చేశారు. సాధించిన ఘనతల ప్రభావం, యథాతథ స్థితిని అస్థిరపరిచే శక్తి, దీర్ఘకాలం నిలవగలిగే సామర్థ్యం ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. ఇప్పటికే మంచి పేరున్న వారిని పరిగణనలోకి తీసుకోలేదు.

ఉన్ముక్త్.. దవడ విరిగినా..



బిలాస్‌పూర్ (హిమాచల్ ప్రదేశ్): దిల్లీ ఓపెనర్ ఉన్ముక్త్ చంద్ (116; 125 బంతుల్లో; 12×4, 3×6) సాహసోపేత ఇన్నింగ్స్ ఆడాడు. విజయ్‌హజారే ట్రోఫీలో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్‌తో మ్యాచ్‌లో దవడ విరిగినా.. అద్భుత ప్రదర్శనతో సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌కు ముందే ప్రాక్టీస్ చేస్తుండగా ఉన్ముక్త్ దవడకు గాయమైంది. అయినా వెరవకుండా ఆడిన అతను సెంచరీ చేసి జట్టుకు భారీ స్కోరు (307/6) అందించాడు. చంద్ సహచరుడు హితెన్ దలాల్ (57) కూడా రాణించాడు. ఛేదనలో ఉత్తర్‌ప్రదేశ్ 45.3 ఓవర్లలో 252 పరుగులే చేయగలిగింది. ఉమంగ్ శర్మ (102; 104 బంతుల్లో) సెంచరీ చేసినా ఫలితం లేకపోయింది. దిల్లీ బౌలర్లలో కుల్వంత్ (4/34), ప్రదీప్ సాంగ్వాన్ (3/28) రాణించారు.



డికాక్

ఇంకో వికెట్ పడింది

- సఫారీలను వదలని గాయాల బెడద
- మిగతా వన్డేలకు డికాక్ కూడా దూరం

టెస్టు సిరీస్ గెలిచింది దక్షిణాఫ్రికానే అయినా.. భారత్ తేలిగ్గా ఏమీ లొంగలేదు. రెండు జట్ల మధ్య ఆరు వన్డేల సిరీస్ అందుకు భిన్నంగా ఏం ఉండకపోవచ్చని.. సమరం రసవత్తరంగా మారబోతోందని అందరూ ఆసక్తిగా ఎదురు చూశారు. కానీ జరుగుతున్నది వేరు!

కేప్‌టౌన్

తొలి వన్డేలో 6 వికెట్ల తేడాతో నెగ్గింది భారత్. రెండో వన్డేలో గెలుపు తేడా 9 వికెట్లయింది. డివిలియర్స్ లేక బలహీన పడ్డ దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌కు కెప్టెన్ డుప్లెసిస్ విలువైన సెంచరీతో వెన్నెముకగా నిలవబట్టి తొలి వన్డేలో ఆ జట్టు గౌరవప్రదమైన చేయగలిగింది. అయినా ఆ లక్ష్యం భారత్‌కు సరిపోలేదు. తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా పరువు నిలిపిన డుప్లెసిస్ ఆ తర్వాతి మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. డివిలియర్స్ లాగే అతడినీ వేలి గాయమే ఇబ్బంది పెట్టింది. భారత్‌తో మిగతా వన్డేలకే కాదు, టీ20లకూ దూరమయ్యాడతను. ఆ ప్రభావం తర్వాతి మ్యాచ్‌లోనే కనిపించింది. స్పిన్నర్లకు అనుకూలించిన పిచ్‌పై సఫారీ జట్టు కేవలం 118 పరుగులకే కుప్పకూలింది. ఇప్పుడు సఫారీ బ్యాటింగ్‌లో కీలకమైన మరో ఆటగాడు గాయపడ్డాడు. సిరీస్‌కు దూరమయ్యాడు. అతనే వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్. అతడి మణికట్టుకు గాయం అయిందట. కోలుకోవడానికి నాలుగు వారాలు పడుతుందట. దీంతో భారత్‌తో మిగతా నాలుగు వన్డేలకు అతను దూరమయ్యాడు. టీ20 సిరీస్‌కైనా అందుబాటులోకి వస్తాడో లేదో తెలియదు. డికాక్ స్థానంలో కొత్తగా ఎవరినీ ఎంపిక చేయలేదు. దక్షిణాఫ్రికా జట్టులో ఇప్పటికే హెన్రిచ్ క్లాసెన్ అనే మరో వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ ఉన్నాడు. అతనింకా ఒక్క వన్డే కూడా ఆడలేదు. హెన్రిచ్ కేప్‌టౌన్‌లో బుధవారం జరిగే మూడో వన్డేలో అరంగేట్రం చేయబోతున్నాడు. తొలి రెండు వన్డేల్లో 34, 20 పరుగులు చేశాడు క్వింటన్. భారత్‌పై అతడికి గొప్ప రికార్డుంది. ఈ సిరీస్ మొదలవడానికి ముందు 10 మ్యాచ్‌ల్లో 72 సగటుతో 720 పరుగులు చేశాడు. అందులో ఐదు సెంచరీలుండటం విశేషం. డివిలియర్స్ దూరమైంది తొలి మూడు వన్డేలకే. నాలుగో వన్డేకైనా అతను వస్తాడే లేదో చూడాలి. అంతకంటే ముందు మూడో వన్డేలో ఏబీ, డుప్లెసిస్, డికాక్ లేని దక్షిణాఫ్రికా బ్యాటింగ్ విభాగం ఏమాత్రం సత్తా చాటుతుందో.. భారత బౌలర్లను ఏమేరకు కాచుకుంటుందో అన్న సందేహాలు కలుగుతున్నాయి. అసలే వన్డేలు, పైగా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తొలి రెండు స్థానాల్లో ఉన్న రెండు జట్ల మధ్య పోరు అనేసరికి సిరీస్ హోరాహోరీగా, రసవత్తరంగా సాగుతుందని ఆశిస్తే.. అనూహ్యంగా ప్రత్యర్థి జట్టు బలహీన పడిపోయి, భారత్‌కు పోటీ ఇవ్వలేని స్థితికి చేరుకుంది. ఇది ఇరు దేశాల క్రికెట్ అభిమానులకు నిరాశ కలిగించే విషయమే. గతంలో ఎన్నడూ లేనంతగా బలం పుంజుకున్న భారత బౌలింగ్ విభాగం.. సఫారీలతో టెస్టు సిరీస్ నుంచే అంచనాల్ని మించి రాణిస్తోంది. మన బౌలర్లను దక్షిణాఫ్రికా మేటి బ్యాట్స్‌మెనే ఎదుర్కోలేకపోతున్నారు. సాంకేతికంగా అత్యున్నత బ్యాట్స్‌మన్ అయిన ఆమ్లా లాంటి వాడే వారి ధాటికి నిలవలేకపోతున్నాడు. ఇలాంటి తరుణంలోనే ముగ్గురు ప్రధాన బ్యాట్స్‌మెన్ సేవల్ని కోల్పోయి ఒక సాధారణ జట్టులా మారిపోయింది దక్షిణాఫ్రికా. వన్డే సిరీస్‌లో పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలంగా మారడం కూడా ఆతిథ్య జట్టుకు పెద్ద సమస్యగా మారింది. మరి ఇన్ని ప్రతికూలతల మధ్య మూడో వన్డేలో ఆతిథ్య జట్టు భారత్‌కు ఏమేర పోటీ ఇస్తుందో చూడాలి.



చలి చంపేస్తుంటే.. ఆరంభమెలా?

ప్యాంగ్‌చాంగ్: ఈ శుక్రవారం ఆరంభమయ్యే వింటర్ ఒలింపిక్స్‌కు అంతా సిద్ధమైంది. కానీ ఎముకలు కొరికే చలే నిర్వాహకులను భయపెడుతోంది. ఉష్ణోగ్రతలు -20 డిగ్రీలకు పడిపోయిన నేపథ్యంలో ఆరంభ వేడుక సజావుగా సాగుతుందో లేదో అన్న కంగారు మొదలైంది. చలికి భయపడి కొంత మంది అథ్లెట్లు ఆరంభోత్సవానికి దూరమయ్యే అవకాశముంది. ఈ చలి దుష్పరిణామాలకు భయపడుతున్న ఇటలీ.. వేడుక సందర్భంగా నిరంతరం సంచరిస్తునే ఉండాలని తన అథ్లెట్లకు సూచించింది. గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం ఉన్న కోచ్‌లు, సిబ్బంది వెచ్చని ప్రదేశంలో ఉండాలని ఇటలీ జట్టు వైద్యులు ఆదేశించారు. పైకప్పు లేని స్టేడియంలో శుక్రవారం రాత్రి ఆరంభ కార్యక్రమం జరగనుంది. తమ జట్టులోని కొంత మంది అథ్లెట్లు మార్చ్‌పాస్ట్‌కు దూరంగా ఉండే అవకాశముందని న్యూజిలాండ్ జట్టు షెఫ్ ద మిషన్ పీటర్ వార్డెల్ చెప్పాడు. సాధారణంగా వింటర్ ఒలింపిక్స్‌లో పోటీపడే అథ్లెట్లు తీవ్రమైన చలికి అలవాటు పడే ఉంటారు. కానీ గాలులు కూడా వీస్తుండడంతో చలి మరీ భయంకరంగా ఉందని కొందరు అథ్లెట్లు అంటున్నారు.

ఒలింపిక్ స్ఫూర్తిని నిలబెట్టారు: బద్ధ శత్రువులైనప్పటికీ వింటర్ ఒలింపిక్స్ కోసం చేతులు కలిపిన దక్షిణ కొరియా, ఉత్తర కొరియాలను అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) అధ్యక్షుడు థామస్ బాచ్ ప్రశంసించాడు. ఆరంభం కార్యక్రమం సందర్భంగా రెండు దేశాలు ఒకే పతాకం కింద మార్చ్‌పాస్ట్ చేయడం.. ప్రపంచానికి శక్తివంతమైన శాంతి సందేశాన్ని పంపించబోతోందని అన్నాడు. "అపనమ్మకం, వైరం వేరు చేసిన రెండు దేశాలను ఒలింపిక్ స్ఫూర్తి ఒక్క దగ్గరికి చేర్చింది. కొరియా ద్వీపకల్పంలోని ప్రతి ఒక్కరిలో ఉజ్వల భవిష్యత్తుపై ఆశలు రేకెత్తించింది" అని బాచ్ చెప్పాడు.

ఇవే ఆఖరి ఒలింపిక్స్



దిల్లీ: రికార్డు స్థాయిలో ఆరో శీతాకాల ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్న శివ కేశవన్ తనకివే ఆఖరి క్రీడలని ప్రకటించాడు. ఈనెల 9న దక్షిణకొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో ప్రారంభం కానున్న ఈ పోటీల్లో 36 ఏళ్ల శివ లూజ్ విభాగంలో పోటీపడుతున్నాడు. 1998 నుంచి శివ.. అన్ని ఒలింపిక్స్‌లోనూ పోటీపడ్డాడు. "వయసు దృష్టిలో ఉంచుకుంటే ఈ ఆటలో ఇంకా కొనసాగే అవకాశం ఉంది. సోచి క్రీడల్లో 40 ఏళ్లు పైబడిన ఇద్దరు పతకాలు కూడా నెగ్గారు. 22 ఏళ్ల నుంచి భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నా. ఇక క్రీడకు స్వస్తి చెప్పే సమయం వచ్చింది. ప్యాంగ్‌చాంగ్ క్రీడలే నా చివరి ఒలింపిక్స్. 2014 సోచి క్రీడల్లో ఐవోఏపై నిషేధం ఉన్న నేపథ్యంలో ఐఓసీ జెండాతో బరి దిగాల్సి వచ్చింది. ప్రతి నాలుగేళ్లకొకసారి భారత జెండాను మోస్తూ ఈ క్రీడల్లో పాల్గొనడం చాలా గొప్ప గౌరవంగా భావిస్తా. వింటర్ ఒలింపిక్స్‌లో ఎక్కువమంది భారతీయులు పాల్గొంటే సంతోషంగా ఉంటుంది. జర్మనీలో జరిగిన పోటీల్లో ప్రమాదం జరిగి గాయపడ్డా. ఇంకా వందశాతం కోలుకోలేదు. అయితే పోటీలు ప్రారంభమయ్యే సమయానికి ఫిట్‌నెస్ సాధిస్తానని అనుకుంటున్నా" అని శివ అన్నాడు. ఈసారి శీతాకాల ఒలింపిక్స్‌లోను నిర్వహించే అవకాశాన్ని చేజిక్కించుకున్న ప్యాంగ్‌చాంగ్ దక్షిణకొరియా రాజధాని సియోల్‌కు ఈ నగరం 125 కి.మీ దూరంలో ఉంది. ఫిబ్రవరి 9న వింటర్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవం జరగనుంది.



ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ నేటి నుంచే

భారత్‌కు సవాలే

అలోర్ సెటార్ (మలేసియా): సైనా నెహ్వాల్ ఫిట్‌నెస్ సమస్యలతో తప్పుకుంది. ప్రణయ్‌దీ అదే పరిస్థితి. ఈ నేపథ్యంలో బుధవారం ఆరంభమయ్యే ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు సవాలు తప్పకపోవచ్చు. మహిళల్లో పి.వి.సింధు, పురుషుల్లో కిదాంబి శ్రీకాంత్‌లపైనే భారత్ ఆశలు పెట్టుకుంది. గ్రూప్‌-డిలో ఉన్న పురుషుల జట్టులో శ్రీకాంత్, సాయిప్రణీత్, సమీర్ వర్మ, సుమీత్ రెడ్డి, మను అత్రి ఉన్నారు. గ్రూప్ దశలో పురుషుల జట్టు ఫిలిప్పీన్స్‌తో తన తొలి మ్యాచ్ ఆడనుంది. మహిళల్లో సింధు, శ్రీకృష్ణప్రియ, రుత్విక గద్దె, అశ్విని పొన్నప్ప, సిక్కి రెడ్డి, ప్రజక్త సావంత్, సంయోగిత బరిలో ఉన్నారు. గ్రూప్‌-డబ్ల్యూలో జపాన్, హాంకాంగ్‌లతో భారత్ తలపడాల్సి ఉంది. ఈ టోర్నీని మే 20 నుంచి జరిగే ప్రతిష్ఠాత్మక థామస్ అండ్ ఉబెర్ కప్‌కు క్వాలిఫయర్‌గా పరిగణిస్తారు.



పుజారా అర్ధ సెంచరీ

ఈనాడు, హైదరాబాద్: విజయ్ హజారే ట్రోఫీలో సౌరాష్ట్ర శుభారంభం చేసినా.. స్టార్ ఆటగాళ్ళు రవీంద్ర జడేజా (0/43), జయదేవ్ ఉనద్కత్ (1/43) తేలిపోయారు. సోమవారం జింఖానా మైదానంలో జరిగిన గ్రూపు-డి మ్యాచ్‌లో సౌరాష్ట్ర 32 పరుగుల ఆధిక్యంతో చత్తీస్‌గఢ్‌పై విజయం సాధించింది. తొలుత సౌరాష్ట్ర 50 ఓవర్లలో 7 వికెట్లకు 286 పరుగులు చేసింది. షెల్డన్ జాక్సన్ (106; 107 బంతుల్లో 14×4, 2×6), పుజారా (60; 90 బంతుల్లో 4×4) రాణించారు. ఉతప్ప (9) విఫలమయ్యాడు. అనంతరం చత్తీస్‌గఢ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 254 పరుగులు చేయగలిగింది. ధర్మేంద్ర జడేజా (4/41), శౌర్య సనాందియా (3/53) విజృంభించి జట్టుకు విజయాన్ని అందించారు. సోమవారం జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో సర్వీసెస్‌పై హైదరాబాద్.. రాజస్థాన్‌పై ఆంధ్ర విజయాలు సాధించాయి.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00